
'సామాన్యులకు వైద్యం
ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు.
అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 217

శనివారం 29-10-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




పేదవాడికి కూడా పెద్ద వైద్యం అందుబాటులోకి తీసుకురావాలన్న తపనతో ఇప్పటికే వైద్య రంగంలో అనేక విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిన జగనన్న ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వైద్య సేవల్లో వేస్తున్న మరో ముందడుగు..

## "డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ" పరిధిలో క్రొత్తగా మరో 809 వైద్య చికిత్సలు..!

## ఇప్పటికే ఉన్న 2,446 చికిత్సలతో కలిపి రాష్ట్రవ్యాప్తంగా

# ఇక నుండి 3,255 చికిత్సలకు ఉచితంగా వైద్యం..!

నిన్ననే లాంఛనంగా ప్రారంభించిన గౌ॥ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..


ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

104
కాల్ సెంటర్ ద్వారా
ఆరోగ్యశ్రీ
పూర్తి సమాచారం
అందుబాటులో..

# డా॥ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

పేదవాడికి కూడా పెద్ద వైద్యం..

- వైద్యం ఖర్చు రూ.1,000 దాటిన అన్ని చికిత్సలు డా॥ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చేట్లుగా తపన, తాపత్రయంతో అడుగులు వేస్తున్న జగనన్న ప్రభుత్వం..
- వార్షిక ఆదాయ పరిమితి 5 లక్షలకు పెంపుతో రాష్ట్రంలోని దాదాపు 95 శాతం కుటుంబాలకు ఆరోగ్యశ్రీ సేవలు.. 1,41,23,843 కుటుంబాలకు లబ్ధి జరుగుతోంది...
- దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ పరిధిలోకి కరోనా, బ్లాక్ ఫంగస్, మిస్-సి వంటి జబ్బులు..
- అన్ని రకాల క్యాన్సర్లూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి.. పరిమితి లేకుండా ఎంత ఖర్చైనా ఉచితంగానే చికిత్స..



- దాదాపు 12 లక్షలకు పైగా ఖర్చయ్యే బై లేటరల్ కాక్లియర్ ఇంప్లాంట్ వంటి ఆధునిక సర్జరీలు కూడా పూర్తి ఉచితంగా..
- ఆసుపత్రుల్లో జవాబుదారీతనం పెంచేలా ఆరోగ్యశ్రీ చికిత్స అనంతరం పేషెంట్ డిశ్చార్జ్ సమయంలో ఆసుపత్రుల్లో వారికి అందిన సేవల నాణ్యతపై ఫీడ్ బ్యాక్ తీసుకున్న తర్వాతనే ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపులు..
- రోగులకు సాధికారత కల్పిస్తూ, ఆసుపత్రులకు చెల్లించాల్సిన బిల్లులను రోగుల ఖాతాల్లో జమ చేసి వారి ఖాతాల నుండి నేరుగా ఆసుపత్రులకు చెల్లించే ఏర్పాటు..

**వైఎస్సార్ ఆరోగ్య ఆసరా :** దేశంలో ఎక్కడా లేని విధంగా "ఆరోగ్యశ్రీ"లో చికిత్స తీసుకొని ఇంటికి వెళ్లిన తర్వాత సైతం వారు పూర్తిగా కోలుకొని తిరిగి పనుల్లోకి వెళ్లే వరకు జీవనోపాధికి ఎలాంటి లోటు లేకుండా "వైఎస్సార్ ఆరోగ్య ఆసరా" ద్వారా రోజుకు రూ. 225ల చొప్పున నెలకు రూ. 5,000లు, రెండు నెలలైతే రూ.10,000లు అలా ఎన్ని రోజులైనా డాక్టర్ల సూచన మేరకు ఆరోగ్య ఆసరా భృతి అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిన జగనన్న ప్రభుత్వం. ఇప్పటివరకు 13,09,344 మందికి రూ. 821.49 కోట్ల భృతి అందజేసిన జగనన్న ప్రభుత్వం..

పేదవారికి కూడా ఆధునిక వైద్యం ఉచితంగా అందించాలన్న సమున్నత లక్ష్యంతో.. 2007లో మహా నేత, దివంగత ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన ఆయన మానస పుత్రిక "ఆరోగ్యశ్రీ" పథకాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పరిస్థితిని చక్కదిద్ది "ఆరోగ్యశ్రీ"ని పునరుజ్జీవింప చేయడంతో పాటు 3,255 చికిత్సలను "ఆరోగ్యశ్రీ"లో చేర్చి, "ఆరోగ్య ఆసరా" ను కూడా దానికి జత చేస్తూ పేదలకు ఆపన్నహస్తం అందిస్తోంది..

## తేడా గమనించండి..

### గత ప్రభుత్వం..

1. గతంలో అరకొరగా ఆరోగ్యశ్రీ సేవలు.. అవీ సమయానికి ఆసుపత్రులకు డబ్బులు ఇవ్వక నీరుగార్చే కార్యక్రమం.. ఆరోగ్య ఆసరా లాంటి పథకం లేనేలేదు.. ఆరోగ్యశ్రీ,104,108 పథకాలకు చేసిన వ్యయం ఏడాదికి సగటున కేవలం రూ.1,100 కోట్లు మాత్రమే..
2. కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ.. రోజుల తరబడి నిరీక్షణ..
3. పేదవారికేదైనా పెద్ద జబ్బు వస్తే అటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందక, ఇటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేక, ప్రాణం మీదకొస్తున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి..!! పేరుకు 919 ఆసుపత్రుల్లో 1059 వైద్య చికిత్సలకు ఆరోగ్యశ్రీ అందిస్తున్నామని చెప్పినా, అందించిన సేవలు అతి స్వల్పం..
4. నెట్ వర్క్ ఆసుపత్రులకు నెలల తరబడి బిల్లులు చెల్లించక పోవడంతో ఆరోగ్యశ్రీ క్రింద వైద్యం అందించేందుకు ఆసుపత్రుల నిరాసక్తత.. గత ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు సంవత్సరం పైగా చెల్లించకుండా పెట్టిన బకాయిలు 2019 నాటికి రూ. 680 కోట్లు..
5. శిథిలావస్థలో ఆస్పత్రి భవనాలు.. పాడైపోయిన వైద్య పరికరాలు.. కొత్త ఆస్పత్రుల ఊసే లేదు.. ఆస్పత్రుల్లో మౌలిక వసతులు లేక కునారిల్లిన వైద్య వ్యవస్థ..
6. నాసిరకం మందులు.. అవి కూడా అరకొరగానే ఆస్పత్రుల్లో అందుబాటు..
7. అతి స్వల్పంగా, అదీ అతి కొద్దిమొత్తంలో ఆరోగ్య పెన్షన్లు.. అవీ తమ వారికే.. అందులోనూ వివక్ష, లంచాలు, పారదర్శకత లేమి..
8. వైద్య శాఖలో విపరీతంగా ఖాళీలు..
9. అతి స్వల్పంగా అంబులెన్స్ సేవలు.. ప్రాణాపాయ స్థితిలో ఉన్నా గంటల తరబడి అంబులెన్స్ కోసం వేచి ఉండాల్సిన దుస్థితి..
10. గతంలో ఏ చిన్న జబ్బు వచ్చినా వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులు సైతం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కి వెళ్లాల్సిన దుస్థితి.. తీరా అక్కడికి వెళితే డాక్టర్లు అందుబాటులో ఉంటారో లేదో తెలియని దిక్కుమాలిన స్థితి..

### మన ప్రభుత్వం..

1. వార్షిక ఆదాయ పరిమితి 5 లక్షలకు పెంపుతో రాష్ట్రంలోని దాదాపు 95 శాతం కుటుంబాలకు ఆరోగ్యశ్రీ సేవలు.. 1,41,23,843 కుటుంబాలకు లబ్ధి.. మన ప్రభుత్వం "డా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ"కి రూ. 2,900 కోట్లు, "డా. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా"కు రూ. 400 కోట్లు, 104, 108 కు రూ. 300 కోట్లు కలిపి ఏడాదికి చేస్తున్న ఖర్చు రూ. 3,600 కోట్లు.. అంటే గత ప్రభుత్వం ఏడాదికి చేసిన ఖర్చుకు దాదాపు 3 రెట్లు అధికం..!
2. దరఖాస్తు చేసుకున్న 20 రోజుల లోపే లబ్ధిదారుల గడప వద్దనే గ్రామ/వార్డు సచివాలయాలు, వాలంటీర్లు, ఏఎన్ఎంల ద్వారా క్యూఆర్ కోడ్ తో కూడిన ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు..
3. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా 2,228 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 3,255 చికిత్సలకు ఉచితంగా వైద్యం.. రూ.1,000 ఖర్చు దాటిన అన్ని చికిత్సలు ఆరోగ్య శ్రీ పరిధిలోకి తీసుకువచ్చేలా చురుగ్గా చర్యలు.. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై నగరాలలోని 202 కార్పొరేట్ ఆసుపత్రులలో, 17 సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఉచిత చికిత్సలు అందుబాటులో..
4. క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపు.. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ బకాయిలు రూ. 680 కోట్లతో కలిపి కేవలం 3 ఏళ్లలోనే ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు రూ. 7,338 కోట్లు చెల్లించింది..!
5. ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు సమూలంగా మార్చే 'నాడు-నేడు' పథకంలో భాగంగా రాష్ట్రంలోని గ్రామ /వార్డు సచివాలయాల పరిధిలో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు / 560 అర్బన్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం, 1,142 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 53 ఏరియా ఆసుపత్రులు, 12 జిల్లా ఆసుపత్రులు, 175 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి.. ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీ ఉండేలా, కొత్తగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణం.. మెడికల్ కాలేజీలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలలు.. కొత్తగా మూడు క్యాన్సర్, ఒక కిడ్నీ స్పెషాలిటీ ఆసుపత్రులు.. ITDA పరిధిలో 5 మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం..
6. అన్ని మందులు WHO/GMP ప్రమాణాలు కలిగినవి మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రులలో ఉండేటట్లు చర్యలు..
7. లెప్రసీ, పక్షవాతం, డయాలసిస్ తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ. 3,000/- నుండి రూ.10,000/- వరకు పెన్షన్లు.. పారదర్శకంగా, లంచాలు, వివక్షకు తావులేకుండా అర్హులైన అందరికీ ప్రతి నెల మొదటి తారీఖునే ఠంచనుగా వాలంటీర్ల ద్వారా పెన్షన్లు..
8. ఇప్పటికే 46,530 పోస్టుల్లో వైద్య సిబ్బంది నియామకం.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏ ఒక్క పోస్టూ ఖాళీగా ఉండకూడదన్న తపనతో అక్కడక్కడా మిగిలిపోయిన కొన్ని ఖాళీల భర్తీకి కూడా ఇటీవలే వాక్-ఇన్- ఇంటర్వ్యూలు నిర్వహించి 329 మంది స్పెషలిస్ట్, సూపర్ స్పెషలిస్ట్ వైద్యులను నియమించాం.. నిరంతర వాక్-ఇన్- ఇంటర్వ్యూల ద్వారా మిగిలిపోయిన ఆ అతి కొన్ని ఖాళీల భర్తీకి చురుగ్గా చర్యలు..
   మన ప్రభుత్వం వైద్యరంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, వైద్య సిబ్బంది, స్పెషలిస్టులు, సూపర్ స్పెషలిస్టుల నియామకాల కారణంగా 2019 నాటికి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉన్న 970 పీజీ సీట్లకు అదనంగా మరో 953 సీట్లు అందుబాటులో.. దాదాపు రెట్టింపు కానున్న సీట్ల సంఖ్య..
9. తీవ్ర నిర్లక్ష్యానికి గురైన 104 మరియు 108 సర్వీసుల విభాగాలకు జీవం పోస్తూ అధునాతన వసతులతో కొత్తగా 1128 వాహనాలు.. అధునాతన వసతులతో పూర్తి ఎయిర్ కండిషన్‌తో కొత్తగా 500 డా॥ వైఎస్సార్ తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాలు..
10. మన ప్రభుత్వంలో మన గ్రామంలోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, మన గడప వద్దనే వైద్యం అందేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్.. ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్ గా అమలు.. ఉగాది నుండి పూర్తి స్థాయిలో..

**ఇది ప్రాణం విలువ తెలిసిన నాయకత్వం.. ఇది బ్రతికించే ప్రభుత్వం..**

శ్రీమతి విడదల రజిని, వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖామాత్యులు

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ
శనివారం ॥ 29-10-2022



జ్యోత్స్న చెరువు

హైదరాబాద్ నగరం... దుర్గం చెరువు వంతెనకు సస్పెండెడ్ రోప్ ప్లాట్‌ఫామ్.
కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణంలో ఓ వలయాకారపు షాఫ్ట్.
బహుళ అంతస్తుల నిర్మాణంలో పాసెంజర్ అండ్ మెటీరియల్ హాయిస్ట్.
ఇవన్నీ సాంకేతికరంగం రూపొందించుకున్న అద్భుతమైన ఆవిష్కరణలు.
వీటి రూపకల్పన... తయారీలో కీలకమైన మహిళ... జ్యోత్స్న చెరువు.

# స్థిరత్వమే సక్సెస్ సూత్రం

'ఇండిపెండెంట్‌గా నిలబడాలంటే ఇండిపెండెంట్‌గా ఆలోచించాలి, ఇండిపెండెంట్‌గా నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే మీరు పదిమంది నడిచే దారిలో పదకొండవ వ్యక్తిగా మిగలకుండా మీదైన కొత్త పథాన్ని నిర్మించుకోగలుగుతా'రంటూ మహిళలకు సందేశమిస్తుంటారు... సీఎమ్‌ఏసీ, మెకనైజేషన్ అండ్ ఆటోమేషన్ ఇన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ డైరెక్టర్ జ్యోత్స్న చెరువు. 'ప్రొడ్ టు మేక్ ఇన్ ఇండియా, ఎక్స్‌పోర్ట్ దెమ్ యాజ్ మేడ్ ఇన్ ఇండియా' నినాదంతో పరిశ్రమను విజయవంతంగా నిర్వహిస్తున్న జ్యోత్స్న చెరువు తన వైవిధ్యభరితమైన పారిశ్రామిక ప్రయాణాన్ని సాక్షితో పంచుకున్నారు.

## ■ సీబీఐటీ స్టూడెంట్‌ని!

''నేను పుట్టింది నెల్లూరు జిల్లా బిట్రగుంటలో. తాత అప్పుడు అక్కడ రైల్వే ఉద్యోగి. అలా అది మా అమ్మమ్మగారి ఊరైంది. నాన్న బ్యాంకు ఉద్యోగరీత్యా మేము పెరిగింది, చదువు, కెరీర్ అంతా హైదరాబాద్‌లోనే. మా కాలేజ్ రోజుల్లో అమ్మాయిలు సివిల్ ఇంజనీరింగ్‌ని పెద్దగా తీసుకునేవాళ్లు కాదు. నాకు సీబీఐటీలో సివిల్ ఇంజనీరింగ్ సీటు వచ్చింది. చేరిన తర్వాత సబ్జెక్ట్‌లో ఉన్న అందం తెలిసి వచ్చింది. ఆనందంగా ఆస్వాదిస్తూ కోర్సు పూర్తి చేశాను. ఆ తర్వాత ఉస్మానియాలో ఎంబీఏ చేశాను. మా వారు మెకానికల్ ఇంజనీర్. పెళ్లి తర్వాత కొంతకాలం ఇద్దరమూ ఉద్యోగం చేశాం. మా వారి ఉద్యోగరీత్యా పూనాకి వెళ్లాం. అప్పుడు పిల్లలు చిన్నవాళ్లు. నేనక్కడ ఉద్యోగంలో చేరలేదు, కానీ హోమ్ బ్యూటిఫికేషన్ వంటి సర్వీస్ ప్రాజెక్టులు మొదలుపెట్టాను. మార్కెట్ అవగాహన ఉంది కాబట్టి నిర్మాణ రంగం మీద దృష్టి పెట్టమని ఓ రిటైర్డ్ పర్సన్ చెప్పిన మాట నన్ను పారిశ్రామికవేత్తగా నిలిపాయి.

## ■ నిర్మాణరంగంలో సాంకేతిక వేగం!

పిల్లలు పెద్దవుతున్నారు, హైదరాబాద్‌కి వెళ్లి పోదామనే ఆలోచన వచ్చిన నాటికి హైదరాబాద్ నగరంలో భవన నిర్మాణరంగం కొత్త రూపు సంతరించుకుంటోంది. 25–30 అంతస్తుల భవనాల నిర్మాణం మొదలైన రోజులవి. అది నాకు బాగా కలిసి వచ్చింది. నిర్మాణరంగంలో అవసరమైన కొత్త టెక్నాలజీతో కూడిన ఎక్విప్‌మెంట్ తయారీని ప్రారంభించాం. ఎలక్ట్రో మెకానికల్ ఎక్విప్‌మెంట్‌ని అప్పటివరకు చైనా, యూరప్ నుంచి దిగుమతి చేసుకుంటూ వచ్చిన నిర్మాణసంస్థలకు అవన్నీ ఇండియాలోనే దొరకడం మంచి సౌలభ్యం కదా. అలా 2006లో మొదలైన మా కంపెనీ ఇప్పుడు దేశవ్యాప్తంగా మూడు వందలకు పైగా సంస్థలకు సేవలందిస్తోంది. వ్యాపారం అంటే... సమాజంలోని అవసరాన్ని గుర్తించి ఆ అవసరాన్ని తీర్చడం, ఒక సమస్యకు పరిష్కారం చూపించడం. అప్పుడే బిజినెస్ విజయవంతమవుతుంది. మా కంపెనీ సిద్ధాంతం నాలుగు 'ఎస్'లు... స్పీడ్, సేఫ్టీ, సేవింగ్స్, స్ట్రెంగ్త్. పని వేగంగా జరగాలి, పనిలో పాల్గొనే కార్మికులకు రక్షణ కల్పించాలి, ప్రాజెక్టు వ్యయం తగ్గాలి, పని చేసే కార్మికుని శక్తిని ఇనుమడింప చేయాలి. మా క్లయింట్ అవసరానికి తగినట్లు కస్టమైజ్‌డ్ ఎక్విప్‌మెంట్‌ను డిజైన్ చేయడం, తయారు చేయడం, ఇన్‌స్టాల్ చేయడం, యాన్యువల్ మెయింటెనెన్స్ సర్వీస్ ఇవ్వడం, ఆ కంపెనీ ప్రాజెక్టు మరో చోటకు మారినప్పుడు ఎక్విప్‌మెంట్‌ని ఆ ప్రదేశానికి తీసుకువెళ్లి అమర్చడం... ఇలా ఉంటుంది మా పని. ఇప్పుడు దేశం ఎల్లలు దాటి విదేశాలకు కూడా విస్తరించాం. నా రంగంలో నేను లక్ష్యంగా పెట్టుకున్న శిఖరానికి చేరాననే చెప్పాలి. నా వంతు బాధ్యతగా మహిళా సమాజానికి, యువతకు కెరీర్ ప్లానింగ్ గురించి చెబుతున్నాను. కోవె (కన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్) తెలంగాణ అధ్యక్షురాలిగా వేలాది మహిళలకు, యువతకు ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్‌సెట్ క్లాసులు చెప్తున్నాను. కంపెనీ నిర్వహణలో ఉద్యోగులను కలుపుకుపోవడం చాలా అవసరం. పని వరకే చేయించుకుని మిగిలిన విషయాల్లో వాళ్లను డార్క్‌లో ఉంచరాదు. కంపెనీ భవిష్యత్తు ప్రణాళికలను వారితో చర్చించాలి. ఈ కంపెనీతో కొనసాగితే కెరీర్‌లో పైకి ఎదగగలమనే భరోసా కలిగితేనే ఉద్యోగులు మనతో కొనసాగుతారు. ఇలాంటి అనేక విషయాలను చెబుతుంటాను. ఈ జర్నీ నాకు సంతోషంగా ఉంది. ఏటా ఈ ఏడాది ఎంతమంది మహిళలకు దిశానిర్దేశం చేశానని లెక్కచూసుకున్నప్పుడు కనిపించే పెద్ద సంఖ్య నాకు ఆత్మసంతృప్తి కలిగించే విషయం'' అని వివరించారు జ్యోత్స్న చెరువు.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు : మోహనాచారి

### లీడర్‌గా ఎదిగేది కొందరే!

మా దగ్గరకు ట్రైనింగ్‌కు వచ్చిన మహిళలకు నేను చెప్పే తొలిమాట 'మీ స్ట్రెంగ్త్ ఏమిటో మీరు తెలుసుకోండి' అని. వాళ్లకు ఏం వచ్చో తెలిసిన తర్వాత వాళ్లకు ఎటువంటి కెరీర్ సౌకర్యంగా ఉంటుందో సూచిస్తాను. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలంటే... మొదటగా ఉండాల్సింది స్థిరత్వం. చిన్న ఉదాహరణ చెబుతాను... ఒక ఇస్త్రీ షాపు వ్యక్తి రోజూ కచ్చితంగా షాపు తెరవకపోతే మనం దుస్తులు ఇవ్వం కదా! రోజూ ఠంచన్‌గా పని చేసే వ్యక్తికి మాత్రమే ఇస్తాం. ఇంటి ముందుకు వచ్చే వాళ్ల దగ్గర కూరగాయలు కొనాలన్నా అంతే. మన సర్వీస్ అందుకునే క్లయింట్ ప్రత్యామ్నాయాన్ని వెతుక్కునే పరిస్థితిని కల్పించకూడదు. ఎందరు వచ్చినా, ఎవరూ రాకపోయినా సరే వర్క్‌ప్లేస్‌ని మూతవేయరాదు. నేను నా రంగంలో సంపాదించుకున్న నమ్మకం అదే. ఏ సమయంలో ఫోన్ వచ్చినా సరే... ఎవరో ఒకరు హాజరవుతారనే భరోసా కల్పించడంలో విజయవంతం అయ్యాం. మా దగ్గరకు కోర్సులో చేరిన పాతిక మందిలో చివరకు ఆ కోర్సును ఉపయోగపెట్టుకునేవాళ్లు పదికి మించరు. కోర్సు సమయంలో 'ఇంటికి బంధువులు వచ్చార'ని క్లాసు మానేసే వాళ్లు ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా కొనసాగలేరు. బిజినెస్ రంగంలో ఉన్న ఇద్దరు మగవాళ్లు కలిస్తే తమ వ్యాపారం గురించి, ఇతరుల వ్యాపారం గురించి, విస్తరణకు ఉన్న అవకాశాల గురించి మాట్లాడుకుంటారు. అదే ఇద్దరు మహిళలు లిలేషన్ షిప్ మీద మాట్లాడినంతగా తమ ప్రొఫెషన్ గురించి చర్చించరు. ప్రొఫెషన్ గురించి మాట్లాడగలిగిన మహిళలే లీడర్‌లుగా ఎదుగుతారు. ఫీల్డ్‌లో విజయవంతంగా నిలబడగలుగుతారు.

– జ్యోత్స్న చెరువు, డైరెక్టర్, సిఎమ్‌ఏసీ,
ప్రెసిడెంట్, కోవె తెలంగాణ





ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, వైఎస్ భారతిరెడ్డిల నుంచి తెలుగు పర్సన్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని అందుకుంటున్న ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వరరెడ్డి

## సాక్షి ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం

## సాక్షి టీవీలో నేడు ప్రసారం




విభిన్న రంగాల్లో ప్రతిభ, సామాజిక సేవకు గుర్తింపుగా గత ఏడేళ్లుగా సాక్షి మీడియా గ్రూప్ ఎక్సలెన్స్ అవార్డులు అందిస్తోంది. అందులో భాగంగా 2021 ఏడాదికి గాను విశిష్ట సేవలందించిన పలువురు ప్రముఖులను సాక్షి మీడియా గ్రూప్ ఎక్సలెన్స్ అవార్డులతో సత్కరించింది. నిస్వార్థంగా సేవ చేస్తోన్న వ్యక్తులకు, ఆదర్శంగా నిల్చిన వారికి, ఎంచుకున్న రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అవార్డులు అందించారు. కన్నుల పండువగా జరిగిన ఈ కార్యక్రమంలో పురస్కార గ్రహీతల వివరాలు, వారి స్పందనలు నేడు సాక్షి టీవీలో... రేపు సాక్షి ఫ్యామిలీలో...

**అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సాక్షి టీవీలో శనివారం సాయంత్రం 5 గంటలకు, తిరిగి ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రసారమౌతుంది.**

సాక్షి
SAKSHI TV

పర్యావరణం

# ప్రకృతి సాక్షిగా... మాటలే పాఠాలుగా

'మనకు అడవులు ఎందుకు ముఖ్యం?' అనే ప్రశ్నకు ఆ గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రజలు చెప్పిన జవాబులు వైల్డ్‌లైఫ్ సైంటిస్ట్ సాక్షి రాణాకు ఆశ్చర్యం కలిగించాయి.
ఆ జవాబులలో ఒకటి...
'వంటచెరుకుకు ఎలాంటి లోటూ ఉండదు'
'మనం ఆరోగ్యంగా జీవించాలంటే అడవి చల్లగా ఉండాలి. అడవి మన ప్రాణం. దైవం' అంటూ గ్రామీణ ప్రాంతాలలో ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రజల ఆలోచన ధోరణిలో మార్పు తీసుకు వస్తోంది సాక్షి రాణా...



కలేసర్ గ్రామ ప్రజలతో సాక్షి

ప్రకృతికి, మనిషికి మధ్య బంధాన్ని బలోపేతం చేస్తే ప్రకృతి పరిరక్షణ సులువు అవుతుందనే సత్యాన్ని నమ్మింది ఢిల్లీకి చెందిన వైల్డ్‌లైఫ్ సైంటిస్ట్ సాక్షి రాణా. ఆమె క్షేత్రస్థాయిలో పని చేస్తుంది. ప్రకృతి పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

'అడవులకు సమీపంలో ఉండే చాలా గ్రామాల్లో ప్రజలలో అక్షరాస్యత చాలా తక్కువ. వంటచెరకు నుంచి వనమూలికల వరకు అడవిని ఉపాధికేంద్రంగా మాత్రమే చూస్తున్నారు' అంటున్న సాక్షి వారి ఆలోచన ధోరణిలో మార్పు తీసుకురావడానికి ఊరూరు తిరుగుతూ ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది.

హరియాణాలోని కలేసర్ గ్రామంలో ప్రకృతి పరిరక్షణకు సంబంధించి ఎన్నో విషయాల గురించి మాట్లాడింది సాక్షి. ప్రజలు చాలా శ్రద్ధగా విన్నారు. తరువాత ఎన్నో సందేహాలు అడిగారు. వాటికి ఓపికగా సమాధానాలు చెప్పింది.

ఆ సమయంలో తనకు అర్థమైన విషయం ఏమిటంటే... శాస్త్ర రంగానికి, సామాన్య ప్రజలకు మధ్య చాలా దూరం ఉందని, వారి మధ్య దూరం లేకుండా చేస్తే గొప్ప ఫలితాలు వస్తాయనే నమ్మకం ఏర్పడింది.

'తరాలు మారుతున్న కొద్దీ అభిరుచులు, అలవాట్లలో మార్పులు వస్తున్నాయి. గత తరాలతో పోల్చితే ఈ తరానికి ప్రకృతి గురించి అంతగా అవగాహన లేదు' అంటున్న సాక్షి రాణా స్కూళ్లు, కాలేజీలలో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

యూనివర్శిటీ ఆఫ్ ఢిల్లీ నుంచి పాలిమర్ సైన్స్‌లో పట్టా పుచ్చుకున్న సాక్షి ఒకరోజు ఆలోచనలో పడింది.

'రసాయనాలు, ప్రయోగశాలలకే పరిమితం అవుతున్నానా!' అనే సందేహం ఆమెను పీడించింది.

అప్పుడు తనకు ప్రకృతి గుర్తుకు వచ్చింది.

'ప్రకృతి అంటే తనకు ఇష్టం కాదు. ప్రాణం!

పుట్టి పెరిగింది ఢిల్లీలో అయినప్పటికీ తన మూలాలు ఉత్తరాఖండ్ హిమాలయ ప్రాంతంలోని బోటియ (రోంగ్పా) తెగలో ఉన్నాయి. రోంగ్పా ప్రజలకు ప్రకృతి అంటే దైవం. వారి జీవన విధానంలో ప్రకృతి మమేకమై ఉంది. వేసవి సెలవుల్లో ఢిల్లీ వదిలి కొండ ప్రాంత గ్రామాలలోని బంధువుల ఇంట్లో గడిపేది సాక్షి. అలా తనకు ప్రకృతితో బాల్యం నుంచే చెలిమి ఏర్పడింది.



సాక్షి రాణా

'అభివృద్ధి అంటూ ఆకాశం వైపే చూస్తున్నాం. నేల మీద ఉన్న వాస్తవాలను చూడడం లేదు' అంటున్న సాక్షి ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన రంగంలోనే పనిచేయాలని నిర్ణయించుకుంది. అలా అని ఆఫీస్‌కు, పరిశోధనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అవి సత్ఫలితాలు ఇవ్వడం తనకు మరింత ఉత్సాహాన్ని, బలాన్ని ఇస్తుంది.

ఢిల్లీ కేంద్రంగా పట్టణ ప్రాంత జీవవైవిధ్యంపై రకరకాల కళారూపాల ద్వారా ప్రచారం చేస్తున్న యువబృందాలతో కలిసి పనిచేస్తోంది.

ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన సమాచారం పంచుకోవడానికి, స్ఫూర్తిదాయకమైన వ్యక్తుల గురించి పరిచయం చేయడానికి సోషల్ మీడియాను బలంగా వాడుకుంటుంది. మంచుచిరుతల నుంచి హిమానీ నదాల వరకు తన భావాలను పంచుకుంటుంది సాక్షి రాణా.

# అపూర్వమైన ఆలోచన

'వయసు పైబడటంతో ఏ పనీ మునుపటి ఉత్సాహంతో చేయలేకపోతున్నాను' అనే మాట పెద్దల నోట తరచూ వినిపిస్తుంటుంది. అయితే, కేరళలోని కొట్టాయంలో ఉంటున్న 89 ఏళ్ల ఈ బామ్మను చూస్తే మాత్రం మనమెందుకు ఇలాంటి ఆలోచన చేయలేం అనిపించక మానదు.

ఇటీవల 89వ పుట్టినరోజు వేడుకను తన లాంటి వయసు పైబడిన వారి మధ్య ఆనందంగా జరుపుకున్న ఈ బామ్మ పేరు కరుప్పెరిల్ తంకమ్మ. ఐదేళ్ల క్రితం ఆమె తన పూర్వీకుల ఇంటి తలుపులను ఒంటరి వృద్ధ మహిళల సంరక్షణ కోసం వీరిలో ఉత్సాహం నింపడానికి తెరిచింది.

### ఒంటరితనం నుంచి..

ఒక వయసు దాటాక పిల్లలు స్థిరపడతారు, భాగస్వామి దూరమవుతారు. ఇలాంటి పరిస్థితే తంకమ్మ జీవితంలోనూ జరిగింది. ఆమె రిటైర్డ్ హిందీ టీచర్. ఆమె ఇద్దరు పిల్లలు పట్టణాల్లో స్థిరపడ్డారు. భర్త ఎనిమిదేళ్ల క్రితం మరణించాడు. కొద్దిరోజులు పిల్లల దగ్గర రోజులు గడిపింది. పిల్లలు ఉద్యోగాల్లో బిజీ. మనవలు, మనవరాళ్లు చదువుల్లో బిజీ. 'ఈ వయసులో మా రోజులు ఒంటరిగానే గడుస్తుంటాయి. కానీ, మేము కోరుకునేది మరొకరి కంపెనీ మాత్రమే. బిజీగా ఉన్నవారు అన్ని వేళలా అందుబాటులో ఉండలేరు. ఇలా రోజులు గడుస్తున్నప్పుడే వయసు పైబడిన వారి రోజులను ఉత్సాహంగా మార్చడానికి, వారికి నచ్చిన పనుల్లో వారిని నిమగ్నమయ్యేలా చేయాలనే ఆలోచన వచ్చింది' అని చెబుతారు తంకమ్మ. ఆమెకు కొట్టాయంలో వారసత్వంగా వచ్చిన 200 ఏళ్ల నాటి వారి పూర్వీకుల ఇల్లు ఉంది. ఆ ఇంటిని వృద్ధుల కోసం డే కేర్ సెంటర్‌గా ఉపయోగించాలనుకుంది. దీనివల్ల స్థానిక యువతులకు ఉపాధి కూడా కల్పించవచ్చు అనుకుంది. దీనికి ఆమె పిల్లలు శ్రీకుమార్, సతీష్ కుమార్, గీత మద్దతు పలికారు. వారు ఆ ఇంటి పునరుద్ధరణకు సహకరించారు. దీంతో పాటు ఆమె చొరవ గురించి ప్రచారం చేశారు.



తను ఏర్పాటుచేసిన సెంటర్‌లో ఇతర సభ్యులతో కలిసి...



పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటూ...

### చేయదగిన పనులు


'మా ప్రాంతంలో అమ్మ పరిచయం అవసరం లేదు' అని న్యూయార్క్ ఆధారిత సంస్థలో చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ అయిన శ్రీ కుమార్ చెబుతారు. 'ఆమె టీచర్ కాబట్టి, ఆమె మనకంటే ఎక్కువమందితో కనెక్ట్ అయ్యింది. ఆమె సంపాదన ఇతర మహిళల సాధికారత కోసం ఖర్చుపెట్టడానికి ఇష్టపడే వ్యక్తి. ఈ వయస్సులో కూడా, ఆమె ఈ డే కేర్‌ను విస్తరించడానికి కొత్త ఆలోచనలు చేస్తుంది' అని ప్రశంసిస్తారు.

కొట్టాయంలోని మానవోదయ పాకాలవీడు అని పిలువబడే ఈ ఇల్లు అధికారికంగా స్వచ్ఛంద సంస్థగా నమోదు చేయబడింది. అక్టోబర్ 11, 2017న ఈ ఇంటినుంచి కార్యకలాపాలు ప్రారంభించింది ఈ బామ్మ. ఇక్కడ రోజువారీ కార్యకలాపాలు నిర్వహించడం కోసం ఐదుగురు ఉద్యోగులు డే కేర్‌లో పనిచేస్తున్నారు. ఇక్కడికి వచ్చినవారు క్యాండిల్ లైట్లు, అగరుబత్తులు, పేపర్ బ్యాగులు, డిటర్జెంట్లు, క్లీనింగ్ లోషన్‌లు తయారు చేస్తారు. తయారు చేసిన ఉత్పత్తులను డే కేర్ సమీపంలోని ఒక దుకాణం ద్వారా విక్రయిస్తారు. ఆ ఆదాయం పూర్తిగా ఈ డే కేర్ కొనసాగించడానికి ఉపయోగిస్తారు.

'ఇంట్లో చేయగల కుట్టుపనిపై ఉచిత కోర్సు కూడా ఇక్కడ లభిస్తుంది. డే కేర్‌లోని ఉద్యోగులందరూ యువతులు. వీరిలో ఇద్దరు సోషల్ వర్క్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు' అని చెప్పే తంకమ్మ కుమార్తె గీత ప్రతి వారాంతంలో ఇంటికి వెళ్లి తల్లి చేసే కార్యకలాపాలకు సహకరిస్తుంటుంది. పాకలవీడులో ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు వృద్ధులను వారి ఇళ్ల నుండి డే కేర్ వాహనం ద్వారా పికప్ చేయడంతో ప్రారంభమవుతుంది. మొదట ప్రార్థన, తర్వాత ధ్యానం, యోగా సెషన్‌లో వార్తాపత్రిక చదవడం, అల్పాహారం మొదలవుతుంది. ఆ తర్వాత వారి ఇష్టం మేరకు చేయదగిన పనులను ఎంచుకొని, ఇతరులతో మాట్లాడటం, చదవడం, వ్యవసాయం లేదా ఆటల్లో పాల్గొనవచ్చు. సాయంత్రం కలిసి నడక, కాఫీ తర్వాత ఐదు గంటలకు వారిని వారి వారి ఇళ్లకు తీసుకు వెళతారు. ఇక్కడ ఉన్న వారంతా తమ పిల్లలు విధుల్లోకి వెళ్లిన తర్వాత ఇంట్లో ఒంటరిగా గడిపే స్త్రీలు. వారు ఆరోగ్యాన్ని కాపాడేందుకు, అత్యవసర పరిస్థితుల్లో సహాయం చేయడానికి, ఇక్కడ హెల్త్ క్లినిక్, ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. పగటి పూట డాక్టర్, నర్సు, ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో ఉంటారు. కొత్త వెంచర్‌ను ప్రారంభించడానికి ఈ పనులు ఎప్పుడూ అడ్డు కాదం'టారు తంకమ్మ.



వస్తువుల తయారీలో సలహాలిస్తూ...


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 217

శనివారం 29-10-2022


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




## మస్క్ చేతికి ట్విటర్..

44 బిలియన్ డాలర్ల ఆఫర్ మేరకు మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విటర్‌ను అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ కొనుగోలు చేశారు. ఆపై వెంటనే ట్విటర్ సీఈవో పరాగ్ అగ్రవాల్, లీగల్ ఎగ్జిక్యూటివ్ విజయ గద్దెతో పాటు సీఎఫ్‌వో నెడ్ సెగాల్, జనరల్ కౌన్సెల్ షాన్ ఎడ్జెట్‌లపై వేటు వేశారు. భారత్‌లో కార్యకలాపాలు సాగించాలంటే నిబంధనల ప్రకారం ట్విటర్ పనిచేయాల్సిందేనని కేంద్రం స్పష్టం చేసింది.


- వివరాలు 13లో



### పోలీసులకు ఒకే యూనిఫాం

పోలీసులకు దేశవ్యాప్తంగా ఒకే యూనిఫాం ఉండాలని.. దీనిపై ఆలోచించాలని రాష్ట్రాలకు ప్రధాని మోదీ సూచించారు.

వివరాలు 6లో



### అందుకే అక్కడ ఉగ్రవాదం

జమ్మూకశ్మీర్‌లో మౌలిక సదుపాయాలు లేకనే.. ఉగ్రవాదం విస్తరించిందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

వివరాలు 6లో



### ఆ నష్టం భారత్‌కే ఎక్కువ తెలుసు

ఉగ్రవాదంతో వచ్చే నష్టాల గురించి భారత్‌కే ఎక్కువగా తెలుసని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు.

వివరాలు 6లో



### మళ్లీ క్షిపణుల ప్రయోగం

అమెరికా హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఉత్తరకొరియా మరోసారి క్షిపణి ప్రయోగాలకు దిగింది.

వివరాలు 6లో

## న్యూస్‌రీల్

### రెడ్‌క్రాస్ సేవలు అమూల్యం



సమాజ శ్రేయస్సు కోసం రెడ్‌క్రాస్ సభ్యులు అమూల్యమైన సేవలు అందిస్తున్నారని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. విజయవాడలో జరిగిన రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ శాఖ వార్షిక అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన హాజరయ్యారు.

వివరాలు 3లో

### 1వ తేదీ నుంచి సర్వ దర్శనం టోకెన్ల జారీ



నవంబర్ 1 నుంచి తిరుపతిలో ఉచిత సర్వ దర్శనం టైం స్లాట్ టోకెన్ల జారీని టీటీడీ పునఃప్రారంభించనుంది. డిసెంబర్ 1 నుంచి బ్రేక్ దర్శన సమయాన్ని ఉదయం 8 గంటలకు మార్పు చేసింది.

వివరాలు 14లో


### 'టెక్'ల కేంద్రంగా విశాఖ




ఫిన్‌టెక్, హెల్త్‌టెక్, ఎడ్యుటెక్, ఫార్మాటెక్‌ల్లో దూసుకెళ్లేందుకు విశాఖకు అపార అవకాశాలున్నాయని మైక్రోసాఫ్ట్ ఇండియా క్లౌడ్ సైట్ లీడర్ చారుమతి శ్రీనివాసన్ అన్నారు. సీఐఐ ఆధ్వర్యంలో 'వైజాగ్ ది నెక్స్ట్ టెక్ హబ్ ఆఫ్ ఇండియా' అనే అంశంపై విశాఖలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు.

వివరాలు 2లో


### రాజధానిలో పేదలకు ఇళ్లు



అమరావతి రాజధాని ప్రాంతంలో పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది. ఆ ప్రాంతంలోని 900.97 ఎకరాలను గృహ అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా సీఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లోని జోన్‌ల్లో మార్పులు చేసింది.

వివరాలు 2లో






# ఆరోగ్యశ్రీ 2.0

## పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యాలకు రెట్టింపు భరోసా

### ఇక 3,255 చికిత్సలకు వర్తింపు.. ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ఇప్పటిదాకా 2,446 చికిత్సలు.. తాజాగా మరో 809
- టీడీపీ హయాంలో కేవలం 1,059 చికిత్సలు మాత్రమే
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఆరోగ్యశ్రీ, 108, 104 సేవలకు జవసత్వాలు
- 2018–19లో టీడీపీ ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.1,299.01 కోట్లు
- 2021–22లో జగన్ ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.3,481.70 కోట్లు



'డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ 2.0' ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెట్టింపు భరోసా కల్పించారు. ఆయా వర్గాల ప్రజలు దురదృష్టవశాత్తు ఏదైనా జబ్బు బారిన పడిన సందర్భాల్లో ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్న 'డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' పథకాన్ని మరింత బలోపేతం చేశారు. ఈ పథకం పరిధిలోకి మరో 809 చికిత్సలను కొత్తగా చేర్చి, మొత్తం 3,255 వైద్య చికిత్సల(ప్రక్రియలు)తో 'డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ 2.0'ను శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. దీంతో ఇప్పటి వరకు ఉన్న 2,446 చికిత్స ప్రక్రియల సంఖ్య 3,255కు చేరింది. ఇవన్నీ శుక్రవారం నుంచే అందుబాటులోకి వచ్చాయి.

**చరిత్ర సృష్టించిన సీఎం జగన్**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకూ 2014–19 మధ్య ఆరోగ్యశ్రీ పథకంలో కేవలం 1,059 చికిత్సలు మాత్రమే

మిగతా 2వ పేజీలో ▶

### ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

- వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్
- అనేక సంస్కరణల ద్వారా ఈ రంగాన్ని పటిష్టం చేశాం
- వైద్య శాఖలో సుమారు 46 వేల పోస్టులను భర్తీ చేశాం

2లో

వికేంద్రీకరణకు సంఘీభావం తెలుపుతున్న వివిధ సంఘాల నేతలు



# వికేంద్రీకరణపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

- ప్రాంతాల అభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యం.. పరిపాలన వికేంద్రీకరణ జరగాల్సిందే
- రాజధానిపై నిర్ణయాధికారం పాలకులకే ఉంటుంది
- ప్రధాని, సీఎం పాలనకు అనుకూలమైన ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవచ్చు
- అమరావతి ప్రాంతం రాజధానికి పనికిరాదు.. అమరావతి రైతులు అసలు రైతులే కాదు
- అసలు సిసలైన రైతులు ఉత్తరాంధ్రలో ఉన్నారు.. వికేంద్రీకరణ పరిరక్షణ సమితి రౌండ్ టేబుల్ భేటీలో మేధావులు
- ఏపీని సర్వనాశనం చేయాలన్నదే బాబు ధ్యేయమని విమర్శ

బీచ్ రోడ్డు (విశాఖ తూర్పు) : పరిపాలన వికేంద్రీకరణపై కొన్ని మీడియా సంస్థలు, కొన్ని పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మేధావులు పిలుపునిచ్చారు. రాజధానిగా అమరావతి అసలు పనికి రాదని స్పష్టంగా చెప్పారు. మూడు రాజధానులతోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందుతాయని తేల్చి చెప్పారు. శుక్రవారం పరిపాలన వికేంద్రీకరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఏయూ హిందీ విభాగంలో

మిగతా 11వ పేజీలో ▶

### విశాఖ ప్రజా రాజధాని.. రాజకీయ రాజధాని కాదు

- నినదించిన శ్రీకాకుళం జెడ్పీ సమావేశం
- విశాఖను పాలన రాజధాని చేయాలంటూ తీర్మానానికి ఆమోదం

11లో

# పది మంది చేరేలా పక్కా ప్లానింగ్!

### 'టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు ఎర' ఆడియో టేపులు లీక్

- నందు, రామచంద్ర భారతి, సింహయాజి, రోహిత్‌రెడ్డి మధ్య సంభాషణలు
- బయటపడ్డ 7, 27 నిమిషాల నిడివి కలిగిన రెండు ఆడియో టేపులు
- ఫామ్ హౌస్ సమావేశానికి ముందు జరిగిన సంభాషణలుగా చెబుతున్న టీఆర్‌ఎస్.. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఎంతైనా ఇచ్చేందుకు బీజేపీ సిద్ధంగా ఉంది: రామచంద్ర భారతి
- మీ భద్రత, భవిష్యత్తు కేంద్రం చూసుకుంటుందని హామీ

11లో



### నిందితులను రిమాండ్‌కు ఇవ్వండి

- 'ఎమ్మెల్యేలకు ఎర'కేసులో హైకోర్టును ఆశ్రయించిన పోలీసులు
- ఏసీబీ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేసిన అధికారులు

11లో

# 'అసైన్డ్' తిరుగుబాటు

## ఆ భూములు మావే.. ప్యాకేజీ మాకే ఇవ్వాలి

- భయపెట్టి.. బెదిరించి బలవంతంగా లాక్కున్నారు
- ఎల్లో గ్యాంగ్ భూదందాపై అసైన్డ్ రైతన్న కన్నెర్ర
- ప్రభుత్వం తిరిగిస్తే సాగు చేసుకుంటామని వినతి
- రాజధాని గ్రామాల్లో రెవెన్యూ అధికారులకు పెద్ద ఎత్తున దరఖాస్తులు



తమ భూములు తమకు కావాలంటూ మంగళగిరి ఎమ్మార్వో ఆఫీస్‌లో తహశీల్దార్‌కు వినతిపత్రమిచ్చిన అమరావతి అసైన్డ్ భూమి రైతులు

సాక్షి, అమరావతి: పచ్చ గద్దల భూ దందాపై అసైన్డ్ రైతులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. అమరావతిలో టీడీపీ పెద్దలు కాజేసిన తమ అసైన్డ్ భూములు తిరిగి దక్కించుకునేందుకు ఉద్యుక్తులమవుతున్నారు. రిజిస్ట్రేషన్ చేయని ఆ భూముల ప్యాకేజీ తమకే దక్కాలని, వాటిని వెనక్కి ఇస్తే సాగు చేసుకుంటామని స్పష్టం చేస్తున్నారు. 964 ఎకరాల

మిగతా 2వ పేజీలో ▶

### భయపెట్టి.. బెదిరించి



"అసైన్డ్ భూమికి పరిహారం ఇవ్వరని బెదిరించడంతో టీడీపీ నేతలకు అమ్మేందుకు ఒప్పుకున్నాం. తరువాత నిర్ణయం మార్చుకున్నాం. పోలీసులతో బెదిరించి రాత్రి 11 గంటలకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు బలవంతంగా తరలించి సంతకాలు చేయించి పెండింగ్ రిజిస్ట్రేషన్‌గా చూపించారు. మేం మోసపోయాం. మా భూమికి ప్యాకేజీ మాకే ఇవ్వాలి.

- ఆదినేని శ్రీనివాసరావు, అసైన్డ్ రైతు, ఎర్రబాలెం

# పంజాబ్‌కు ఆదర్శంగా ఏపీ

## ఇక్కడి తరహాలోనే అక్కడా పశుసంచార వైద్యసేవా రథాల ఏర్పాటు

- మూగజీవాల ఆరోగ్య సంరక్షణలో ఆంధ్రప్రదేశ్ మోడల్
- ఏపీ నుంచి నేర్చుకోవాల్సిన, ఆచరించాల్సిన విషయాలు చాలా ఉన్నాయి
- 'సాక్షి'తో పంజాబ్ పశుసంవర్థక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ ప్రతాప్
- విజయవాడలో వెటర్నరీ అంబులెన్స్ సేవల పరిశీలన



డాక్టర్ వైఎస్సార్ పశు సంచార వైద్య సేవా రథాలను పరిశీలిస్తున్న వికాస్ ప్రతాప్ తదితరులు

సాక్షి, అమరావతి: పాడి అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతూ దేశానికే ఆదర్శంగా నిలిచిన పంజాబ్ రాష్ట్రం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా తీసుకుంటోంది. మూగజీవాల కోసం ఏపీ ప్రభుత్వం విజయవంతంగా అమలుచేస్తున్న మొబైల్ అంబులేటరీ వెహికల్స్ సేవలను పంజాబ్‌లోనూ ఆచరణలోకి తీసుకొస్తున్నామని.. ఇందుకోసం కార్యాచరణ సిద్ధంచేస్తున్నామని పంజాబ్ రాష్ట్ర పశుసంవర్థక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ ప్రతాప్ తెలిపారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా విజయవాడలోని పశుసంవర్థక శాఖ సంచాలకుల కార్యాలయంలో వైఎస్సార్ పశుసంచార వైద్య సేవా రథాలను పంజాబ్ స్టేట్ పశుసంవర్థక శాఖ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎంపీ సింగ్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అంబులెన్స్‌లో ఏర్పాటుచేసిన సౌకర్యాలను చూసి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. అందులో ఉన్న సౌకర్యాలను పశుసంవర్థక శాఖ డైరెక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్ వివరించారు. ఈ సందర్భంగా

మిగతా 3వ పేజీలో ▶



### ఎగుమతుల హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- విశాల సముద్రతీరం రాష్ట్రానికి ఆయువుపట్టు
- విదేశీ వాణిజ్యానికి ఇక్కడ అవకాశాలు అపారం
- మెరైన్, రైస్, ఫ్రూట్స్ ఎగుమతులకు రాష్ట్రం స్వర్గధామం
- కాకినాడ ఐఐఎఫ్‌టీ క్యాంపస్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

2లో

### భారత్‌తో మాకు ప్రత్యేక సంబంధాలు



- రష్యా అధినేత పుతిన్ వెల్లడి
- 'స్వతంత్ర విదేశాంగ విధానాన్ని' అనుసరిస్తున్నారని మోదీపై ప్రశంసలు

6లో

# తప్పుడు రాతలతో బాబు తలరాతను మార్చలేరు

### ఈనాడుపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం



- మైనింగ్‌లో అక్రమాలు జరిగితే ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నంబర్
- 13 విజిలెన్స్ స్క్వాడ్‌లు, మైనింగ్‌ను ఎస్‌ఈబీ పరిధిలోకి తెచ్చాం
- అక్రమాలకు తావులేకుండా బరువు ఆధారిత సెస్.. జీపీఎస్ ట్రాకింగ్
- టీడీపీ హయాంలోనే విశాఖలో రూ.లక్షల కోట్ల ల్యాండ్ స్కాం

- వివరాలు 3లో

# ఐటీ హబ్‌గా విశాఖలో అపారమైన అవకాశాలు

- ద్వితీయశ్రేణి నగరాల్లో వైజాగ్.. డైనమిక్ సిటీ.. ఐటీ పరిశ్రమల చూపు టైర్–2 నగరాల వైపు
- ప్రోత్సాహకాలిస్తే విశాఖకు పరుగులు తీస్తాయి
- బీపీవో సీట్స్‌లో ఏపీ వాటా 27% అయితే వైజాగ్‌లో 20 శాతం
- 'సాక్షి'తో ఎస్టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్



సాక్షి, విశాఖపట్నం: ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు హబ్‌గా అభివృద్ధి చెందేందుకు విశాఖపట్నంలో అపారమైన అవకాశాలున్నాయని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్టీపీఐ) డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్ చెప్పారు. సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇండస్ట్రీ 4.0– అవకాశాలు, సవాళ్లు' సదస్సులో పాల్గొనేందుకు ఆయన శుక్రవారం విశాఖ వచ్చారు. ఎస్టీపీఐ డైరెక్టర్ సి.వి.డి.రామ్‌ప్రసాద్‌తో కలిసి ఆయన సాక్షితో మాట్లాడారు. ఐటీ పరిశ్రమలన్నీ

మిగతా 3వ పేజీలో ▶

## క్లుప్తంగా

### రాజధానిలో 900.97 ఎకరాల్లో పేదలకు ఇళ్లు

- 5 గ్రామాల పరిధిలో భూమి ఇళ్లస్థలాలకు వినియోగం
- సీఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్ జోన్లలో మార్పు
- డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వం
- నవంబర్ 11 వరకు అభ్యంతరాలు, సలహాల స్వీకరణ

సాక్షి, అమరావతి: అమరావతి రాజధాని ప్రాంతంలో ఆర్థికంగా వెనుకబడిన పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది. గుంటూరు జిల్లాలోని మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు, తుళ్లూరు మండలంలోని మందడం, ఐనవోలు గ్రామాల పరిధిలో 900.97 ఎకరాలను గృహ అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా సీఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లోని జోన్‌లలో మార్పులు చేసింది. ఈ మేరకు శుక్రవారం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న అఫర్డబుల్, ఈడబ్ల్యూఎస్ హౌసింగ్ జోన్‌తోపాటు రెసిడెన్షియల్ జోన్ నిబంధనల్లో మార్పులు చేస్తూ కొత్త జోన్‌ను తీసుకురానుంది. దీనిపై నవంబర్ 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు, సలహాలు స్వీకరించనున్నట్లు తెలిపింది.

### మధ్యాహ్న భోజనం వంట మెటీరియల్ ఖర్చు పెంపు

ప్రైమరీలో ఒక్కో విద్యార్థికి రూ 5.45కి పెంపు
అప్పర్ ప్రైమరీలో రూ.8.17

సాక్షి, అమరావతి: మధ్యాహ్న భోజన పథకం కింద వంట మెటీరియల్ ఖర్చును పెంచుతూ రాష్ట్ర మధ్యాహ్న భోజనం, స్కూల్ శానిటేషన్ డైరెక్టర్ నిధి మీనా సర్క్యులర్ జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం పీఎం పోషణ పథకంలో వంట మెటీరియల్ ఖర్చును 9.6 శాతం అంతకన్నా ఎక్కువ మేర పెంచాలన్న సూచనలతో తాజా సర్క్యులర్ ఇచ్చారు. వంట మెటీరియల్ ఖర్చు కింద ప్రైమరీలో ఒక్కో విద్యార్థిపై ప్రస్తుతం రూ.4.97 ఇస్తుండగా.. దానిని రూ.5.45కు పెంచారు. అప్పర్ ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులకు ప్రస్తుతం ఉన్న రూ.7.45కు బదులుగా రూ.8.17 చొప్పున అందించనున్నారు.

### అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా విజయబాబు



సాక్షి, అమరావతి: అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పి.వి.విజయ బాబును ప్రభుత్వం నియమించింది. శుక్రవారం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. రాష్ట్రంలో అధికారిక, పరిపాలన కార్యకలాపాలు తెలుగు భాషలో కొనసాగే విధంగా పర్యవేక్షించడంతో పాటు తెలుగు భాషా ప్రగతికి సిఫారసులు, సూచనలు చేయాల్సి ఉంటుంది.

### మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాల్స్‌కు పే ప్రొటెక్షన్

సాక్షి, అమరావతి: మోడల్ స్కూల్స్‌లో 2010 డీఎస్సీ ద్వారా ప్రిన్సిపాల్స్‌గా నియమితులైన ఇన్ సర్వీస్ పీజీటీలకు పే ప్రొటెక్షన్ అమలు చేస్తూ పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. దీనిపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ సర్క్యులర్ జారీ చేశారు. ఇన్ సర్వీస్ ప్రిన్సిపాల్స్‌కి పే ప్రొటెక్షన్ ఇవ్వడంపై మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటెరు శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇతర యాజమాన్యాల నుంచి వచ్చి మోడల్ స్కూల్స్‌లో చేరిన టీచర్లకు, మోడల్ స్కూల్స్‌లోనే టీజీటీ నుంచి పీజీటీగా ఎంపికైన టీచర్లకు కూడా పే ప్రొటెక్షన్ ఇవ్వాలని కోరారు.

### నేడు రాయలసీమ ఆత్మగౌరవ మహాప్రదర్శన

కర్నూలుకు న్యాయ రాజధాని సాధనే లక్ష్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భూమన తదితరులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: కర్నూలుకు న్యాయ రాజధాని, రాయలసీమ హక్కుల సాధనే లక్ష్యంగా తిరుపతిలో శనివారం ఆత్మగౌరవ మహాప్రదర్శన నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ మహా ప్రదర్శన ఉదయం నగరంలోని కృష్ణాపురం ఠాణా నుంచి ప్రారంభమై మునిసిపల్ కార్యాలయం వరకు సాగనుంది. కార్పొరేషన్ కూడలిలో బహిరంగసభ నిర్వహిస్తున్నారు. ఈ మహాప్రదర్శనలో మేధావులు, న్యాయవాదులు, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నట్టు ఇప్పటికే ప్రకటించాయి. మహా ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి ఆవిష్కరించారు.

# ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

**వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్**

- అనేక సంస్కరణల ద్వారా ఈ రంగాన్ని పటిష్టం చేశాం
- వైద్య శాఖలో సుమారు 46 వేల పోస్టులను భర్తీ చేశాం
- ప్రభుత్వం నుంచి చేయాల్సినవన్నీ చేశాం.. ఇక వ్యవస్థ పనితీరుపై దృష్టి పెట్టాలి
- మండల స్థాయిలో పర్యవేక్షణ అధికారిని ఉంచాలి
- ఎప్పుడు, ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలి
- ఆరోగ్యశ్రీ లబ్ధిదారుల హెల్త్ రికార్డులను అప్‌డేట్ చేస్తుండాలి



వైద్య, ఆరోగ్యశాఖ సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగంలోనే ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు చెంతనే, సత్వరమే అందేలా అనేక సంస్కరణలు చేపట్టామని తెలిపారు. తద్వారా వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకు వచ్చామని చెప్పారు. ఇంకా తీసుకురాబోతున్నామని వివరించారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 104 కాల్ సెంటర్ ద్వారా ఆరోగ్యశ్రీ రిఫరల్ సర్వీసులు అందిస్తున్నామని అధికారులు సీఎంకు తెలిపారు. ఈ పథకం కింద అందుతున్న సేవలపై నెట్‌వర్క్ ఆస్పత్రులు, విలేజ్ క్లినిక్స్, ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో బోర్డులు ఉంచుతున్నామని చెప్పారు. పూర్తి సమాచారంతో బుక్‌లెట్స్ కూడా ఇస్తున్నామని, వాటిలో ఆస్పత్రుల వివరాలు, పథకం కింద అందుతున్న సేవల వివరాలు ఉంచామని తెలిపారు. 'ఈ నెల 21 నుంచి ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ ప్రారంభించాం. ప్రత్యేక యాప్ ద్వారా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నాం. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లతో కలిపి 14 మంది సిబ్బంది ఉంటారు. 67 రకాల మందులు, 14 రకాల ర్యాపిడ్ కిట్లను విలేజ్ క్లినిక్స్‌లో అందుబాటులో ఉంచాం. ఇప్పటికే పీహెచ్‌సీ వైద్యులకు 2,248 సెల్ ఫోన్లు, ట్యాబ్‌లు పంపిణీ చేశాం. సెంట్రల్ డ్రగ్ స్టోర్లను భవిష్యత్తులో కొత్త జిల్లాల్లో కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. విలేజ్ క్లినిక్స్‌లో మందులు అయిపోవస్తుండగానే.. సమీపంలో ఉన్న పీహెచ్‌సీ నుంచి సరఫరా చేసేలా ఏర్పాటు చేశాం. మందుల పంపిణీ, నిల్వ, కొరత తదితర అంశాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఆన్‌లైన్ పద్ధతుల్లో పర్యవేక్షిస్తున్నాం' అని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమీక్షలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

**అంకిత భావంతో పని చేయించాలి**

- వైద్య శాఖలో మానవ వనరుల కొరతకు తావివ్వకుండా మునుపెన్నడూ లేని విధంగా సుమారు 46 వేల పోస్టులను భర్తీ చేశాం. ఎక్కడ, ఎప్పుడు ఖాళీ పడినా వెంటనే గుర్తించి, వాటిని భర్తీ చేసేందుకు ప్రత్యేక అధికారిని కూడా నియమించాం.
- సౌకర్యాలు, వసతులు, సరిపడా సిబ్బందిని ప్రభుత్వం వైపు నుంచి ఇవ్వగలిగాం. వైద్యులు, వైద్య సిబ్బందిని అంకిత భావంతో పనిచేయించేలా ప్రత్యేక శ్రద్ధతో వ్యవస్థపై దృష్టి పెట్టాలి. ఎక్కడా అలసత్వం, నిర్లక్ష్యానికి తావుండటానికి వీల్లేదు.
- ప్రభుత్వ రంగంలో మెరుగైన వైద్య సేవలు, నాణ్యమైన సేవలు అందాలన్నదే మన లక్ష్యం. ప్రతి ఆస్పత్రిలో రోగులకు వైద్యులు, వైద్య, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలి. వైద్య ఆరోగ్య శాఖలో కూడా ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని తప్పనిసరి చేయాలి.

**మండల ప్రాతిపదికన పర్యవేక్షణ**

- మండలాల ప్రాతిపదికన ప్రతి విభాగంపై పర్యవేక్షణ అధికారులు ఉండేలా తగిన ఆలోచనలు చేయాలి. ఎంఈవో, తహసీల్దార్, ఎంపీడీవో తరహాలో ప్రతి ప్రభుత్వ విభాగంలో పని చేసే వారిపై పర్యవేక్షణకు ఒక మండల స్థాయి వ్యవస్థ ఉండాలి. ఇందుకు తగిన ప్రణాళిక రూపొందించాలి.
- వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే సిబ్బంది పైనా మండల స్థాయిలో పర్యవేక్షణకు ఒక ఆలోచన చేయండి. దీనిపై కసరత్తు చేసి ప్రతిపాదనలు అందించండి. ఎయిర్ పొల్యూషన్, పారిశుధ్యం, తాగునీరు, పాఠశాలలు, అంగన్‌వాడీలలో మరుగుదొడ్ల పరిశుభ్రతపై ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా నివేదికలు తెప్పించుకోవాలి. సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.
- ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ సమీర్ శర్మ, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వీసీ, ఎండీ డి.మురళీధర్‌రెడ్డి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.నివాస్, ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్, ఇన్‌చార్జ్ డీఎంఈ డాక్టర్ వినోద్ కుమార్, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిర ప్రసాద్, ఔషధ నియంత్రణ డీజీ రవి శంకర్ పాల్గొన్నారు.

### రక్తహీనతను రూపుమాపాలి

- రాష్ట్రంలో రక్తహీనత సమస్యను రూపుమాపాలి. ఈ లక్ష్యంతో అడుగులు ముందుకు వేయండి. స్త్రీ, శిశు సంక్షేమ శాఖతో సమన్వయం చేసుకుంటూ పని చేయండి. రక్తహీనత సహా పలు అంశాల్లో సుస్థిర ప్రగతి లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలి. హైరిస్క్ గర్భిణులు, రక్తహీనత సమస్యతో బాధ పడుతున్న వారికి సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా? లేదా? అన్నదానిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.
- ఆరోగ్యశ్రీ కార్డుల్లో ప్రతి ఒక్కరి ఆరోగ్య చరిత్రను నిక్షిప్తం చేయాలి. దీంతో ఫ్యామిలీ డాక్టర్లు.. రోగులకు సరైన వైద్య సేవలు అందించగలుగుతారు. గ్రామానికి సంబంధించిన మొత్తం హెల్త్ రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలి. నిరంతరం ఈ రికార్డులను అప్‌డేట్ చేసుకుంటూ వెళితే క్యూ ఆర్ కోడ్ ద్వారా వెంటనే తెలుసుకునే వీలుంటుంది. వీటిని చూసి ఫ్యామిలీ డాక్టర్ తగిన రీతిలో సేవలు అందిస్తారు.

### మా కుమార్తె పెళ్లి గిఫ్ట్‌గా భావిస్తున్నా..

- సీఎంకు నటుడు అలీ కృతజ్ఞతలు
- ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు పదవిపై ఆనందం



సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్ మీడియా ఏపీ ప్రభుత్వ సలహాదారు పదవిని సీఎం వైఎస్ జగన్ తన కుమార్తె పెళ్లి సందర్భంగా ఇచ్చిన గిఫ్ట్‌గా భావిస్తున్నానని సినీ నటుడు మహ్మద్ అలీ హర్షం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ శుక్రవారం ఆయన తన భార్యతో కలిసి ఓ వీడియోను మీడియాకు రిలీజ్ చేశారు. 'అలీ పార్టీకి సేవ చేశాడు. పదవులు ఆశించి కాదని ఆయనకు తెలుసు. ఈ మనిషికి ఏదో ఒకటి చేయాలనుకున్నారు. ఏవేవో పదవులు ఇస్తున్నారని వార్తలొచ్చాయి. అయితే ఆ విషయాలేవీ అటు పార్టీ నుంచి గానీ, ఇటు నా సైడ్ నుంచి గానీ చెప్పలేదు. గతంలో మేము ఫ్యామిలీతో వెళ్లినప్పుడు వారు ఏం చెప్పారో? ఇప్పుడు అదే కన్ఫర్మ్ చేశారు. ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుగా నన్ను నియమించినందుకు మా జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నా. థాంక్యూ సో మచ్. మీరు ఇచ్చిన పదవికి తప్పక న్యాయం చేస్తాను. మీ అడుగుజాడల్లో నడుస్తానని మాటిస్తున్నాను. థాంక్యూ సో మచ్ అండ్ వెరీ హ్యాపీ. నా కూతురు పెళ్లి సందర్భంగా ఇది మీరు ఇచ్చిన గిఫ్ట్‌గా భావిస్తున్నా' అని ఆనందం వ్యక్తం చేశారు. ఇదే వీడియోలో అలీ సతీమణి జుబేద మాట్లాడుతూ.. 'అందరికీ నమస్కారం. ఈ రోజు చాలా హ్యాపీగా ఉంది. ఈ రోజు మా ఇంట్లో ఒక పండుగ అని చెప్పాలి. ఈరోజుతో మాలో ఉన్న టెన్షన్ పోయింది. ఇదంతా మా జగన్ భాయ్ వల్లే జరిగింది. షుక్రియా జగన్ భాయ్' అని ఆనందపడ్డారు. కాగా, 1999 నుంచి 2004 మధ్య చంద్రబాబు హయాంలో సినీ రంగానికి చెందిన దర్శకుడు కె.రాఘవేంద్రరావు ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుగా పని చేయడం తెలిసిందే. అప్పట్లో జల చైతన్యం పేరుతో ప్రచార చిత్రాలు రూపొందించారు. గత ప్రభుత్వ హయాంలో కూడా రాఘవేంద్రరావును ఎస్వీబీసీ చైర్మన్‌గా నియమించారు.

# ఎగుమతుల హబ్‌గా ఏపీ

**కాకినాడ ఐఐఎఫ్‌టీ క్యాంపస్ ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్**



ఐఐఎఫ్‌టి క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న నిర్మలా సీతారామన్. చిత్రంలో కేంద్రమంత్రి పీయూష్ గోయెల్, రాష్ట్ర మంత్రులు బుగ్గన, అప్పలరాజు, కారుమూరి, ఎంపీలు గీత, బోస్, భరత్ తదితరులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: విదేశీ ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని.. సముద్రతీర ప్రాంతంతో ఏపీ ఎక్స్‌పోర్ట్ హబ్‌గా నిలిచిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. మెరైన్, రైస్, ఫ్రూట్స్ వంటి ఎగుమతుల్లో ద్విగుణీకృతమైన ప్రగతిని ఏపీ సాధిస్తోందని.. విదేశీ వాణిజ్యానికి అన్ని అవకాశాలు ఇక్కడ మెండుగా ఉన్నాయని ఆమె కొనియాడారు. కాకినాడ జేఎన్‌టీయూలో ఏర్పాటుచేసిన ప్రతిష్టాత్మకమైన ఐఐఎఫ్‌టీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్) మూడో క్యాంపస్‌ను శుక్రవారం కేంద్ర ఆర్థిక, వాణిజ్యశాఖా మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ ఈ క్యాంపస్ ఏర్పాటుతో ట్రేడ్ హబ్‌గా కాకినాడ దేశ ఆర్థికవ్యవస్థలో మరింత కీలకపాత్ర పోషించనుందన్నారు. విశాలమైన సముద్రతీరం ఉన్న ఏపీలో మెరైన్ ఉత్పత్తుల ప్రాముఖ్యతను అర్థంచేసుకుని, ఇక్కడి ఎగుమతిదారులు ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకున్నారన్నారు. అదే ఈ రోజు విదేశీ వాణిజ్యంలో రాష్ట్రాన్ని ముందువరసలో నిలిపిందని ఆమె ప్రశంసించారు. రాష్ట్రంలో ఒక్కో జిల్లా ఒక్కో విశిష్ట ఉత్పత్తికి కేంద్రంగా ఉందన్నారు. ఐఐఎఫ్‌టీ విద్యార్థులు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా దేశ, విదేశాల్లో జరుగుతున్న వాణిజ్యాన్ని ఆకళింపు చేసుకుని వాటిపై పూర్తి పట్టు సాధించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విభజన అనంతరం రాష్ట్ర సత్వరాభివృద్ధే లక్ష్యంగా ప్రధానమంత్రి చొరవతో ఎయిమ్స్, ఐఐఎం, ఐఐఎస్ఈఆర్, ఎన్ఐటీ, ఐఐఎఫ్‌టీ, ఐఐటీ తదితర పది ప్రతిష్టాత్మక సంస్థలు రాష్ట్రంలో ఏర్పాటు అయ్యాయని సీతారామన్ వెల్లడించారు.

**రాజకీయ సుస్థిరతతోనే ఆర్థిక శక్తిగా భారత్**

మరో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. భారతీయ వాణిజ్యానికి భవిష్యత్తులో మరింతగా అంతర్జాతీయ గుర్తింపు రావాలంటే నిపుణులైన మానవ వనరులు అవసరమన్నారు. దేశంలో రాజకీయ సుస్థిరత, సమష్టి కృషి ఫలితంగానే ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతోందన్నారు. రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ.. ఐఐఎఫ్‌టీ ఏర్పాటుతో కాకినాడ ప్రతిష్ట మరింత పెరుగుతుందన్నారు. దేశీయ ఎగుమతుల్లో 5.8% (దాదాపు 16.8 బిలియన్ యూఎస్ డాలర్లు) ఏపీ నుంచి జరుగుతున్నాయన్నారు. గతంలో 20వ స్థానంలో ఉన్న ఈ ఎగుమతులు 2021 నాటికి 9వ స్థానానికి చేరుకున్నాయన్నారు. భారత్ ఆక్వాహబ్‌గా ఏపీ గుర్తింపు సాధించిందన్నారు. రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, కారుమూరి నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీలు వంగా గీత, పిల్లి సుభాష్‌చంద్రబోస్, మార్గాని భరత్, జీవీఎల్ నరసింహారావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, ఐఐఎఫ్‌టీ వీసీ ప్రొ. మనోజ్‌పంత్ తదితరులు పాల్గొన్నారు.

# టెక్‌ల కేంద్రంగా విశాఖ

- సీఐఐ సదస్సులో మైక్రోసాఫ్ట్ ఇండియా క్లౌడ్ సైట్ లీడర్ చారుమతి శ్రీనివాసన్
- ఇంక్యుబేటర్స్‌తో విశాఖలో కార్యకలాపాలను పెంచాలి
- ఆవిష్కరణలను ప్రోత్సహించేలా ఏపీ ఇన్నోవేటివ్ సొసైటీతో ఎస్‌టీపీఐ ఒప్పందం

సాక్షి, విశాఖపట్నం: సాంకేతిక రంగంలో భారత్ వేగంగా దూసుకుపోతోందని, 130 కోట్ల మంది ప్రజలంతా టెక్నాలజీలో భాగస్వాములు కావడం విశేషమని మైక్రోసాఫ్ట్ ఇండియా క్లౌడ్ సైట్ లీడర్ చారుమతి శ్రీనివాసన్ పేర్కొన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 'వైజాగ్ ది నెక్ట్స్ టెక్ హబ్ ఆఫ్ ఇండియా' అనే అంశంపై శుక్రవారం విశాఖలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఫిన్‌టెక్, హెల్త్‌టెక్, ఎడ్యుటెక్, ఫార్మాటెక్ రంగాల్లో దూసుకెళ్లేందుకు విశాఖకు అపార అవకాశాలున్నాయని తెలిపారు. స్టార్టప్ హబ్‌గా విశాఖ అభివృద్ధి చెందేందుకు ఇంక్యుబేటర్స్ ద్వారా కార్యకలాపాలను పెంచడంతోపాటు ఫ్రెండ్లీ పాలసీ ద్వారా ప్రధానసంస్థల్ని ఆకర్షించాలని సూచించారు. 81 శాతం పరిశ్రమలకు ఆవిష్కరణలే బలమని చెప్పారు.

**స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు ఏపీ కీలకం**

సదస్సు సందర్భంగా ఎస్‌టీపీఐ, ఎస్‌టీపీఐ నెక్ట్స్ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ నేతృత్వంలో ఇండస్ట్రీ 4.0 ద్వారా ఆవిష్కరణలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించేలా ఒప్పందం కుదిరింది. పరిశ్రమలతో పరస్పర సహకారాన్ని అందిపుచ్చుకునే వాతావరణాన్ని ఎస్‌టీపీఐ సృష్టిస్తుందని సదస్సును ప్రారంభించిన సంస్థ డైరెక్టర్ సీవీడీ రామ్‌ప్రసాద్ తెలిపారు. విశాఖలో ఆర్ఐఎన్ఎల్‌తో కలిసి ఆవిష్కరణలు, అంకుర సంస్థల్ని ప్రోత్సహించేందుకు ఇండస్ట్రీ 4.0 ప్రారంభించామని చెప్పారు. స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు ఏపీ కీలకమన్నారు. ఐటీ సెక్టార్‌తో విద్యుత్ రంగం కలిసి పనిచేస్తే వినియోగదారుల సమస్యలను మరింత త్వరగా పరిష్కరించేందుకు మార్గం సుగమమవుతుందని సీఐఐ మాజీ చైర్మన్ డి.రామకృష్ణ తెలిపారు. స్టీల్‌ప్లాంట్, సెమ్స్, మారిటైమ్ యూనివర్సిటీ, ఎక్స్‌పోర్ట్ హబ్ లాంటి సంస్థలతో విశాఖ పారిశ్రామిక నగరంగా ఇప్పటికే అభివృద్ధి చెందిందని, ఐటీ హబ్‌గా ఎదిగే రోజులు సమీపంలోనే ఉన్నాయన్నారు. సీఐఐ వైస్ చైర్మన్ పీపీ లాల్‌కృష్ణ, పలు ఐటీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 'అసైన్డ్' తిరుగుబాటు

▶ మొదటి పేజీ తరువాయి



అసైన్డ్ భూ దోపిడీపై 'సాక్షి'కథనాలతో చైతన్యమైన అసైన్డ్ రైతులు రెవెన్యూ కార్యాలయాల తలుపుతడుతున్నారు. అమరావతిలో పలు గ్రామాల రైతులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. ఇది 29 గ్రామాలకూ విస్తరిస్తుండటంతో టీడీపీ పెద్దల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

**తప్పుడు రికార్డులు సవరించాలి**

అమరావతి గ్రామాల్లో అసైన్డ్ రైతులు సంఘటితమవుతున్నారు. చిన్న పాయగా మొదలైన ఈ ఉద్యమం ఊపందుకుంటోంది. నవులూరు, కురగల్లు, ఎర్రబాలెం తదితర గ్రామాలకు చెందిన అసైన్డ్ రైతులు రెండు రోజులుగా మంగళగిరి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములు తమవేనని, వాటిని ఎవరికీ విక్రయించలేదని పేర్కొంటున్నారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ నేతలు పోలీసులతో బెదిరించి రాత్రికి రాత్రి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తరలించి బలవంతంగా సంతకాలు చేయించారని వెల్లడించారు. ఆ భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు చట్టం సమ్మతించకపోవడం తమకు కాస్త ఊరట నిచ్చిందన్నారు. ఆ భూములు ఇప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో తమ పేరిటే ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. వాటిని టీడీపీ నేతలు భూసమీకరణ కింద సీఆర్‌డీఏకు ఇచ్చినట్లు తప్పుగా చూపటాన్ని సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు. భూసమీకరణ కింద అసైన్డ్ భూములకు చెల్లించిన ప్యాకేజీ తమకే ఇవ్వాలని, అందుకు సమ్మతించకుంటే తమ భూములు తమకు తిరిగిస్తే సాగు చేసుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

### రూ.కోటి భూమికి రూ.6 లక్షలే



మాకు కురగల్లులో 3.36 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. టీడీపీ నేతలు, దళారులు మమ్మల్ని ఆందోళనకు గురి చేసి ఎకరం రూ.కోటి పలికే భూమిని రూ.6 లక్షలకే కాజేశారు. మేం సంతకాలు చేశాక టీడీపీ ప్రభుత్వం అసైన్డ్ భూములకు ప్యాకేజీ ప్రకటించింది. మమ్మల్ని టీడీపీ పెద్దలు మోసం చేశారు. మా భూములు రిజిస్ట్రేషన్ కాలేదు కాబట్టి వాటి ప్యాకేజీ మాకే ఇవ్వాలి. లేదా మా భూములు మాకు తిరిగిస్తే సాగు చేసుకుంటాం.

– మార్కంపూడి అశోక్, అసైన్డ్ రైతు, కురగల్లు

### అసైన్డ్ ఖాతాలో పట్టా భూమి



మా కుటుంబానికి ఐదెకరాల పట్టా భూమి ఉంది. రాజధాని ప్రకటించిన తరువాత అది అసైన్డ్ భూమి అని బెదిరించడంతో భయపడి టీడీపీ నేతలకు విక్రయించేందుకు ఒప్పుకున్నాం. తరువాత నిర్ణయం మార్చుకోవడంతో పోలీస్ స్టేషన్‌కు పిలిచి బెదిరించారు. మా భూమి మాకు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– దావు బిచ్చారావు, రైతు, ఎర్రబాలెం

### న్యాయం చేయాలి..



మాకు 1.10 ఎకరాల భూమి ఉంది. టీడీపీ నేతలు, పోలీసులు మమ్మల్ని బెదిరించి తక్కువ ధరకు విక్రయించేలా ఒప్పించారు. బలవంతంగా అర్ధరాత్రి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తరలించి సంతకాలు తీసుకున్నారు. మా భూమి పెండింగ్ రిజిస్ట్రేషన్‌లో ఉంది. సీఆర్‌డీఏ రికార్డుల్లో మాత్రం టీడీపీ నేతల పేరిట ఉంది. మాకు న్యాయం చేయాలి. భూసమీకరణ ప్యాకేజీ, కౌలు మాకే ఇప్పించాలి.

– నాగేశ్వరరావు, అసైన్డ్ రైతు, ఎర్రబాలెం

# ఆరోగ్యశ్రీ 2.0

> డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాం. బకాయిలు లేకుండా మన ప్రభుత్వం తీసుకున్న చర్యలు నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాల్లో నమ్మకం, విశ్వాసం పెరిగేలా చేసింది. ఇప్పుడు రోగులకు మరిన్ని వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నాం. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల కారణంగా గాయపడే ఇతర రాష్ట్రాల వారికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య మిత్రలకు సేవా మిత్రలు, సేవారత్న, ఉన్నత ఆరోగ్య సేవ అవార్డులు ఇవ్వాలి.
>
> – ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

అందుబాటులో ఉండేవి. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసిన సీఎం జగన్ టీడీపీ హయాంలో నిర్వీర్యం అయిన ఈ పథకానికి ఊపిరిలూదేలా విప్లవాత్మక చర్యలు చేపట్టారు. వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటే ప్రతి చికిత్సకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేసేలా అడుగులు ముందుకు వేస్తామని 2019 ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ దిశగా వడివడిగా అడుగులు వేశారు. 2020 జనవరిలో చికిత్సలను 2,059కి పెంచారు. అదే సంవత్సరం జూలైలో 2,200 చికిత్సలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. తద్వారా అదనంగా చేర్చిన చికిత్సల్లో 54 క్యాన్సర్ చికిత్సల ప్రక్రియలు అందుబాటులోకి వచ్చాయి. 2020 నవంబర్‌లో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి పలు పెద్ద చికిత్సలతో సహా 2,436కు పెంచారు. 2020, 2021 సంవత్సరాల్లో ప్రపంచాన్ని కోవిడ్ మహమ్మారి అతలాకుతలం చేసింది. ఈ వైరస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్న సీఎం జగన్ సర్కార్.. దేశంలోనే ఎక్కడా లేని విధంగా కరోనాకు సంబంధించిన 10 రకాల చికిత్సలను ఆరోగ్యశ్రీలోకి 2021 మే, జూన్ నెలల్లో చేర్చింది. తాజాగా మరో 809 చికిత్సలను చేర్చడంతో మొత్తం చికిత్సల ప్రక్రియలు 3,255కు పెరిగాయి. ఇలా 2019 నుంచి ఇప్పటి వరకు 2,196 చికిత్సలను పథకంలో చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది.

### ఖర్చు మూడు రెట్లు అధికం

టీడీపీ ప్రభుత్వ హయాంతో పోలిస్తే సీఎం జగన్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, 104, 108 వైద్య సేవల కోసం మూడు రెట్లు అదనంగా ఖర్చు చేస్తోంది. 2018–19లో అప్పటి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, 104, 108 సేవల కోసం రూ.1,299.01 కోట్లు ఖర్చు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం 2021–22లో ఆరోగ్యశ్రీ కోసం రూ.2,894.87 కోట్లు ఖర్చు పెట్టింది. మరో వైపు ఇదే ఏడాది ఆరోగ్య ఆసరా కోసం సుమారు రూ.300 కోట్లు, 104 సేవల కోసం రూ.114.05 కోట్లు, 108 సేవల కోసం రూ.172.78 కోట్లు వెచ్చించింది. ఇలా మొత్తంగా ఆ ఏడాది రూ.3,481.7 కోట్లు ప్రజల ఆరోగ్యం కోసం ఖర్చు చేసింది.

### ఆరోగ్యశ్రీ పథకంలో సీఎం జగన్ ప్రభుత్వం సంస్కరణలు

| అంశం | నాడు(2014-19) | నేడు (2019-2022) |
|---|---|---|
| లబ్ధిదారులు | కేవలం బీపీఎల్ కుటుంబాలు మాత్రమే | రూ.ఐదు లక్షల్లోపు వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాలు. ప్రస్తుతం 1,41,34,208 కుటుంబాలు పథకం పరిధిలో ఉన్నాయి. |
| చికిత్సలు | 1059 (ఇందులో 942 చికిత్సలు 2014కు ముందే ఉన్నాయి.) | 3,255 |
| నెట్‌వర్క్ ఆస్పత్రులు | 919 | 2,228 (ఏపీలో 2026, ఇతర రాష్ట్రాల్లో 202) |
| సగటున రోజుకు చికిత్స పొందే వారు | 1,570 | 3,300 |
| ప్రీ ఆథరైజేషన్‌కు పట్టే సగటు సమయం | మూడు రోజుల వరకు | 24 గంటల లోపే |
| క్లెయిమ్ ప్రాసెసింగ్‌కు పట్టే సగటు సమయం | 60 రోజులకు పైనే | 21 రోజుల లోపు |
| వ్యయం | రూ.5177.38 కోట్లు | రూ.7,097.45 కోట్లు |
| పెద్ద చికిత్సలు | | |
| | ఒక చెవికి కాక్లియర్ ఇంప్లాంటేషన్, గుండె మార్పిడి | రెండు చెవులకు కాక్లియర్ ఇంప్లాంటేషన్, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ (వైద్యానికి అయ్యే ఖర్చుకు పరిమితులు లేకుండా చికిత్స) |
| ఇతర రాష్ట్రాల్లో నెట్‌వర్క్ ఆస్పత్రులు | పీడియాట్రిక్స్, కార్డియాక్, క్యాన్సర్ స్పెషాలిటీలను కలిగిన 72 ఆస్పత్రులు | 17 సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు కలిగిన 202 ఆస్పత్రులు |
| ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ | లేదు | ఉంది |
| ఆరోగ్య ఆసరా | లేదు | చికిత్స అనంతరం విశ్రాంత సమయానికి కనిష్టంగా రోజుకు రూ.225, గరిష్టంగా నెలకు రూ.ఐదు వేలు సాయం (రూ.815.30 కోట్ల ఆర్థిక సాయం అందజేత) |

# రెడ్‌క్రాస్ సేవలు అమూల్యం

కోవిడ్ సమయంలో అద్భుత సేవలు

- పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలి
- 26 జిల్లాల ఏర్పాటుతో రెడ్‌క్రాస్ మరింత బలోపేతం
- రెడ్‌క్రాస్ వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో గవర్నర్



గవర్నర్ నుంచి మెడల్ అందుకుంటున్న నాటా పీఆర్ అండ్ మీడియా కో-ఆర్డినేటర్ డీవీ కోటిరెడ్డి

సాక్షి, అమరావతి/పటమట(విజయవాడ తూర్పు): సమాజ శ్రేయస్సు కోసం రెడ్‌క్రాస్ సభ్యులు అమూల్యమైన సేవలు అందిస్తున్నారని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. రక్తం అందక ఒక్కరు కూడా ప్రాణం కోల్పోకూడదని, ఇందుకోసం మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహించాలని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులకు ఆయన సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ శాఖ వార్షిక అవార్డుల (2019–20, 2021–22 సంవత్సరాలకు) ప్రదానోత్సవం విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ సమాజంలోని పేద, బడుగు, బలహీన వర్గాలకు మానవతా దృక్పథంతో సేవలు అందించడంలో రెడ్‌క్రాస్ ముందంజలో ఉందన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో రెడ్‌క్రాస్ తన పాత్రను అద్భుతంగా పోషించిందని, పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు రక్తం, ఆక్సిజన్, మాస్కులు, మందులు వంటివి అందించడం ద్వారా వేల మంది రోగుల ప్రాణాలు కాపాడిందని కొనియాడారు. రోగులకు, తలసేమియా బాధిత పిల్లలకు సురక్షితమైన రక్తాన్ని అందించాలనే లక్ష్యంగా రెడ్‌క్రాస్ పని చేయడం ప్రశంసనీయమని అన్నారు. రాష్ట్రంలో 26 జిల్లాల ఏర్పాటుతో 26 జిల్లాల కలెక్టర్లు, మేనేజింగ్ కమిటీలు సేవలు అందించడం ద్వారా రెడ్‌క్రాస్ మరింత బలోపేతమైందని తెలిపారు. జిల్లా శాఖలు మారుమూల గ్రామీణ, గిరిజన ప్రజలకు చేరువకావడంపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు. వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించడానికి మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. యువత, విద్యార్థులను చైతన్యవంతం చేయడం ద్వారా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలన్నారు. నిరుపేదలకు సేవలు అందించడానికి అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన రెడ్‌క్రాస్ ఏపీ శాఖ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆర్‌పీ సిసోడియా, ప్రధాన కార్యదర్శి ఏకే పరిడాను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరంఎన్టీఆర్, కృష్ణా, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు ఎస్.ఢిల్లీరావు, పి.రంజిత్‌బాషా, శ్రీకేష్.బి.లఠకర్, ఎ.సూర్యకుమారి, గుంటూరు జేసీ ఎ.దినేష్‌కుమార్, రాజమండ్రి సబ్ కలెక్టర్ డాక్టర్ పి.మహేష్‌కుమార్‌తోపాటు తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా, సింగపూర్ రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లాస్థాయిలో విస్తృతంగా సేవలు అందించిన 94 మంది నిస్వార్థ సేవకులకు అవార్డులను, ట్రోఫీలను గవర్నర్ ప్రదానం చేశారు.

### 'నాటా'కు ప్రశంసలు

కోవిడ్–19 సమయంలో నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్(నాటా) 150 ఆక్సిజన్ సిలిండర్లను రెడ్‌క్రాస్ ద్వారా సహాయం చేసినందుకు అప్పటి నాటా అధ్యక్షుడు గోసాల రాఘవరెడ్డి, కార్యదర్శి ఆళ్ల రామిరెడ్డి, కోశాధికారి గంగ్ర నారాయణరెడ్డిని గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. ఆ సంస్థ సేవలకు గుర్తింపుగా నాటా పీఆర్ అండ్ మీడియా కో–ఆర్డినేటర్ డీవీ కోటిరెడ్డి, ఎం.పార్థసారథిరెడ్డి, కె.సాంబశివారెడ్డికి గవర్నర్ మెడల్, అవార్డులను ప్రదానం చేశారు.

## పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌కు రెడ్‌క్రాస్ గోల్డ్‌మెడల్




సాక్షి, హైదరాబాద్: పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌ను రెడ్‌క్రాస్ గోల్డ్‌మెడల్ వరించింది. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) అధ్యక్షుడు విశ్వభూషణ్ హరిచందన్ ఈ అవార్డును ప్రదానం చేశారు. ఏపీలోని విజయనగరం జిల్లా కురుపం గ్రామంలో మెడికల్ క్యాంపులో కావాల్సిన వనరులను సమకూర్చినందుకు, అలాగే చిత్తూరులో బ్లడ్ బ్యాంకు నిర్మాణం చేపట్టినందుకు గాను పవర్‌గ్రిడ్‌కు ఈ అవార్డు లభించింది. కాగా, పవర్‌గ్రిడ్ ఈ రెడ్‌క్రాస్ గోల్డ్ మెడల్‌ను అందుకోవడం ఇది మూడోసారి. పవర్‌గ్రిడ్ తరఫున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేశ్ శ్రీవాస్తవ అవార్డును అందుకున్నారు.

## విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

- మరో నలుగురు చిన్నారులకు గాయాలు
- కోనసీమ జిల్లాలోని జెడ్పీ పాఠశాలలో దుర్ఘటన
- సీఎం దిగ్భ్రాంతి.. మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం
- గాయపడిన వారికి కూడా రూ.లక్ష చొప్పున..


మృతిచెందిన విద్యార్థి నవీన్

కాట్రేనికోన/సాక్షి, అమరావతి : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం దొంతుకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై యడ్ల నవీన్ (7) అనే మూడో తరగతి విద్యార్థి మృత్యువాత పడ్డాడు. ఈ ప్రమాదంలో మరో నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. వీరిలో చిట్టిమేను వివేక్ (3వ తరగతి), తిరుపతి ఘన సతీష్‌కుమార్ (4వ తరగతి)లను అత్యవసర వైద్యం నిమిత్తం అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన మరో ఇద్దరు 3వ తరగతి విద్యార్థులు మొల్లేటి నిఖిల్, దొంతు మహీధరరెడ్డిలకు దొంతుకుర్రులోనే ప్రాథమిక వైద్యం అందించారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. పాఠశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న సచివాలయ భవనం శ్లాబ్ కోసం ఇనుప ఊచలను కట్ చేసేందుకు కటింగ్ మెషీన్ తీసుకొచ్చారు. దాని తీగ ఊచలకు తగలడం.. అదే సమయంలో విద్యార్థులు తాగునీటి కోసం ఆ ఇనుప ఊచలపై నుంచి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఇక సతీష్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, జిల్లా ఎస్పీ కె.లతామాధురి పరామర్శించి, పరిస్థితిని సమీక్షించారు. మృతిచెందిన విద్యార్థి నవీన్ కుటుంబీకులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. గాయపడిన విద్యార్థుల తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు.

**బాధితులకు అండగా ఉండండి : సీఎం**

విద్యార్థులకు కరెంట్ షాక్ ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతిచెందిన బాలుడి కుటుంబానికి శుక్రవారం ఆయన రూ.10 లక్షల నష్టపరిహారం ప్రకటించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి రూ.లక్ష పరిహారం ఇవ్వడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తోడుగా నిలవాలని సూచించారు.

## మైనారిటీల కోసం నియోజకవర్గానికి రూ.కోటి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మైనారిటీలు ఎక్కువగా ఉండే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.కోటి విలువైన పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి అంజాద్‌బాషా అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. శాఖాపరమైన అంశాలపై సమీక్షించారు. జెరూసలేం, హజ్ యాత్రలకు జాబితాలు సిద్ధం చేయాలన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇంతియాజ్, సంచాలకులు జీసీ కిషోర్‌కుమార్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసీఫ్, హజ్ కమిటీ చైర్మన్ గౌసల్‌లాసమ్ పాల్గొన్నారు.

## వైద్యరంగంలో సవాళ్లను అధిగమిస్తున్నాం

విశాఖలో ఐఎంసీ వార్షిక సదస్సు ప్రారంభం


మాట్లాడుతున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మధురవాడ (భీమిలి): వైద్య రంగంలో అనేక సవాళ్లను వైద్యులు సమర్థంగా అధిగమిస్తున్నారని, అంతుచిక్కని రోగాలను సైతం తమ మేధస్సుతో నయం చేయగలుగుతున్నారని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.మైథిలి చెప్పారు. ప్రతిష్టాత్మక మెడికల్ కౌన్సిల్ దక్షిణ భారతదేశ సదస్సు పీఎంపాలెం వీ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య రంగానికి సవాలుగా నిలిచిన చికెన్ పాక్స్ వంటి అనేక వ్యాధులను వైద్యరంగం సమర్థంగా ఎదుర్కొందన్నారు. ఆహ్వాన సంఘం చైర్మన్ డాక్టర్ టి.నారాయణరావు, కేజీహెచ్ ప్రొఫెసర్, సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ గురుప్రసాద్ తదితరులు మాట్లాడుతూ హెచ్ఐవీ, కుష్ఠు, వివిధ రకాల మొటిమలు, బొల్లి, చిన్నారుల్లో వచ్చే చర్మ వ్యాధులు ఫంగస్, బ్యాక్టీరియా వ్యాధుల వ్యాప్తిపై సదస్సులో చర్చించనున్నట్టు చెప్పారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు బుజ్జిబాబు, ఐఏడీవీఎల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దివ్య మాట్లాడారు. మూడు రోజులు పాటు జరిగే ఈ సదస్సుకు దక్షిణ భారత దేశం వివిధ రాష్ట్రాలకు చెందిన 800 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

## నాగార్జున సాగర్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయం నుంచి శుక్రవారం నీటి విడుదల కొనసాగుతోంది. రెండుగేట్లను ఐదడుగులు ఎత్తి 16,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 70,152 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి కుడి, ఎడమ, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, ఎస్ఎల్‌బీసీ, వరద కాలువ ద్వారా 53,952 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్‌లో 312.0450 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# తప్పుడు రాతలతో బాబు తలరాతను మార్చలేరు

**ఈనాడుపై మంత్రి పెద్దిరెడ్డి ధ్వజం**

సాక్షి, అమరావతి: ఈనాడు తన తప్పుడు రాతలతో రాజకీయంగా చతికిలబడ్డ చంద్రబాబు తలరాతను మార్చలేదని గనులు, అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. చంద్రబాబును మరోసారి సీఎం కుర్చీలో కూర్చోబెట్టాలనే దింపుడు కల్లం ఆశతో ఆ పత్రిక పని చేస్తోందన్నారు. 'రోజూ చచ్చేవాడి గురించి ఏడ్చేవారు ఎవరు?' అన్నట్లుగా ఈనాడు, టీడీపీ పరిస్థితి ఉందన్నారు. శుక్రవారం విజయవాడలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో పెద్దిరెడ్డి మీడియాతో మాట్లాడారు. కంకర లీజుకు వంకర బుద్ధి, గ్రానైట్ రవాణాలో నేతల మేత అంటూ రెండు రోజులుగా తప్పుడు కథనాలను ప్రచురించిందని ధ్వజమెత్తారు. సీఎం జగన్‌కు ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉందన్నారు. మైనింగ్‌కు సంబంధించి ఏవైనా అక్రమాలు జరిగితే ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. గ్రానైట్, మైనింగ్‌కు సంబంధించి ఎవరు అక్రమ వసూళ్లకు పాల్పడినా ఆ నంబర్‌కు ఫోన్ చేయాలని, ప్రతి ఫిర్యాదును తానే స్వయంగా పర్యవేక్షిస్తానని ప్రకటించారు. నిజమని తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. రూ.2 వేల కోట్లుగా ఉన్న మైనింగ్ రెవెన్యూను అక్రమాలు అరికట్టడం ద్వారా రూ.3,765 కోట్లకు పెంచగలిగామన్నారు.

### పారదర్శక లీజులతో కేంద్రం అవార్డులు

ఈ–వేలం అత్యంత పారదర్శక విధానమని, అందులో అక్రమాలకు తావే ఉండదని మంత్రి పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. ఈ–వేలం ద్వారా పారదర్శకంగా నిర్వహించిన మైనింగ్ లీజులకు కేంద్రం నుంచి రెండు, మూడు అవార్డులు కూడా వచ్చాయని చెప్పారు. సీఎం ఆదేశాల మేరకు మైనింగ్ కార్యకలాపాలను ఎస్ఈబీ పర్యవేక్షిస్తోందని తెలిపారు. రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టులను పెంచడంతోపాటు సీసీ కెమేరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రకాశం జిల్లాలోని విలువైన గ్రానైట్‌ను అక్రమంగా తరలించకుండా తుమ్మలచెరువు, నడికుడి వద్ద రెండు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. గతంలో 6 రీజనల్ విజిలెన్స్ స్క్వాడ్‌లు ఉండగా ఇప్పుడు ఉమ్మడి జిల్లాలకు 13 నియమించామన్నారు.

### నిర్దిష్టంగా చెబితే చర్యలు

ఖనిజ రవాణా వాహనాల ట్రాకింగ్ కోసం జీపీఎస్ సిస్టం తెచ్చామని మంత్రి పెద్దిరెడ్డి చెప్పారు. గ్రానైట్‌పై బరువు ఆధారిత పన్ను విధానాన్ని అమలులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వం ఇంత పకడ్బందీగా వ్యవహరిస్తున్నా ఈనాడు రోజూ తప్పుడు కథనాలను రాయడం బాధాకరమన్నారు. ఎక్కడైనా తప్పు జరిగితే ఫలానా చోట, ఫలానా వ్యక్తి చేశాడని నిర్దిష్టంగా చెబితే చర్యలు తీసుకుంటామన్నారు.

### టీడీపీ హయాంలోనే విశాఖలో భూదందాలు

విశాఖలో ల్యాండ్ స్కాం అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించాలనే ఉద్దేశంతో ఈనాడు పత్రిక వరుస కథనాలను రాస్తోందని మంత్రి పెద్దిరెడ్డి మండిపడ్డారు. విశాఖకు పరిపాలన రాజధాని రాకూడదని ఉత్తరాంధ్రపై విషం చిమ్ముతున్నారన్నారు. టీడీపీ హయాంలోనే విశాఖలో రూ.లక్షల కోట్ల భూదందాలు జరిగినట్లు ఈనాడు పత్రికలోనే గతంలో రాశారని తెలిపారు. ఉత్తరాంధ్రను దోచుకున్నవారే ఇవాళ సేవ్ ఉత్తరాంధ్ర అంటున్నారని టీడీపీ నేతలపై మండిపడ్డారు. అమరావతి పాదయాత్రను ఎందుకు నిలిపేశారో వారే చెప్పాలన్నారు. న్యాయస్థానంలో వారికి చుక్కెదురైన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు.

# అడవుల సంరక్షణకు ప్రాధాన్యం

- అటవీ శాఖ రాష్ట్ర సదస్సులో మంత్రి పెద్దిరెడ్డి
- ఎకరం అటవీ భూమి కూడా అన్యాక్రాంతం కాకూడదని ఆదేశం


అటవీ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పెద్దిరెడ్డి

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో అడవుల సంరక్షణకు సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యమిస్తున్నారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, ఇంధన, శాస్త్ర సాంకేతిక, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. విజయవాడలో రెండు రోజులుగా జరుగుతున్న అటవీ శాఖ రాష్ట్ర సదస్సులో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలో 23 శాతం ఉన్న అడవుల విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచడమే లక్ష్యంగా అటవీ శాఖ పని చేయాలని సూచించారు. రాష్ట్రంలోని ఎర్రచందనం చెట్లు స్మగ్లర్ల బారి నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, స్మగ్లర్లను ఉక్కుపాదంతో అణచివేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నిషేధం అమలుపై సీఎం జగన్ సీరియస్‌గా ఉన్నారని, పర్యావరణానికి మేలు చేసేలా ప్లాస్టిక్ రీసైక్లింగ్‌ను ప్రోత్సహించాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణ, పరిరక్షణలో రాష్ట్రం ముందు వరసలో ఉందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో అటవీ భూముల సరిహద్దులను నిర్దిష్టంగా గుర్తిస్తున్నామని, ఎక్కడైనా ఆక్రమణలు జరిగితే వాటిని గుర్తించేందుకు రెవెన్యూ–అటవీశాఖలు సంయుక్త సర్వే కూడా నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఒక్క ఎకరం అటవీ భూమి కూడా కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత అటవీ శాఖాధికారులదేనని స్పష్టం చేశారు. సదస్సులో అటవీ దళాల అధిపతి వై.మధుసూదన్‌రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పథకాలకు సిమెంట్ సరఫరాలో అలసత్వం వద్దు..**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, ప్రభుత్వ పథకాలకు అవసరమైన సిమెంట్‌ను అందించడంలో అలసత్వం ప్రదర్శించొద్దంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిమెంట్ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. సచివాలయంలో శుక్రవారం సిమెంట్ కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. నాడు–నేడు, గృహ నిర్మాణం వంటి కార్యక్రమాల కోసం అవసరమైన సిమెంట్‌ను అందించాల్సిన బాధ్యత సిమెంట్ కంపెనీలపై ఉందన్నారు.

## కుప్పం, మంగళగిరిపై చంద్రబాబుకు దిగులు

వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి : కుప్పం, మంగళగిరి నియోజకవర్గాలపై టీడీపీ అధినేతకు దిగులు పట్టుకుందని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ వి.విజయసాయిరెడ్డి ఎద్దేవా చేశారు. ఈ రెండు చోట్ల 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతే పరువుపోతుందనే దిగులు చంద్రబాబుకు పట్టుకుందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్ కుప్పం పర్యటన సందర్భంగా వచ్చిన జనం స్థానికులు కాదనే మాటతోపాటు అనేక అభాండాలు వేశారని.. తన పాత నియోజకవర్గం చంద్రగిరి మాదిరిగానే కుప్పం కూడా వచ్చే ఎన్నికల్లో తనను ఓడిస్తుందనే భయం బాబుకి పట్టుకున్నట్లు కనిపిస్తోందన్నారు. ఇక 2019 ఎన్నికల్లో లోకేశ్ ఓడిపోయినప్పటి నుంచి మంగళగిరిలో పార్టీ కార్యక్రమాలు పెరిగిపోయాయని ఇటీవల సమీక్షలో చంద్రబాబు తెగ సంబరపడిపోయారన్నారు. పొత్తుల కారణంగానే మంగళగిరిలో టీడీపీ బలహీనపడిందని, గత ఎన్నికల్లో ఓడిపోయిందని చెప్పడం నమ్మశక్యంగా లేదన్నారు. వాస్తవానికి తెలుగుదేశం పుట్టినప్పటి నుంచి చూస్తే, మిత్రపక్షాలైన సీపీఎం, బీజేపీకి మంగళగిరి సీటు కేటాయించింది కేవలం నాలుగుసార్లు మాత్రమేనని తెలిపారు.



# ఐటీ హబ్‌గా విశాఖలో అపారమైన అవకాశాలు

▶ మొదటి పేజీ తరువాయి

తమ తదుపరి డెస్టినేషన్‌గా ద్వితీయశ్రేణి నగరాల్ని ఎంపిక చేసుకుంటున్నాయని, ఇందులో మొదటి వరుసలో విశాఖపట్నం ఉందని చెప్పారు. ఆసియా–పసిఫిక్ ప్రాంతానికి డేటా సెంటర్ హబ్‌గా భారత్ అవతరించబోతోందన్నారు. అరవింద్‌కుమార్ ఇంకా ఏమన్నారంటే..

**ఏపీ ఐటీ పాలసీ అద్భుతం**

ఐటీ సర్వీస్ సెక్టార్ పరిశ్రమల ఏర్పాటుకు వైజాగ్ వంటి నగరాలే మొదటి ప్రాధాన్యం. విశాఖపట్నం ఒక డైనమిక్ సిటీ. కాస్త ప్రోత్సాహకాలు అందిస్తే.. ఐటీ రంగం మొత్తం విశాఖ వంటి నగరాల వైపు పరుగులు తీస్తుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐటీ పాలసీ కూడా అద్భుతంగా ఉంది. మరిన్ని అవకాశాల కోసం పరిశ్రమలు ఎదురు చూస్తున్నాయి. చైనా, జపాన్ వంటి దేశాల పోటీని తట్టుకోవాలంటే వైజాగ్ వంటి టైర్–2 నగరాలని ఎంపిక చేసుకోవాల్సిందే.

**డేటా సెంటర్ హబ్‌గా భారత్**

ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో డేటా సెంటర్ హబ్‌గా భారత్ అవతరించే అవకాశం ఉంది. ఇందుకు ఎస్‌టీపీఐ నుంచి సంపూర్ణ మద్దతు అందిస్తున్నాం. డేటా సెంటర్లకు సంబంధించిన విధానాన్ని రూపొందించే పనిలో కేంద్ర ప్రభుత్వం ఉంది. ఈ పాలసీని అమలుచేసే ఏజెన్సీగా ఎస్‌టీపీఐ వ్యవహరిస్తుంది. ఫిన్‌టెక్, హెల్త్‌కేర్, బ్లాక్‌చెయిన్ వంటి సాంకేతిక రంగాలపై దృష్టిసారిస్తున్నాం.

**బీపీవోల ఓటు వైజాగ్‌కే**

బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ (బీపీవో) కంపెనీలు కూడా ద్వితీయశ్రేణి నగరాల బాట పడుతున్నాయి. వీటి ఓటు కూడా వైజాగ్‌కే ఉందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా బీపీవో సీట్స్‌లో ఏపీ వాటా 27 శాతం కాగా.. విశాఖపట్నం వాటా 20 శాతం ఉండటం గమనార్హం. ఇది ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల వల్ల సాధ్యమైంది. ఈ నేపథ్యంలో వైజాగ్‌లో ఎస్‌టీపీఐ సేవలు మరింత విస్తృతం చేయాలని నిర్ణయించాం. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఉన్న కార్యాలయం కాకుండా మరో 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నాం.

**2026 నాటికి 80 బిలియన్ల మార్కెట్ ఎస్‌టీపీఐ లక్ష్యం**

ప్రస్తుతం ఎస్‌టీపీఐ సేవలను విస్తృతం చేశాం. వై2కే సమస్యని అధిగమించి అడుగులు వేయడం వల్లే.. ఎస్‌టీపీఐపై ప్రపంచవ్యాప్తంగా నమ్మకం ఏర్పడింది. అందుకే సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల ఎగుమతుల మార్కెట్‌లో 1992లో రూ.17 కోట్లు మాత్రమే ఉన్న మా వాటా.. ప్రస్తుతం రూ.5.69 లక్షల కోట్లకు చేరుకుంది. 2026 నాటికి 80 బిలియన్ డాలర్లకు చేరుకోవడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. అదేవిధంగా సాఫ్ట్‌వేర్ సేవల మార్కెట్‌లోను రూ.227 కోట్ల వాటాను ఆర్జించాం.

**సీవోఈలకు అమ్మలాంటి కల్పతరు**

ఇప్పటికే ఎస్‌టీపీఐ 20 సెంటర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీవోఈ)లని దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసింది. విశాఖపట్నంలోను సేవలందిస్తున్నాం. పరిశోధనలు, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు అన్ని విధాలా అడుగులు వేస్తున్నాం. ఇందుకోసం కల్పతరు ప్రారంభించాం. ఏపీ ప్రభుత్వం కూడా ఇందులో భాగస్వామిగా ఉండటం హర్షదాయకం. సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల క్లస్టర్‌గా ఇది ఉపయుక్తమవుతుంది. ఇప్పటివరకు కల్పతరు ఇండస్ట్రీ 4.0 కోసం 250 దరఖాస్తులు వచ్చాయి.

# పంజాబ్‌కు ఆదర్శంగా ఏపీ

▶ మొదటి పేజీ తరువాయి

'సాక్షి'తో వికాస్ ప్రతాప్ మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

### ఏపీ ఆర్బీకేలపై దేశవ్యాప్తంగా చర్చ

22 జిల్లాలతో కూడిన మా రాష్ట్రంలో 25 లక్షల ఆవులు, 40 లక్షల గేదెలున్నాయి. ముర్రా జాతి పశువులే ప్రధాన పాడి సంపద. ఏపీలో మాదిరిగానే పంజాబ్‌లోనూ సహకార రంగం చాలా పటిష్టంగా ఉంది. ఇక్కడి ఆర్బీకేల తరహాలో సేవలను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చే ఆలోచన ఉంది. ఏపీలో ఏర్పాటుచేసిన ఆర్బీకేలపై దేశం మొత్తం చర్చించుకుంటోంది. ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాలా దూరదృష్టితో వ్యవసాయ, అనుబంధ రంగాలకు పెద్దపీట వేస్తూ ఎన్నో వినూత్న కార్యక్రమాలు అమలుచేస్తున్నారు. వన్‌స్టాప్ సొల్యూషన్ సెంటర్స్‌గా తీర్చిదిద్దిన ఆర్బీకేల ఆలోచన చాలా వినూత్నం. అలాగే, దేశవాళీ గో జాతులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ఇక్కడ గో పెంపకం కేంద్రాల ఏర్పాటు కూడా మంచి ఆలోచన. వాటి ఉత్పత్తులకు కూడా మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం నిజంగా గొప్ప విషయం. ఏపీ ప్రభుత్వం నుంచి నేర్చుకోవాల్సిన, ఆచరించాల్సిన విషయాలు చాలా ఉన్నాయి.

### పంజాబ్‌లో 70 వాహనాలు ఏర్పాటుచేస్తున్నాం

వైఎస్సార్ పశు సంచార వైద్య సేవా రథాలలో కల్పించిన సౌకర్యాలు చాలా బాగున్నాయి. ఇదే మోడల్‌లో మా రాష్ట్రంలోనూ జిల్లాకు మూడుచొప్పున 70 వాహనాలు ఏర్పాటుచేయాలని సంకల్పించాం. అందుకోసమే వాటిని పరిశీలించేందుకు ఇక్కడకు వచ్చాం. తాము ఊహించిన దానికంటే మెరుగైన సౌకర్యాలను ఈ అంబులెన్స్‌లలో కల్పించారు. ప్రతీ వాహనానికి ఓ పశువైద్యుడు, వెటర్నరీ డిప్లమో చేసిన సహాయకుడు, డ్రైవర్ కమ్ అటెండర్లను నియమించడం, వెయ్యికిలోల బరువున్న జీవాలను తరలించేందుకు వీలుగా హైడ్రాలిక్ లిఫ్ట్, 20 రకాల పరీక్షలు, 15 రకాల రక్త పరీక్షలు చేసేందుకు అనువుగా మైక్రోస్కోప్‌తో కూడిన మినీ లేబొరేటరీ, ప్రాథమిక వైద్యసేవలతో పాటు సన్నజీవాలు, పెంపుడు జంతువులు, పక్షులకు సర్జరీలు చేసేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించడం చాలా బాగుంది. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేయగానే రైతు ముంగిటకు వచ్చి వైద్యసేవలు అందిస్తున్న తీరు కూడా అద్భుతం. వాహనాలను డిజైన్ చేసిన టాటా, నిర్వహణ బాధ్యతలు చూస్తున్న జీవీకే యాజమాన్యాలకు నా ప్రత్యేక అభినందనలు.

అపేక్ష లేని వాడు, శుచియైన వాడు, దక్షత కలవాడు, ఉదాసీనుడు, వ్యధలు నశించిన వాడు, అన్ని విధాలైన కార్యాలలో నేను చేస్తున్నాననే భావం లేనివాడు అయిన భక్తుడు నాకు ప్రియుడు.

– భగవద్గీత



సాక్షి

శనివారం, అక్టోబర్, 29

# ‘ఫెడరల్’ పరిరక్షణ ముఖ్యం

జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)ను మరింత పటిష్ఠం చేయబోతున్నామనీ, వచ్చే రెండేళ్లలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో దాని విభాగాలుంటాయనీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం ప్రకటించారు. భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ), నేరశిక్షా స్మృతి(సీఆర్పీసీ)లకు సవరణలు కూడా చేస్తామన్నారు. హరియాణాలోని సూరజ్‌కుండ్‌లో ముఖ్యమంత్రులు, హోంమంత్రులు పాల్గొన్న మేధోమథన సదస్సులో ఆయన ఈ ప్రకటన చేశారు. ఎన్ఐఏ విస్తరణ, నేరాల స్వభావం మారుతున్న తీరు గురించి అమిత్ షా వ్యక్తం చేసిన అభిప్రాయాలతో విభేదించాల్సిన అవసరం లేదు. ఉగ్రవాదం సైబర్ ప్రపంచంలో కూడా స్వైరవిహారం చేస్తూ దేశ ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని చూస్తుండటం రహస్యమేమీ కాదు. కనుక అమిత్ షా అన్నట్టు నేర సామ్రాజ్యాన్ని కూల్చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమష్టి బాధ్యతే. అయితే తీసుకురాదల్చిన ఏ మార్పుల విషయంలోనైనా రాష్ట్ర ప్రభుత్వాలను విశ్వాసంలోకి తీసుకోవటం, వాటి మనోభావాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు, చేర్పులకు సిద్ధపడటం అవసరమని కేంద్రం గుర్తించాలి. ముంబై మహానగరంపై ఉగ్ర దాడి నేపథ్యంలో 2008లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఎన్ఐఏ చట్టాన్ని తెచ్చింది. ఒక రాష్ట్రానికి చెందిన ఉగ్రవాదులు మరో రాష్ట్రంలోకి ప్రవేశించి అలజడులు సృష్టించటం, వేరే దేశాల ఉగ్రవాదులు చొరబడి విధ్వంసక చర్యలకు పాల్పడటం వంటి తీవ్ర నేరాల అణచివేతకు సాధారణ పోలీసు విభాగాలు సరిపోవనీ, సీబీఐపై ఇప్పటికే ఉన్న ఒత్తిళ్ల వల్ల అది కూడా ఈ తరహా నేరాలపై దృష్టి కేంద్రీకరించలేదనీ అప్పటి ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో ఎన్ఐఏకు విశేషాధికారాలు ఇవ్వటం కోసం తాను ‘రాజ్యాంగ పరిమితులను అతిక్రమించే ప్రమాదకరమైన విన్యాసం చేయవలసి వస్తున్నద’ని అప్పటి అమెరికా ఎఫ్‌బీఐ చీఫ్ రాబర్ట్ మ్యూలర్‌తో 2009లో నాటి కేంద్ర హోంమంత్రి చిదంబరం వాపోయినట్టు 2011లో బయటపడిన వికీలీక్స్ టేపుల్లో వెల్లడైంది. ఎన్ఐఏ ఏర్పాటు వ్యవహారం ఎంత సున్నితమైనదో ఈ అభిప్రాయమే చెబుతోంది.

రాష్ట్రాల హక్కుల్ని కేంద్రం హరిస్తున్నదని గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీయే పలుమార్లు ధ్వజమెత్తారు. ఆయన నాయకత్వంలో కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇది మరింత పెరిగిందే తప్ప తగ్గలేదని పశ్చిమబెంగాల్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, కేరళ తదితర విపక్ష పాలిత రాష్ట్రాలు ఆరోపించటం రివాజైంది. రాష్ట్రాల ఆదాయవనరులు కుదించటం మొదలుకొని పలు రంగాల్లో కేంద్రం జోక్యం పెరుగుతున్నదనీ, రాష్ట్రాలను మున్సిపాలిటీల స్థాయికి దిగజారుస్తున్నారనీ ఆ ఆరోపణల సారాంశం.

వీటన్నిటికీ పరాకాష్ఠ ఎన్ఐఏపై రెండేళ్ల క్రితం సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్ దాఖలు చేసిన పిటిషన్. తమ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వమే ఈ చట్టం తెచ్చిందన్న సంగతి కూడా మరిచి శాంతిభద్రతల పరిరక్షణ వ్యవహారంలో చట్టం తెచ్చే అధికారం పార్లమెంటుకు ఎక్కడిదని ఛత్తీస్‌గఢ్ ప్రశ్నించింది. నిజానికి ఎన్ఐఏ చట్టం తెచ్చినప్పుడే ఆ చర్య రాష్ట్రాల అధికారాల్లో జోక్యం చేసుకోవటం అవుతుందన్న సంగతి చిదంబరానికి తెలుసు. మ్యూలర్ దగ్గర చిదంబరం వాపోవటం దీన్ని దృష్టిలో ఉంచుకునే. నేరాల దర్యాప్తులో రాష్ట్రానికుండే అధికారాలను ఎన్ఐఏ చట్టం హరిస్తున్నదని ఛత్తీస్‌గఢ్ ప్రధాన ఆరోపణ. ఎన్ఐఏకు మరిన్ని అధికారాలు కట్టబెట్టి, దాన్ని మరింత కఠినతరం చేస్తూ 2019లో ఎన్‌డీఏ ప్రభుత్వం సవరణలు తీసుకొచ్చింది. దీనికి అనుగుణంగా ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం యూఏపీఏకు కూడా సవరణలు చేసింది. ఛత్తీస్‌గఢ్ సవాలు చేసింది ఈ సవరణలను కాదు. మొత్తం ఎన్ఐఏ చట్టమే ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీస్తుందని వాదించింది. ఆ కేసులో సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు వెలువరిస్తుందన్న సంగతలా ఉంచి, ఎన్ఐఏ తీరుతెన్నుల విషయంలో రాజకీయ పక్షాల నుంచి, ప్రజాసంఘాల నుంచి విమర్శలు వస్తూనే ఉన్నాయి. సాధారణ పౌరులకు ఫెడరలిజం వంటి అంశాలపై పెద్ద పట్టింపు లేకపోవచ్చు. కానీ రాష్ట్రాలు శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా వ్యవహరించలేవనీ, ఉగ్రవాదంవంటి అంశాల్లో దర్యాప్తు కోసం వాటి అనుమతి తీసుకోవటంలో అపరిమితమైన జాప్యం చోటుచేసుకుంటున్నదనీ నిర్ధారించేందుకు అవసరమైన డేటా కేంద్రం దగ్గర ఉన్నదా? ఇటీవలే జరిగిన కొయంబత్తూరు పేలుడుకు సంబంధించి తమిళనాడు పోలీసులు చురుగ్గా స్పందించి, ఎన్ఐఏ ఆ కేసును తీసుకొనే లోపే ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఉగ్రవాదాన్ని ఏ రాష్ట్రమూ ఉపేక్షించదని ఈ ఉదంతం చెబుతోంది. స్వేచ్ఛాయుత సమాజాలను భయకంపితం చేయటం, రాజ్యాంగ వ్యవస్థలను విచ్ఛిన్నపరచటం ఉగ్రవాదుల ఆంతర్యం. అందుకు దీటుగా పోలీసు వ్యవస్థను తీర్చిదిద్దటం, పకడ్బందీ దర్యాప్తు జరిపి నేరగాళ్లకు శిక్షపడేలా చూడటం అవసరం. అలాగే న్యాయవ్యవస్థను పటిష్ఠం చేయటం ముఖ్యం. ఇలాంటి చర్యలు ఉగ్రవాదాన్ని దుంపనాశనం చేయగలవు తప్ప చట్టాలను మరింత కఠినం చేసు కుంటూ పోవటం పరిష్కారం కాదు.

ఎన్ఐఏను పటిష్ఠపరచటం, బ్రిటిష్ వలసపాలకుల కాలంలో పుట్టుకొచ్చిన ఐపీసీ, సీఆర్పీసీలను ప్రక్షాళన చేయటం వంటి అంశాల్లో పార్లమెంటులోనే కాదు, వెలుపల కూడా సమగ్ర చర్చ జరిగేలా చూడాలి. రాష్ట్రాల అభీష్టాన్నీ, పౌర సమాజం అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. తీసుకొచ్చే ఏ మార్పులైనా ఫెడరల్ వ్యవస్థకు విఘాతం కలగని రీతిలో ఉండాలి.

# స్థానిక భాషల్లో వైద్య విద్యా?

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

**భారతదేశంలో సుమారు 600 వైద్య కళాశాలలు ఉన్నాయి. విద్యార్థులకు తమ రాష్ట్రం వెలుపలి కాలేజీల్లో అడ్మిషన్లను పొందే స్వేచ్ఛ ఉంది. ఇంగ్లిష్ ఉపయోగాన్ని త్యజించడం వల్ల అలాంటి అవకాశం వీరికి కష్టమవుతుంది. హిందీ మీడియం విద్యార్థి ఇకపై కర్ణాటక లేక మహారాష్ట్రలో చదవటం కష్టమైపోతుంది. అక్కడ బోధనా మాధ్యమం ఇంగ్లిష్ లేదా స్థానిక భాషలో ఉంటుంది. ఇలాంటి విద్యార్థులు విదేశీ డిగ్రీ చదవడం ఇంకా కష్టసాధ్యమైన విషయం. హిందీ వైద్య పాఠ్యపుస్తకాలను ప్రారంభించడాన్ని మన విద్యా రంగంలో పునరుజ్జీవనం, పునర్నిర్మాణంగా కేంద్ర పాలకులు కొనియాడుతున్నారు. కానీ నిజమైన పునరుజ్జీవనం భారతీయ భాషల్లో కొత్తదైన మూల జ్ఞానాన్ని సృష్టించడంతోనే సాధ్యపడుతుంది.**

ఇంగ్లిష్ నుంచి హిందీలోకి అనువదించిన మూడు సెట్ల వైద్య పాఠ్య పుస్తకాలను గత వారాంతంలో భోపాల్‌లో అట్టహాసంగా విడుదల చేశారు. మధ్యప్రదేశ్‌లో ఎంబీబీఎస్ కోర్సు కోసం హిందీని బోధనా మాధ్యమంగా ప్రవేశపెట్టడానికి చేసిన ప్రయత్నంలో ఈ పాఠ్యపుస్తకాలు భాగం. నూతన విద్యావిధానం అమలుచేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆదేశాన్ని మధ్యప్రదేశ్ ప్రభుత్వం పాటిస్తోంది. ఇతర అంశాలతోపాటు, భారతీయ భాషల్లో సాంకేతిక, వైద్య కోర్సుల బోధనను నూతన విద్యావిధానం నొక్కి చెబుతోంది. వృత్తివిద్యా కోర్సుల కోసం జాయింట్ ఎంట్రెన్స్ పరీక్షలు వంటి అన్ని ప్రధానమైన పోటీ పరీక్షలను ఇప్పటికే ఇంగ్లిష్‌తో పాటు 12 భారతీయ భాషల్లో నిర్వహిస్తున్నారు. యూనివర్సిటీలలో గ్రాడ్యుయేషన్ కోర్సులలో ప్రవేశం కోసం ఇటీవలే ప్రారంభించిన కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ పరీక్షలో కూడా ఈ విధానాన్నే అమలు పరుస్తున్నారు.

ఉన్నత విద్య స్థాయిలో భారతీయ భాషల్లో బోధన పూర్తిగా కొత్త విషయం కాదు. దేశవ్యాప్తంగా విద్యా సంస్థలు వివిధ భారతీయ భాషల్లో పీహెచ్డీ స్థాయి వరకు కోర్సులను ప్రతిపాదిస్తున్నాయి. ఆయుర్వేదిక్ వైద్య కోర్సులను హిందీ, ఇతర భారతీయ భాషల్లో బోధిస్తున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం, తమిళనాడు ప్రభుత్వం తమిళంలో వైద్య విద్యా బోధన చేయాలనే ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. గతంలో ఉస్మానియా యూనివర్సిటీలో 1918 నుంచి 1948 వరకు ఉర్దూలో మెడిసిన్, ఇంజినీరింగ్ కోర్సులను బోధించారు. భోపాల్‌లో పాఠ్య పుస్తకాలను విడుదల చేసిన సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పినట్లుగా హిందీలో ఎంబీబీఎస్ కోర్సుల వెనుక లాజిక్ ఏమిటంటే– ఇంగ్లిషులో కంటే మాతృభాషలో విద్యా బోధన చేస్తే ఆలోచించడం, మననం చేయడం, హేతుపూర్వకంగా ఆలోచించడం, నిర్ణయాలు తీసుకోవడం వంటి అభిజ్ఞా నైపుణ్యాలు నేర్చుకోవడంలో పిల్లలు మెరుగ్గా ఉంటారన్నదే.

మాతృభాషల్లో విద్యాబోధన వల్ల ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ఈ మార్పును మరీ తొందరగా మొదలెట్టినట్లు కనిపిస్తోంది. సాంకేతిక, శాస్త్రీయ అంశాలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను అనువదించడంలో అతిపెద్ద సమస్య ఏమిటంటే, శాస్త్రీయ పదజాలాన్ని ఉపయోగించడమే. ఇంగ్లిష్‌లోని మూల పదజాలాన్ని అలాగే ఉంచాలా, భారతీయ భాషల్లోకి అనువదించవచ్చా? భోపాల్‌లో విడుదల చేసిన మూడు మెడికల్ పుస్తకాల (అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ) టైటిల్సు చూసినట్లయితే, ఇంగ్లిష్‌లో సుపరిచితమైన పదాలను యథాతథంగా తీసుకున్నట్లు కనిపిస్తోంది. అంటే వివరణాత్మక విషయాన్ని హిందీలో అందుబాటులో ఉంచుతారు. అది సంస్కృతీకరించిన హిందీలా కాకుండా, వాడుక భాషలోనే ఉంటుందని ఆశిద్దాము.

ఏవిధంగా చూసినా సరే, వైద్య పుస్తకాలను అనువదించటం కష్టమైన ప్రయత్నం. ఎందుకంటే ఈ వైద్యవిద్యా పట్టభద్రులు



మానవుల ప్రాణాలతో వ్యవహరిస్తారు. పైగా పాఠ్యపుస్తకాలు అనేవి వైద్య కోర్సులో ఒక భాగం మాత్రమే. పాఠ్యపుస్తకాలతోపాటు, వందలాది రిఫరెన్స్ పుస్తకాలు, మాన్యువల్స్ కూడా వీరు తిరగేస్తారు. ఇవి చాలావరకు ఇంగ్లిష్‌లోనే ఉంటాయి. ఒక డాక్టర్ శిక్షణ, బాధ్యతల నిర్వహణలో ఇవి చాలా ముఖ్యమైనవి. హిందీ, ఇతర భారతీయ భాషల్లో శిక్షణ పొందిన వైద్యులకు తదుపరి చదువులు, కెరీర్ అవకాశాలు సవాలుగా నిలుస్తాయి. ఎందుకంటే పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టడీస్, సూపర్ స్పెషలైజేషన్, మెడికల్ రీసెర్చ్ వంటివి ఇంగ్లిష్‌లోనే కొనసాగుతాయి. వైద్య బోధనను భారతీయ భాషల్లోనే చేయాలని ఆతృత ప్రదర్శిస్తున్నవారు వీటిని కూడా అనువదించి ఇస్తారా, ఇది ఎలా సాధ్యపడుతుంది అనేది స్పష్టం కావడం లేదు. పాఠ్యపుస్తకాలు, ‘కోర్స్‌వేర్’తో పాటు శిక్షణ పొందిన టీచర్లు, పరీక్ష యంత్రాంగం, బహు భాషా రీసెర్చ్ జర్నల్స్ వగైరాలు కూడా అవసరమే. జాతీయ వైద్య కమిషన్ లేక రాష్ట్ర వైద్య విద్యా విభాగాలు దీనికి సంబంధించి ఏదైనా బ్లూప్రింట్‌ను రూపొందించి ఉంటే దాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

ప్రస్తుతం, భారతదేశంలో 600 వైద్య కళాశాలలు ఉన్నాయి. విద్యార్థులకు తమ రాష్ట్రం వెలుపలి కాలేజీల్లో అడ్మిషన్లను పొందే స్వేచ్ఛ ఉంది. ఇంగ్లిష్ ఉపయోగాన్ని త్యజించడం వల్ల అలాంటి అవకాశం వీరికి కష్టమవుతుంది. ఉదాహరణకు, మధ్యప్రదేశ్ నుండి హిందీ మీడియం డిగ్రీ ఉన్న ఒక విద్యార్థి ఇకపై కర్ణాటక లేక మహారాష్ట్రలోని కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవటం కష్టమైపోతుంది. ఎందుకంటే అక్కడ బోధనా మాధ్యమం ఇంగ్లిష్ లేదా స్థానిక భాషలో ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఇలాంటి విద్యార్థులు విదేశీ డిగ్రీ చదవడం ఇంకా కష్టసాధ్యమైన విషయంగా ఉంటుంది.

ఉస్మానియా యూనివర్సిటీలో వైద్య విద్యలో కోర్సులు బోధిస్తున్నప్పుడు విద్యార్థులందరికీ ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం ఉండటం తప్పనిసరిగా ఉండేది. పాఠ్యపుస్తకాలు కూడా ఆంగ్లంలో ఉండేవి. ఉర్దూలో బోధన ప్రారంభం కావడానికి ముందే, ఒక అనువాద బ్యూరోని ఏర్పర్చారు. శాస్త్రీయ పదజాలంతో వ్యవహరించడానికి అనువాద మెథడాలజీ వృద్ధిచేశారు. రవీంద్రనాథ్ టాగూరు సహా దేశమంతటి నుంచి విద్యా నిపుణులను సంప్రదించేవారు. ప్రస్తుత సందర్భంలో అలాంటి పథకం లేదు. విద్యార్థి బృందంతో సహా విద్యతో సంబంధమున్న ప్రతి ఒక్కరితోనూ విస్తృత సంప్రదింపులు జరపడం కూడా ఇప్పుడు లేకుండా పోయింది. పలు భారతీయ భాషల్లోకి పాఠ్య పుస్తకాలు అనువదించినట్లయితే, అనుకూలత లేదా సమరూపతకు హామీ ఇవ్వడానికి సాంకేతిక పదాలను ప్రామాణీకరించాలి.

మాతృభాషలో సాంకేతిక కోర్సులను బోధించడాన్ని సమర్థించేవారు జపాన్‌ను ఉదాహరణగా చూపుతున్నారు. జపనీస్ భాషలో బోధన ద్వారా జపాన్ గొప్ప సాంకేతిక, పారిశ్రామిక ముందంజ వేయగలిగిందని చెబుతున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం కూడా అప్పట్లో జపాన్ నుండి ప్రేరణ పొందింది. 1920లలో హైదరాబాద్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ డైరెక్టర్ సయ్యద్ రాస్ మసూద్‌ను జపనీస్ సాంకేతిక విద్యా నమూనా అధ్యయనం కోసం జపాన్ పంపించారు. చైనా, రష్యా, జర్మనీ కూడా తమతమ భాషల్లోనే సాంకేతిక విద్యలను బోధించేవి. ఇవి దశాబ్దాలపాటు శాస్త్ర సంబంధ పదజాలాన్ని అభివృద్ధి చేసుకున్నాయి. ఈ దేశాలకూ, భారతదేశానికీ మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం ఏమిటంటే, అవి చాలావరకు ఏక భాషా సమాజాలు. భారత్ బహు భాషల నిలయం.

ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత విద్యాసంస్థల్లో కూడా భారతీయ భాషల్లో కోర్సులను ప్రవేశపెడతామని కేంద్ర హోంమంత్రి సెలవిచ్చారు. ఇంజినీరింగ్ విద్యను భారతీయ భాషల్లోనే బోధించడానికి పది రాష్ట్రాల్లో సన్నాహాలు చేస్తున్నామని అమిత్ షా చెప్పారు. తమిళం, తెలుగు, మరాఠీ, బెంగాలీ, మలయాళం, గుజరాతీ భాషల్లోకి ఇంజినీరింగ్ పుస్తకాలను అనువదిస్తున్నట్లు తెలిపారు. భారతీయ భాషల్లో బోధనలో పదజాలం, ఇతర సమస్యలతో పాటు అలాంటి ఇంజినీరింగ్ కోర్సులు కీలక రంగాల్లో పోటీతత్వాన్ని హరింపజేస్తాయి. ప్రత్యేకించి ఔట్ సోర్సింగ్ పరిశ్రమలో పోటీ ఎంతగా ఉంటుందో తెలిసిందే. సాఫ్ట్‌వేర్, ఐటీ ఆధారిత సేవల్లో భారత్ అగ్రగామిగా ఉండటానికి ఆంగ్లంతో సుపరిచితమైన ఇంజినీరింగ్ వర్క్ ఫోర్స్ కారణం అని చెప్పాల్సి ఉంటుంది. ప్రత్యేకించి ఇతర దేశాలు కూడా పోటీ పడుతున్నప్పుడు, సాధారణ ఉద్యోగాల స్థానంలో యాంత్రికీకరణ వేగంగా ప్రవేశిస్తున్నప్పుడు ఈ మార్కెట్లో భారత్ తన స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోకూడదు.

హిందీ వైద్య పాఠ్యపుస్తకాలను ప్రారంభించడాన్ని మన విద్యా రంగంలో పునరుజ్జీవనం, పునర్నిర్మాణంగా కొనియాడుతున్నారు. నిజమైన పునరుజ్జీవనం అనేది భారతీయ భాషల్లో కొత్తదైన మూల జ్ఞానాన్ని సృష్టించడంతోనే సాధ్యపడుతుంది.

వ్యాసకర్త వైజ్ఞానిక అంశాల వ్యాఖ్యాత
(‘ద ట్రిబ్యూన్’ సౌజన్యంతో)

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

### పోయినా గెలిచినట్టే



పరాగ్ అగర్వాల్ (తొలగించబడిన ట్విట్టర్ సీఈఓ) నిజానికి ప్రపంచంలోనే అత్యంత ధనికుడిని కోర్టుకు ఈడ్చి, అంతకు ముందు చెప్పింది తప్పని అతడితో ఒప్పించి, వ్యవహారం కుదుర్చుకునేట్టు చేసి, ఈ ప్రక్రియలో భాగంగా కనీసం 40 మిలియన్ డాలర్లు పొందాడు. పరాగ్ అగర్వాల్ గ్రేటర్ దేన్ ఎలన్ మస్క్.

– సందీప్ మనుధానే, ఆంత్రప్రెన్యూర్

### గతం నుంచి బయటపడాలి



ఒకవేళ స్పామ్ బాట్స్ (రోబోలు), అనామక అకౌంట్లు తొలగిస్తే; నిజమైన మనుషులను మాత్రమే అనుమతిస్తే; మాస్ కాపీ పేస్టులు, కృత్రిమ ట్రెండ్స్ లాంటి స్పామింగ్ మంత్రాంగాలను నిరోధిస్తే; భావప్రకటన స్వేచ్ఛ అనేది విద్వేష ప్రసంగం కాదని అర్థం చేసుకుంటే నిజంగా ట్విట్టర్ అనేది మెరుగైన వేదిక అవుతుంది.

– సంజుక్తా బసు, సంపాదకురాలు

### కాల చక్రం



కర్మ చక్రం ఎలా తిరుగుతుందో కదా! బ్రిటిష్ వారి పాలనలో కుక్కలు, భారతీయులకు క్లబ్బుల్లోకి అనుమతి ఉండేది కాదు. ఇప్పుడు బ్రిటన్ ప్రధానిగా రిషి సునాక్, అతడి కుక్కతోపాటు 10 డౌనింగ్ స్ట్రీట్‌కు వెళ్లారు.

– ప్రియా గుప్తా, బాలీవుడ్ నిర్మాత

### కూడని ధనం



లాటరీలో పాల్గొనడం అతిపెద్ద పాపం. అందులో గెలిచిన బహుమతి ‘హరామ్’ (దైవసమ్మతం కాని) సొమ్ము.

– అస్సీమ్ అల్‌హకీమ్, ఇస్లాం మతగురువు

### అదంతే!




జింబాబ్వే వర్సెస్ పాకిస్తాన్ టీ20 ప్రపంచ కప్‌లో– మేము జింబాబ్వే గెలిచినదానికన్నా, పాక్ ఓడినందుకు ఎక్కువ వేడుక చేసుకుంటున్నాం.

– హబీబ్ ఖాన్, అఫ్గానిస్తాన్ జర్నలిస్ట్

# ప్రపంచ ఆకలి సూచీని నమ్మవచ్చా?

సందర్భం



డాక్టర్
ఎస్. జతిన్ కుమార్

తాజాగా వెలువడిన ‘2022 ప్రపంచ ఆకలి సూచీ’ (గ్లోబల్ హంగర్ ఇండెక్స్)లో 101వ స్థానం నుంచి 107కు భారతదేశం పడి పోయింది. యుద్ధంతో అతలాకుతలమైన అఫ్గానిస్తాన్ మినహా అన్ని ఆసియా దేశాల కంటే భారతదేశం వెనుకబడి ఉందన్న వార్త మీడియాలో ప్రముఖంగా వచ్చింది. ప్రభుత్వ వర్గాలతో సంబంధం వున్న పార్టీలు, సంస్థలు, అధికార వర్గాలు ఈ అధ్యయనం నిర్వహించిన సంస్థ నిర్లక్ష్యపూరితంగా, బాధ్యతా రహితంగా ఉందనీ, భారత దేశాన్ని అప్రతిష్ఠపాలు చేయాలనే ఉద్దేశంతో పనిచేస్తోందనీ, అందుకోసం నిరాధారమైన అంకె లను, పరిశీలన, అధ్యయనం పేరిట గంభీరంగా ప్రచురిస్తోందనీ దానిని ఖండిస్తున్నాయి. ఈ ఖండనలు చేసేవారు కొన్ని వాస్తవాలు పరిశీలించాలి.

గ్లోబల్ హంగర్ ఇండెక్స్ (జీహెచ్ఐ) ప్రతి ఏటా లెక్కించబడుతుంది. 2022 జీహెచ్ఐ నివేదిక కోసం, 136 దేశాల డేటాను మదింపు చేశారు. వీటిలో స్కోర్‌లను లెక్కించడానికీ, ర్యాంక్ ఇవ్వడానికీ 121 దేశాలకు సంబంధించి తగినంత డేటా ఉంది (2021 నివేదికలో 116 దేశాలకు ర్యాంక్ ఇచ్చారు). అన్ని దేశాలకూ ఒకే రకమైన అంశాలనూ, ప్రమాణాలనూ పోల్చి స్కోరు ఇచ్చారు. తమ గణనలో అవకతవకలు లేవు. అభిమాన, దురభిమానాలకు తావే లేదని జీహెచ్ఐ వారు అంటున్నారు. ఇవి ఈ సంవత్సరమే అకస్మాత్తుగా వచ్చినవి కావు. 2006 నుండి అమెరికాలోని ఈ సంస్థ, జర్మనీలోని మరో సంస్థతో కలిసి స్కోరు ఇస్తోంది. మన దేశ ర్యాంకు కూడా ఒక్కసారిగా పడిపోయినది కాదు. 2022 లో 107/121; 2021 లో 101/116గా వుంది. 2016 నుండి క్రమంగా ఈ ర్యాంకు జారిపోతూనే వుంది.

గణాంకాల వివరాల్లోకి పోయే ముందు డాక్టరుగా నా సొంత అనుభవాన్ని చెబుతాను.

చాలా మంది గర్భిణీ స్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్నారని మా అనుభవం. మా రోగులు (ప్రైవేట్ ఆసుపత్రిని భరించగలవారు) పేదవారు కాదు. నా భార్య ప్రసూతి, స్త్రీ వ్యాధుల నిపుణురాలు. ఎక్కువ మంది గర్భిణుల పోషణ సగటు తొలి నెలల్లో బాగానే వున్నా, క్రమంగా కొన్ని పదార్థాలలో లోపం ఏర్పడుతోందనీ, ప్రసవ కాలానికి వారు రక్తహీనంగా మారుతున్నారనీ చెప్పేవారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రికి హాజరు కాని లేదా హాజరు కాలేని వ్యక్తుల పోషక స్థాయి గురించి ఆలోచించండి. చాలా మంది పిల్లలు, ముఖ్యంగా పని పాటలు చేసుకునే దిగువ తరగతి కుటుంబాల వారు; కోయ, లంబాడా తదితర తెగలకు చెందిన వారు తల్లి పాలపై ఉన్నంత కాలం



చాలా బొద్దుగా లేదా ఆరోగ్యంగా ఉండటం చూశాను. కానీ ఆ తల్లులు మాత్రం కావలసినంత పోషకాహారం లేక, కాదు– అసలు ఆహారమే చాలక ఎండిపోతూ వుంటారు. రెండు మూడేళ్ల వయస్సు వచ్చేసరికి బంతిపూలలా వున్న పిల్లలు ఈకలు తీసిన పక్షులలా కృశించిపోవటం చూశాను. తగిన ప్రోటీన్లు లేక శరీరంలో ఎదుగుదల ఆగిపోవటం, తిన్న తిండి వల్ల వచ్చే శక్తి సరిపోక అనారోగ్యం పాలు కావటం, తగినంత రోగ నిరోధక శక్తి వృద్ధి చెందక పోవటం జరుగుతోంది. ప్రసూతి సమయంలో చనిపోయే మహిళలు మనదేశంలో లక్ష మందికి 110 నుంచి 75 మంది దాకా ఉండగా, అమెరికాలో 20 మంది ఉన్నారు. నవజాత శిశువుల మరణాల రేటు మన దగ్గర ప్రతి వెయ్యిమందికి 22గా ఉంటే.. జపాన్‌లో 2, అమెరికాలో 5గా ఉంది. మనదేశంలో ఏడాది నిండకుండానే కన్ను మూస్తున్న శిశువులు వెయ్యికి 28 మంది ఉన్నారు. అలాగే 5 సంవత్సరాల వయసుకు చేరకుండానే మరణిస్తున్నవారి సంఖ్య 35/1000గా వుంటున్నది. ఇవన్నీ అభివృద్ధి చెందిన దేశాలలో కంటే చాలా ఎక్కువగా వున్నాయి. ఈ అంకెలన్నీ భారత ప్రభుత్వం ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు సవరించి ప్రచురించినవే. జీహెచ్ఐ వారు ఆధారం చేసుకున్నది ఈ సమాచారమే కనుక వారి ర్యాంకులు కూడా నిజమని నమ్మక తప్పదు. మన ప్రభుత్వాలకు ఈ వాస్తవాలు రుచించక, ఆ గణాంకాలు వారిని ఇబ్బంది పెడుతున్నాయి గనుక అంతర్జాతీయ ప్రమాణాలనే నిరాకరిస్తున్నారు.

కమ్యూనిటీ మెడిసిన్ చదివిన డాక్టర్లు కొందరు జీహెచ్ఐ పరిగణించిన సూచికలు చాలా ప్రామాణికమైనవే కానీ అవి మాత్రమే ఆకలిని సూచించవనీ, వాస్తవ పరిస్థితి మరింత భయంకరంగా ఉందనీ వ్యాఖ్యానిస్తున్నారు. జీహెచ్ఐ అనేది నాలుగు సూచికల నుంచి తీసుకోబడ్డ సరాసరి సారాంశం.

ఐదేళ్ల కంటే తక్కువ వయస్సు పిల్లల పోషకాహార లోపం ఉన్న జనాభా నిష్పత్తి, శారీరక క్షీణత (ఎత్తుకు తగ్గ బరువు), పిల్లల్లో ఎదుగుదల లోపం (వయస్సుకు తగ్గ ఎత్తు), మరణిస్తున్న పిల్లల నిష్పత్తి... ఇవే జీహెచ్ఐ అన్నిదేశాల్లో పరిగణనలోకి తీసుకున్న సూచికలు. అయితే వాస్తవ స్థితిని మరింత లోతుగా పరిశీలించటానికీ, మొత్తం జనాభాను పరిశీలించటానికీ మరిన్ని సూచికలు తయారు చేసుకోవాలి. ఆ లోతైన పరిశీలనలు మన ప్రభుత్వ పెద్దలను మరింత ఎక్కువగా కోపగ్రస్థులను చేస్తాయేమో!

వ్యాసకర్త ప్రముఖ వైద్యులు

# సిత్రాలు సూడరో శివుడో శివుడా!

అట్లుంటది



తెలిదేవర
భానుమూర్తి

జిద్దు ఇడ్వని విక్రమార్కుడు ఎప్పటిలెక్కనే మోటర్ల బొందలగడ్డ దిక్కు బోయిండు. బేతాలుని రొండంత్రాల బంగ్ల ముంగటాపి హారన్ గొట్టిండు. బేతాలుడింట్ల కెల్లి ఇవుతలకొచ్చిండు. మోటరెన్క సీట్ల ఆరాంగ గూసున్నడు. “నువ్వు ఎత్తుగడ్డలు, గుంతలని సూడకుంట మోటర్ నడ్పుతనే ఉంటవు. ఎవడన్న సైడియ్యక పోవచ్చు. బర్రు అడ్డం రావొచ్చు. ట్రాఫిక్ల ఇర్కపోతె నీకు తిక్కలెవ్వొచ్చు. నువ్వు బేచైన్ గాకుంట ఉండెతందుకు మునుగోడు ముచ్చట జెప్త ఇను” అన్నడు.

“ఊకూకె మునుగోడు, మునుగోడు అంటవేంది?” అని విక్రమార్కుడు అడిగిండు.

“ఎందుకంటె అందర్కి ఒక్క దినమే దివిలె. ఎలచ్చన్ల జాత్ర జెయ్యబట్కె మునుగోడు జెనంకు దినాం దివిలెనే. దినాం దావత్లే. దినాం మందుల తేలకుంట ముస్లుడే. అన్ని పార్టిల లీడర్లు ఒక్క తీర్గ చక్కర్లు గొడ్తున్నరు.”

“కల్లమున్న కాడ బిచ్చగాల్లు. ఓట్లున్న కాడ లీడర్లు”

“కాంగ్రెస్ దిక్కుకెల్లి నిలవడ్డ పాల్వాయి స్రవంతి ప్రచారం జేస్కుంట బోతుంటె బీజేపోల్లు అడ్డమొచ్చి శేర్ పటాకులు గాల్సింన్రు. కాల్లల్ల కట్టె పెట్టినట్లు జేసింన్రు.”

“కాంగ్రెసోల్లు ఊకున్నరా?”

“ఎందుకూకుంటరు. తమ్ము పాకుతోని గీల్లంటె తల్పు చెక్కతోని గాల్లన్నరు. బీజేపీ దిక్కుకెల్లి పోటీ జేస్తున్న రాజగోపాల్‌రెడ్డి జీపు ముంగట కాంగ్రెసోల్లు ఒక్క తీర్గ భూచెక్రాలు గాల్సి అడ్డం బడ్డరు. టీఆర్ఎస్, బీజేపీ పార్టీలు మందు బోస్తున్నయి. పైసలిస్తున్నయి. నరకాసురుని మీద్కి బానాలిడ్సిన సత్యభామ అసువంటిది మా స్రవంతి అని రేవంత్ రెడ్డి అన్కుంట గామెతోని బీజేపీ, టీఆర్ఎస్‌ల దిక్కు రొండు రాకిట్లు ఇడిపిచ్చిండు”.

“టీఆర్ఎసోల్లు పటాకులు గాల్వలేదా?”

“గాల్సింన్రు. సంస్థాన్ నారాయణ్‌పురంల 18 వేల కోట్ల స్టిక్కర్ తోని తయారు జేసిన పటాకులను మంత్రి గంగుల కమలాకర్ గాల్సిండు. రాజగోపాల్‌రెడ్డి బోతుంటె టీఆర్ఎసోల్లు అడ్డం దల్గి బాంబులు గాల్సింన్రు. నాకే అడ్డం దల్గుతరా? మీ తోడ్కల్ దీస్త అన్కుంట గాయిన కప్పగంతులు ముట్టిచ్చిండు. ఇగ టీఆర్ఎస్ దిక్కుకెల్లి పోటి జేస్తున్న కూసుకుంట ప్రభాకర్ రెడ్డి లక్ష్మీబాంబు బత్తి ముట్టిచ్చిండు. గది ధన్‌మనకుంట తుస్సు మన్నది”.

“గీ మూడు పార్టీలే గాకుంట కడ్మోల్ల ప్రచారం సంగతేంది?”

“కడ్మోల్లు అంటె ఇండిపెండెట్లు నిలవడ్డ కె.ఎ.పాల్ ప్రచారం గురించి రొండు ముచ్చట్లు జెప్త. గాయిన గుర్తు ఉంగ్రం. ఏలుకున్న ఉంగ్రం సూబెట్టుకుంట ఓట్లడ్గుతుంటె మాకు బంగారి ఉంగ్రం జేపిచ్చిస్తవా అని కొందరడిగింన్రు. నన్ను గెలిపిస్తె మునుగోడును అమెరిక జేస్త. గాలి మోటర్



అడ్డ బెట్టిపిస్త అని పాల్ అన్నడు. రాంగ్ సైడ్ల కొస్తున్నవని ఒక పోలీసాయిన మోటరాపితె నేనంటె ఎవ్వరనుకుంటున్నావు, కాబోయె తెలంగాన ముక్యమంత్రి ననుకుంట పాల్ బెదిరిచ్చిండు. అందరు సూస్తుండంగ ఇంకోతాన చెంగడ బింగడ డ్యాన్సు జేసిండు.”

“మునుగోడు ఎలచ్చన్ల ప్రచారంల కొత్త సంగతేమన్న ఉన్నదా?”

“ఇంతకుముందు ఎన్నడు లేని తీర్గ గీ బై ఎలచ్చన్ల పోస్టర్ల జంగ్ నడుస్తున్నది. మీ అభిమాన సత్యం థియేటర్లో నేడే బ్రహ్మాండమైన విడుదల. మునుగోడు కాంతి స్రవంతి. పాల్వాయి గోవర్ధన్ రెడ్డి బిడ్డ నీతి నిజాయితీల అడ్డ. దర్శకత్వం: విరాట్ కోహ్లీ అసుంటి రేవత్ రెడ్డి అని కాంగ్రెస్ పోస్టర్ ఏసింది. నేడే విడుదల. అమిత్ షా ప్రొడక్షన్స్ వారి పద్దెన్మిది వేల కోట్ల రూపాయలు. దర్శకత్వం: కోవర్టు రెడ్డి. నర్తకి 70 ఎం.ఎం. థియేటర్ అని టీఆర్ఎస్ పోస్టర్ అంటిచ్చింది. బండి సంజయ్ దర్శకత్వంలో నేడే విడుదల రాజన్న రాజినామా. ముఖ్యమంత్రి, మంత్రుల బ్యాంకు కాతాలల్ల బడ్గ నిర్వాసితుల బకాయిలు. గొర్రు కొనెతందుకు గొల్ల కురుమలకు రూపాయలు. కడ్మ సిన్మ ఎండి పర్ద మీద సూడుంన్రి అని బీజేపీ ఏసింది. కానీ గీ ఎలచ్చన్ల ఎవలు గెల్సినా పరకేం బడదు. జెనం బత్కులేం మారయి. పెట్రోలు, గ్యాస్ బండ దరలు మొగులు మీద్కి బోతనే ఉంటయి. రూపాయి బక్కగైతనే ఉంటది. ఎన్కట రూపాయి బిల్ల మీద వరికంకి బొమ్మ ఉండేది. గిప్పుడు గదే రూపాయి బిల్ల మీద బొటనేలు బొమ్మ ఎందుకున్నది. గీ సవాల్‌కు జవాబ్ జెప్పకుంటివా అంటే నీ మోటర్ బిరక్ ఫేలైతది” అని బేతాలుడన్నడు.

“ఎన్కట అందర్కి బువ్వ దొర్కుతుండె బట్కె రూపాయి బిల్ల మీద వరికంకి బొమ్మ ఉండేది. గిప్పుడు బువ్వ దొర్కకుండ బట్కె బొటనేలు చీక్కుంట బత్కుంన్రి అని గిప్పటి రూపాయి బిల్ల మీద బొమ్మ జెప్తున్నది” అని విక్రమార్కుడు అన్నడు.

ఇంతల బొందల గడ్డొచ్చింది. విక్రమార్కుడు మోటరాపిండు. బేతాలుడు మోటర్ల కెల్లి దిగి బంగ్ల దిక్కు బోయిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 99591 50491

## గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, తిథి: శు.చవితి ఉ.10.25 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: జ్యేష్ఠ ప.12.02 వరకు, తదుపరి మూల, వర్జ్యం: రా.7.31 నుండి 9.01 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.02 నుండి 7.33 వరకు
అమృతఘడియలు: తె.4.29 నుండి 6.01 వరకు (తెల్లవారితే ఆదివారం), నాగుల చవితి: రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు, యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు : సూర్యోదయం 6.01: సూర్యాస్తమయం 5.27.

## రుషికొండ నిర్మాణాలపై టీడీపీ గలాటా

**కొండపైకి వెళ్లేందుకు గందరగోళం సృష్టించిన టీడీపీ నాయకులు**

**సాక్షి, విశాఖపట్నం:** రుషికొండపై జరుగుతున్న నిర్మాణాలపై తెలుగుదేశం పార్టీ, ఆ పార్టీ మీడియా పదేపదే అసత్య ప్రచారం చేస్తూ గందరగోళ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు రుషికొండ సందర్శిస్తామంటూ ఎలాంటి అనుమతులు లేకుండానే గుంపులుగా వెళ్లి ఇబ్బందులు సృష్టించేందుకు ప్రయత్నించిన టీడీపీ నేతలు, కార్యకర్తలు.. మరోసారి విశాఖలో నానా గలాటా చేశారు. రుషికొండపై దండయాత్ర అంటూ ప్రజల్లో భయాందోళనల్ని సృష్టించేందుకు శుక్రవారం ఉదయం నుంచి ప్రయత్నాలు చేశారు. రుషికొండ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులపై జులుం ప్రదర్శించారు. అయినా పోలీసులు సంయమనం పాటిస్తూ.. వారిని నిలువరించారు. ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేలా వ్యవహరించొద్దంటూ నచ్చజెప్పాలని చూశారు. అయినా టీడీపీ నేతలు వినిపించుకోలేదు. సాయంత్రం కొంతమంది బీచ్ రోడ్డుకు చేరుకున్నారు. అక్కడ నానా యాగీ చేశారు. ప్రజలు, పర్యాటకులను భయభ్రాంతాలను చేసేందుకు ప్రయత్నించారు. ఉద్రిక్త పరిస్థితులు సృష్టించాలన్న దుష్ట సంకల్పంతో వచ్చిన టీడీపీ నేతల్ని, కార్యకర్తల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కై లాసగిరి సమీపంలోని పోలీస్ బ్యారెక్స్‌కి తరలించారు. టీడీపీ నేతలు అక్కడికి మీడియాని పిలిపించుకున్నారు. మీడియా ప్రతినిధులు వెళ్లిన వెంటనే పోలీస్ బ్యారెక్స్ వద్దే ధర్నాకు దిగుతున్నామంటూ రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. రుషికొండలో ఎవరికీ ఏమీ చెప్పకుండా ప్రభుత్వం దోచుకుంటోందంటూ టీడీపీ నేతలు అనిత, పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు.









# రూ.118.64 కోట్లతో కృష్ణానదికి రక్షణగోడ

**పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గమ్మ వారధి వరకు**

- టెండర్ నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వం
- రెండేళ్లలో పూర్తిచేయాలని షరతు
- ఇప్పటికే యనమలకుదురు నుంచి వారధి వరకు గోడ నిర్మాణం
- కృష్ణానదికి 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా విజయవాడలో లోతట్టు ప్రాంతాల ప్రజలకు బేఫికర్

**సాక్షి, అమరావతి:** కృష్ణానదికి విజయవాడలో పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గమ్మ వారధి వరకు రూ.118.64 కోట్లతో రక్షణగోడ నిర్మాణానికి ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ పనులను రెండేళ్లలో పూర్తిచేయాలని షరతు విధించింది. టెండర్ షెడ్యూలు దాఖలుకు నవంబర్ 10వ తేదీని గడువుగా నిర్ణయించింది. నవంబర్ 15న ఆర్థిక బిడ్‌ను తెరిచి.. అదేరోజున రివర్స్ టెండరింగ్ నిర్వహించి, కనిష్ట ధరకు పనులు చేయడానికి ఆసక్తిచూపిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తుంది. ఈ గోడ నిర్మాణం పూర్తయితే కృష్ణానదికి గరిష్టంగా 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా.. విజయవాడలోని లోతట్టు ప్రాంతాల్లోకి చుక్కనీరు కూడా చేరదు. కృష్ణానదికి కేవలం మూడులక్షల క్యూసెక్కుల వరద వస్తే చాలు.. విజయవాడలో కృష్ణలంక నుంచి యనమలకుదురు వరకు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యేవి. కృష్ణానదికి వరదలు వచ్చాయంటే లోతట్టు ప్రాంతాల ప్రజలు వణికిపోయేవారు. రక్షణగోడలు నిర్మిస్తామని ఎన్నికల్లో హామీలివ్వడం, తర్వాత వాటిని బుట్టదాఖలు చేయడం రివాజుగా మారిపోయింది. కానీ.. 2004 ఎన్నికల్లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన హామీ మేరకు యనమలకుదురు నుంచి కోటినగర్ వరకు కృష్ణానదికి 2.28 కిలోమీటర్ల పొడవున రక్షణగోడలు నిర్మించారు. మహానేత హఠాన్మరణం తర్వాత మిగిలిన లోతట్టు ప్రాంతాలకు రక్షణగోడ నిర్మించడంపై ఆ తర్వాతి ప్రభుత్వాలు దృష్టిపెట్టలేదు.



**రక్షణగోడ రెండోదశ రికార్డు సమయంలో పూర్తి**

పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కోటినగర్ నుంచి తారకరామనగర్ వరకు 1.56 కిలోమీటర్ల పొడవున రక్షణగోడ నిర్మాణ పనులను రూ.125 కోట్లతో 2021 మే 31న ప్రారంభించి రికార్డు సమయంలో పూర్తిచేశారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి 12 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేసినా లోతట్టు ప్రాంతాలకు వరద చేరకుండా పటిష్టంగా రక్షణగోడ నిర్మించారు. దీంతో కృష్ణానదికి ఇటీవల సుమారు ఆరులక్షల క్యూసెక్కుల వరద వచ్చినా విజయవాడలో లోతట్టు ప్రాంతాల్లోకి చుక్కనీరు కూడా చేరలేదు.

**ముంపు ఇబ్బందులు ఉండవు**

విజయవాడలో కృష్ణానది పరిసర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించేందుకు పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గమ్మ వారధి వరకు రక్షణగోడ నిర్మించే పనులకు సీఎం వైఎస్ జగన్ రూ.135 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులకు రూ.118.64 కోట్లతో ఓపెన్ విధానంలో జలవనరుల శాఖ అధికారులు టెండర్ నోటిఫికేషన్ జారీచేశారు. ఈ పనులు పూర్తయితే ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు గరిష్టంగా 12 లక్షల క్యూసెక్కుల వరదను విడుదల చేసినా.. విజయవాడలోని లోతట్టు ప్రాంతాలైన కృష్ణలంక నుంచి యనమలకుదురు వరకు ప్రజలకు ఎలాంటి ముంపు ముప్పు ఉండదని ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి చెప్పారు.

## నవంబర్ 8న దుర్గమ్మ ఆలయం మూసివేత

**ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ):** రాహుగ్రస్త చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని నవంబర్ 8న విజయవాడ ఇంద్రకీలాద్రి ఆలయాలను మూసివేస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ తెలిపింది. 8న ఉదయం 8 గంటలకు అమ్మవారికి మహా నివేదన తరువాత ఆలయ ద్వారాలను మూసివేస్తారు. ప్రధాన ఆలయంతో పాటు మల్లేశ్వర స్వామి వారి ఆలయం(బాలాలయం), నటరాజ స్వామి వారి ఆలయం, శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయంతో పాటు ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయాలను మూసివేస్తారు.







## టీడీపీ నేత 'వర్ల'కూ రైతు భరోసా ఇచ్చాం

- విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



వర్ల రామయ్య డ్రైవర్‌కు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

**భవానీపురం (విజయవాడ పశ్చిమ):** టీడీపీ నేత వర్ల రామయ్య కుటుంబసభ్యులు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారని విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని విద్యాధరపురం 44వ డివిజన్‌లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఇంటికి ఎమ్మెల్యే వెళ్లారు. అయితే ఆయన ఇంట్లో ఉన్నప్పటికీ బయటకు రాకుండా డ్రైవర్‌ను పంపించారు. దీంతో ప్రభుత్వం నుంచి రైతు భరోసా పథకం కింద ఆయన భార్య వర్ల జయప్రదకు రూ.13,500 అందిన సమాచారానికి సంబంధించిన కరపత్రాన్ని వెలంపల్లి అతనికి అందజేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయనటానికి ఇదే నిదర్శనమన్నారు. వర్ల రామయ్య భార్య జయప్రద రైతు భరోసా కింద మూడేళ్లుగా లబ్ధిపొందారని తెలిపారు. అర్హత ఉంటే చంద్రబాబుకు కూడా ఇస్తామని, ఆయన మనవడికి తెల్లకార్డు ఉంటే అమ్మఒడి పథకం కూడా అందచేస్తామన్నారు. గతంలో నంద్యాల ఎన్నికల సందర్భంగా "నేను వేసిన రోడ్ల మీద నడుస్తున్నారు. నాకు ఓటు వెయ్యకపోతే లైట్లు లేకుండా చేస్తా. డ్రైయినేజీ, వాటర్ కనెక్షన్స్ కట్ చేస్తా" అని బెదిరించిన దుర్మార్గుడు చంద్రబాబు అన్నారు. మా పార్టీకి ఓటు వేయని వారికి కూడా అర్హత ఉంటే సంక్షేమ పథకాలు అందజేయాలనే వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పారదర్శక పాలనకు ఇంతకంటే రుజువు ఏముందన్నారు.

## టీడీపీ కార్యాలయంలో రికార్డింగ్ డ్యాన్స్‌లు



టీడీపీ ఆఫీసులో డ్యాన్స్ చేస్తున్న యువతులు

**మదనపల్లె:** అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో రికార్డింగ్ డ్యాన్సులు, అమ్మాయిల నృత్యాలు హోరెత్తాయి. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మత్తెక్కించే, హుషారైన ఐటమ్ సాంగ్‌లతో రెచ్చిపోయారు. నిమ్మనపల్లె సర్కిల్, చిత్తూరు బస్టాండ్, బెంగళూరు బస్టాండ్, ఎన్‌టీఆర్ సర్కిల్‌లో జరిపిన వేడుకల్లో నడిరోడ్డుపైనే కార్యక్రమాలు ఏర్పాటుచేసి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించారు. శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే నాయకులు, అభిమానులు, కార్యకర్తల కోసం మాజీ ఎమ్మెల్యే రమేష్ ఏర్పాటు చేసిన రికార్డింగ్ డ్యాన్సులు పట్టణంలో చర్చనీయాంశమయ్యాయి.

## రాజన్నదొరకు త్రుటిలో తప్పిన ప్రమాదం

**సాలూరు:** డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరకు త్రుటిలో ప్రమాదం తప్పింది. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలోని గిరిశిఖరాన ఉన్న మూటకూడు సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించేందుకు శుక్రవారం ఆయన బయలు దేరారు. చిమిడివలస వెళ్తుండగా తాడివలస సమీపంలో ఘాట్‌రోడ్డు మలుపులో వాహనం టైరు పేలిపోయింది.

# చిన్నారులపై అకృత్యాలకు పాల్పడితే కఠిన శిక్షలు

**ఈ సంవత్సరం 22 కేసుల్లో నిందితులపై చర్యలు**

- పక్కా ఆధారాలు సేకరించి సాక్షులకు అండగా నిలిచిన పోలీసులు
- కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేసి సత్వర శిక్షలు వేసిన కోర్టులు



**సాక్షి ప్రతినిధి, విజయవాడ:** పిల్లల్ని పాఠశాలకు పంపించి.. పనికి వెళ్లిన దంపతులు ఇంటికి తిరిగొచ్చేసరికి ఏడేళ్ల బాలిక నీరసించి ఉంది. తల్లి ఆరా తీయడంతో టెంట్‌హౌస్‌లో పనిచేస్తున్న అనిల్ అనే వ్యక్తి నెమలి ఈకలు ఇస్తానని చెప్పి.. టెంట్ హౌస్‌లోకి తీసుకెళ్లి అత్యాచారం జరిపినట్టు తెలిపింది. ఈ ఏడాది ఫిబ్రవరి 24న జరిగిన ఈ అఘాయిత్యంపై బాధితురాలి తల్లి నున్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వారు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి త్వరితగతిన కోర్టులో చార్జిషీట్ వేశారు. ఈ నెల 10న పోక్సో కోర్టు నిందితునికి జీవితకాల (చనిపోయేంత వరకు) కఠిన కారాగార శిక్ష, రూ.3 వేల జరిమానా విధించింది. కాగా, మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతి నగర్‌లో ఓ మైనర్ బాలికకు ఇంటి పక్కనే ఉంటున్న పట్నాల మహేష్ (20) ప్రేమిస్తున్నానంటూ మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులకు అనుమానం వచ్చి ఆ బాలికకు వైద్య పరీక్షలు చేయించగా గర్భం దాల్చినట్లు వెల్లడైంది. దీంతో బాలిక తల్లిదండ్రులు మాచవరం పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది ఫిబ్రవరి 2న ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు పకడ్బందీగా చార్జిషీటు వేశారు. నిందితుడి నేరం రుజువు కావడంతో ఈ ఏడాది ఆగస్టు 30న నిందితునికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

**ఈ ఏడాది 22 కేసుల్లో కఠిన శిక్షలు**

ఈ ఏడాది ఎన్టీఆర్ జిల్లా పరిధిలో నమోదైన 22 కేసుల్లో పోక్సో కోర్టు కఠిన శిక్షలు విధించింది. వీటిలో రెండు కేసుల్లో జీవితాంతం (చనిపోయే వరకు) శిక్ష విధించింది. నాలుగు కేసుల్లో 20 ఏళ్లు, మూడు కేసుల్లో పదేళ్లు, రెండు కేసుల్లో ఏడేళ్లు, ఎనిమిది కేసుల్లో ఐదేళ్లు, మరో మూడు కేసుల్లో మూడేళ్ల చొప్పున శిక్షలు విధించింది. దీంతోపాటు బాధితులకు రూ.27 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.

**సత్వరమే శిక్ష**



చిన్న పిల్లలు, మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడిన కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా కోర్టులో పోలీసుల సాయంతో తగిన ఆధారాలు, సాక్ష్యాలు సమర్పించాం. ఈ తరహా నేరాలను సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి సత్వరమే కఠిన శిక్షలు విధించేలా చర్యలు తీసుకుంటున్నాం.
– నారాయణరెడ్డి, పీపీ, పోక్సో కోర్టు

**కఠిన శిక్షలు పడేలా చర్యలు**



చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడిన నిందితులు, మైనర్ బాలికలను మోసం చేసిన దుర్మార్గులకు పోక్సో కోర్టులో కఠిన శిక్షలు పడేలా చేస్తున్నాం. ఇలాంటి కేసులను తీవ్రంగా పరిగణించి వాటిపై త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసి పకడ్బందీగా చార్జిషీటు వేసేలా దర్యాప్తు బృందానికి దిశానిర్దేశం చేస్తున్నాం. సాక్షులకు ధైర్యం చెప్పి త్వరితగతిన కేసు ట్రయల్ నిర్వహించి నిందితులకు శిక్ష పడేలా చేస్తున్నాం.
– కేటీ రాణా, విజయవాడ నగర పోలీస్ కమిషనర్

## భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదేళ్ల జైలు

- విజయవాడ మహిళా సెషన్స్, ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి తీర్పు
- ముద్దాయికి రూ.2,500 జరిమానా విధింపు

**విజయవాడ స్పోర్ట్స్:** మద్యం తాగి భార్యను మానసికంగా, శారీరకంగా హింసించి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదేళ్ల కఠిన కారాగారశిక్ష విధిస్తూ విజయవాడ మహిళా సెషన్స్, ఐదో అదనపు జిల్లా న్యాయస్థానం జడ్జి ఐ.శైలజాదేవి శుక్రవారం తీర్పుచెప్పారు. విజయవాడ సితార సెంటర్‌కు చెందిన పెద్దింట్లమ్మకు గుడివాడకు చెందిన శివయ్యతో 2012లో వివాహం జరిగింది. ఆ తరువాత వీరు విజయవాడ సితార సెంటర్‌లో అద్దె ఇంట్లో కాపురం ఉంటూ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శివయ్య రోజూ మద్యం తాగి పెట్టే చిత్రహింసలు భరించలేక పెద్దింట్లమ్మ 2013 సెప్టెంబర్ 21వ తేదీన శరీరంపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కొద్దిరోజుల తరువాత మరణించింది. ఈ కేసులో బాధితుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిహెచ్.విష్ణువర్ధన్ కోర్టులో వాదనలు వినిపించారు. కోర్టు 17 మంది సాక్షులను విచారించింది. విచారణలో నేరం రుజువు కావడంతో శివయ్యకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

## రూ.30 కోట్లతో కాణిపాక ఆలయం అభివృద్ధి

- మంత్రి కొట్టు సత్యనారాయణ

**కాణిపాకం (యాదమరి):** కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయాన్ని రూ.30 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. స్వామివారి దర్శనార్థం ఆయన కుటుంబ సమేతంగా కాణిపాకం ఆలయానికి రాగా, వారికి ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆరణి శ్రీనివాసులు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో రాణాప్రతాప్ స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రి ఆలయ పరిసరాలు, విమాన గోపురాన్ని పరిశీలించారు. ఆలయాన్ని అత్యంత సుందరంగా నిర్మించారని..శిల్ప కళ ఉట్టిపడుతోందని కితాబిచ్చారు. ఆశీర్వాద మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. కోనేటిలో భక్తులు స్నానమాచరించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని, తిరుమల తరహాలో కోనేటిలో ఫిల్టర్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**అరటి ఆకులో భోజనాలు వడ్డించాలి..**

స్వామి వారి నిత్య అన్నదానంలో ప్లేట్లలో భక్తులకు భోజనాలు వడ్డిస్తున్నారని అలా కాకుండా అరటి ఆకులలో వడ్డించాలని, తక్షణం దీన్ని అమలు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కాణిపాక ఆలయ ప్రతిష్టను దెబ్బతీసేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆలయంలో అర్చకులు కొంతమంది స్వామివారి విరాళాలను తమ ఇళ్లకు తీసుకెళ్లినట్లు తన దృష్టికి వచ్చిందని దీనిపై కమిటీ ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, తిరుమల శ్రీవారిని మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు.



మంత్రి కొట్టు సత్యనారాయణకి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో రాణాప్రతాప్

# పెలోసీ భర్తపై దాడి



**వాషింగ్టన్:** అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ భర్త పాల్ పెలోసీ (82) ఓ ఆగంతకుని దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున శాన్‌ఫ్రాన్సిస్కోలోని వారి నివాసంలోకి ఓ వ్యక్తి చొరబడి సుత్తెతో పాల్‌పై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డట్టు పోలీసులు చెప్పారు. తలతో పాటు పలుచోట్ల తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన ఆయన ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. ప్రాణాపాయం లేదని డాక్టర్లు తెలిపారు. దాడి సమయంలో నాన్సీ వాషింగ్టన్‌లో ఉన్నారు. ఆగంతకున్ని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తదితర ప్రముఖులు దాడిని తీవ్రంగా ఖండించారు. పెలోసీ దంపతులకు సంఘీభావం ప్రకటించారు. పాల్ వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## క్లుప్తంగా...

### ఉత్తరకొరియా క్షిపణి ప్రయోగం

**సియోల్:** అమెరికా హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఉత్తరకొరియా మరోసారి క్షిపణి ప్రయోగాలకు దిగింది. శుక్రవారం రెండు తక్కువ శ్రేణి బాలిస్టిక్ మిస్సైళ్లను ప్రయోగించింది. ఇవి రెచ్చగొట్టే చర్యలేనంటూ దక్షిణ కొరియా దుయ్యబట్టింది. ఉత్తరకొరియా అణుదాడులకు దిగితే కిమ్ పాలన అంతం ఖాయమని అమెరికా హెచ్చరించింది.

### జీఎం ఆవాలు ప్రమాదకరం..

**కేంద్రానికి స్వదేశీ జాగరణ్ మంచ్ లేఖ**

**న్యూఢిల్లీ:** జన్యుమార్పిడి ఆవాలు అత్యంత ప్రమాదకరమని ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ స్వదేశీ జాగరణ్ మంచ్ ఆందోళన వెలిబుచ్చింది. దేశంలో వాటి సాగుకు అనుమతులివ్వొద్దంటూ కేంద్రానికి లేఖ రాసింది. వాటి సాగు సిఫార్సులకు ముందు జీఈఏసీ ఎలాంటి సమీక్షా చేయలేదని తప్పుబట్టింది. విత్తన కంపెనీలతో నియంత్రణ సంస్థలు కుమ్మక్కయ్యాయని ఆరోపించింది.

### ఆన్‌లైన్ పీహెచ్‌డీలకు గుర్తింపు లేదు: యూజీసీ

**న్యూఢిల్లీ:** విదేశీ విద్యాసంస్థల సహకారంతో దేశంలోని ఎడ్యుటెక్ కంపెనీలు అందించే ఆన్‌లైన్ పీహెచ్‌డీ ప్రోగ్రాంలకు గుర్తింపు లేదని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) శుక్రవారం ప్రకటించాయి. ఎడ్యు-టెక్ కంపెనీలు విదేశీ విద్యాసంస్థలతో చేసుకునే ఫ్రాంచైజీ ఒప్పందాలు నిబంధనలకు వ్యతిరేకమని స్పష్టతనిచ్చాయి. ఆన్‌లైన్ పీహెచ్‌డీ కోర్సులకు సంబంధించిన ప్రకటనలను చూసి మోసపోవద్దని విద్యార్థులను కోరాయి. రెండేళ్లుగా కరోనా కాలంలో ఆన్‌లైన్ విధానంలో విద్యనందించే ఎడ్యుటెక్ రంగానికి ప్రాధాన్యం పెరిగింది.

### ఫిలిప్పీన్స్‌లో వరదలు.. 42 మంది మృతి

**మనీలా:** ఫిలిప్పీన్స్ దక్షిణ ప్రాంత మగియుండనావో ప్రావిన్స్‌ను భీకర వరదలు ముంచెత్తాయి. కనీసం 42 మందిని బలి తీసుకున్నాయి. పర్వత ప్రాంతాల్లో గురువారం రాత్రి కుంభవృష్టితో ఆకస్మిక వరదలొచ్చి నదులు పొంగాయని, కొండ చరియలు విరిగి పడ్డాయని అధికారులు చెప్పారు.

### 10 బిలియన్ డాలర్లతో కరాచీ-పెషావర్ రైలు మార్గం

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్‌లోని కరాచీ, పెషావర్ నగరాలను కలుపుతూ ఏకంగా 10 బిలియన్ డాలర్లతో చైనా రైలు మార్గం నిర్మించనుంది! ఇరు దేశాల మధ్య ఈ మేరకు ఒప్పందం కుదిరింది. చైనా పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్)లో ఈ రైలు మార్గం అత్యంత కీలకమైంది. జిన్‌పింగ్ ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో సీపెక్ ఒక భాగం.

### పెట్రోల్, డీజిల్ కార్ల తయారీపై... 2035 నుంచి ఈయూ నిషేధం

**బ్రస్సెల్స్:** 2035 నుంచి పెట్రోల్, డీజిల్ కార్లు, వ్యాన్ల తయారీపై యూరోపియన్ యూనియన్ దేశాలు నిషేధం విధించనున్నాయి. ఇందుకు సంబంధించిన మొట్టమొదటి 'ఫిట్ ఫర్ 55'ప్యాకేజీపై ఈయూ ప్రతినిధులు గురువారం అంగీకారానికి వచ్చారు. ఈ దశాబ్దం చివరికల్లా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను 55% మేర తగ్గించడమే ఈ ప్యాకేజీ ఉద్దేశం. దీని ప్రకారం.. కార్లు, వ్యాన్ల నుంచి వెలువడే ఉద్గారాలను 2030 నాటికి 55 శాతానికి తగ్గించి, 2035 కల్లా వందశాతం లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉంది. ఒప్పందం అమల్లోకి రావాలంటే ముందుగా ఈయూ పార్లమెంట్, సభ్యదేశాలు ఆమోదం తెలిపాల్సి ఉంటుంది. 2050 నాటికి వాయు ఉద్గారాలను పూర్తిగా తగ్గించి, ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహమివ్వాలని ఈయూ యోచిస్తోంది.

### ఆజంఖాన్ శాసనసభ్యత్వం రద్దు

**లక్నో:** సమాజ్‌వాదీ పార్టీ నేత, రాంపూర్ సదర్ ఎమ్మెల్యే ఆజంఖాన్ శాసనసభ్యత్వం రద్దయింది. యూపీ అసెంబ్లీ సెక్రటేరియట్ శుక్రవారం ఈ మేరకు ప్రకటించింది. విద్వేష ప్రసంగం కేసులో ఆజంఖాన్‌కు కోర్టు గురువారం మూడేళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే. దాంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఫలితంగా రాంపూర్ సదర్ స్థానం ఖాళీ అయినట్లు ప్రకటించింది. రెండేళ్లు, అంతకంటే ఎక్కువ జైలు శిక్ష పడిన ఎమ్మెల్యే శాసనసభ్యత్వం రద్దవుతుంది. శిక్ష పూర్తయిన తర్వాత ఆరేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులవుతారు.



# లద్ధాఖ్ పోదాం... పాలపుంతను చూద్దాం!

**లద్దాఖ్:** ఇదేమిటో తెలుసా? మన పాలపుంత. చాలా బాగుంది కదా! ఈ సుందర దృశ్యాలను చూసేందుకు సుదూరంలోని ధ్రువాల దాకానో వెళ్లాల్సిన అవసరం లేదు. జస్ట్ మన దేశ ఉత్తరాగ్రాన జమ్మూ కశ్మీర్‌లోని లద్దాఖ్ దాకా వెళ్తే చాలు. అక్కడికి 300 కిలోమీటర్ల దూరంలో చాంగ్‌తాంగ్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం పరిధిలో ఐదు గ్రామాల సమాహారమైన హాన్లేలో ఉన్న ఇండియన్ ఆస్ట్రనామికల్ అబ్జర్వేటరీ (ఐఏఓ) బేస్ క్యాంప్ నుంచి కనిపించే అద్భుతమిది. దీన్ని చూసేందుకు ఇక్కడికి కొన్నాళ్లుగా పర్యాటకుల రాక బాగా పెరుగుతోంది. దీన్ని మరింత వ్యవస్థీకృతం చేసి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం ద్వారా అంతరిక్ష టూరిజాన్ని ప్రోత్సహించేందుకు బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ ముందుకొచ్చింది. లద్దాఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎల్‌ఏహెచ్‌డీసీ), కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో దీన్ని దేశంలోనే తొలి డార్క్ స్కై రిజర్వ్‌గా తీర్చిదిద్దింది. ఇందులో భాగంగా పరిసర గ్రామాలకు చెందిన 24 మందిని అంతరిక్ష రాయబారులుగా ఎంపిక చేసి వారికి 8 అంగుళాల డోబ్సోనియన్ టెలిస్కోపులు అందజేశారు. ఔత్సాహిక పర్యాటకులు వాటిద్వారా అంతరిక్షంలోకి తొంగిచూడవచ్చు. పాలపుంత తాలూకు వింతలను కళ్లారా చూసి ఆనందించొచ్చు. మేఘరహిత వాతావరణం, స్వచ్ఛమైన వాతావరణం కారణంగా ఇక్కణ్నుంచి అంతరిక్షం అద్భుతంగా కనిపిస్తుందట. దీనివల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలూ పెరుగుతాయని చెబుతున్నారు. ఈ డార్క్ స్కై రిజర్వ్‌ను లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ రాధాకృష్ణ మాథుర్ అక్టోబర్ 31న వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు.

# పోలీసులకు ఒకే యూనిఫాం

## బలగాలకు ఉమ్మడి గుర్తింపు

- రాష్ట్రాలకు మోదీ ప్రతిపాదన
- నక్సలిజాన్ని రూపుమాపాలి: ప్రధాని



చింతన్ శిబిర్‌లో హోం మంత్రులతో ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్

**సూరజ్‌కుండ్ (హరియాణా):** పోలీసులకు దేశవ్యాప్తంగా ఒకే యూనిఫాం ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదించారు. 'ఒక దేశం, ఒకే యూనిఫాం' భావనపై ఆలోచించాలని రాష్ట్రాలకు సూచించారు. అయితే వాటిపై దీన్ని రుద్దబోవడం లేదని స్పష్టం చేశారు. ''ఇది కేవలం ప్రతిపాదన మాత్రమే. పోలీసు బలగాలకు ఇది ఉమ్మడి గుర్తింపునిస్తుందన్నదే నా ఉద్దేశం. కావాలంటే యూనిఫాంపై రాష్ట్రాలవారీగా ప్రత్యేక గుర్తింపు చిహ్నాలు ఉండవచ్చు. ఇది వీలైతే ఇప్పుడు, లేదంటే ఐదేళ్లు, పదేళ్లు, వందేళ్లకు ఎప్పటికైనా సాధ్యపడొచ్చు'' అని సూచించారు. హరియాణాలోని సూరజ్‌కుండ్‌లో జరుగుతున్న రాష్ట్ర హోం మంత్రుల చింతన్ శిబిర్‌ను ఉద్దేశించి మోదీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ''గన్నులు, పెన్నులు... ఇలా నక్సలిజం ఏ రూపంలో ఉన్నా కూకటి వేళ్లతో సహా పెకిలించి వేయాల్సిందే. యువత మనసులను విషపూరితం చేసి వారిని తీవ్రవాదంవైపు మళ్లించకుండా నిరోధించాల్సిందే. అందుకోసం ఈ తీవ్రవాద శక్తుల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలి'' అంటూ పిలుపునిచ్చారు. దేశ క్షేమం దృష్ట్యా ఈ శక్తులు విజృంభించకుండా చూడాల్సిన అవసరముందన్నారు. ''పాత చట్టాలను సమీక్షించుకోండి. కాలం చెల్లిన వాటిని వదిలించుకోండి. మిగతా వాటిని ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టు మెరుగు పరుచుకోండి'' అని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. ''శాంతిభద్రతలు రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అంశమే అయినా సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు సమన్వయంతో కూడిన ఉమ్మడి కార్యాచరణను ఏర్పాటు చేసుకోవాలి. పౌరుల పరిరక్షణే అంతిమ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర బలగాలు అన్ని అంశాల్లోనూ పరస్పరం సహకరించుకోవాలి'' అని సూచించారు. నేరాల స్వభావం అంతర్రాష్ట్రీయ, అంతర్జాతీయ తరహాను సంతరించుకుంటున్నందున ఇది తప్పనిసరన్నారు. సైబర్ క్రైం, ఆయుధాలు, డ్రగ్స్ సరఫరాల్లో నేరగాళ్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నందున ఈ ముప్పును దీటుగా ఎదుర్కొనేందుకు సాంకేతికంగా వారికంటే ముందే ఉండాలన్నారు.

**ఫేక్ న్యూస్‌కు తెర పడాలి**

కొంతకాలంగా ఫేక్ న్యూస్ పెద్ద బెడదగా మారిందని మోదీ అభిప్రాయపడ్డారు. ఇలాంటి తప్పుడు సమాచార వ్యాప్తిని తక్షణం అడ్డుకోవాల్సిన అవసరముందన్నారు. ఇది దేశానికే ముప్పుగా పరిణమించగలదన్నారు. ''ఏ సమాచారాన్నయినా ఫార్వర్డ్ చేసే ముందు ప్రజలు ఒకటికి పదిసార్లు ఆలోచించాలి. అందులోని నిజానిజాలను నిర్ధారించుకోవాలి. అందుకు వీలు కల్పించే వ్యవస్థలను వారికి చేరువ చేయడంలో టెక్నాలజీది కీలక పాత్ర'' అని చెప్పారు. టెక్నాలజీపై వెచ్చించే మొత్తాన్ని మెరుగైన భవిష్యత్తు కోసం పెట్టే పెట్టుబడిగా చూడాలని అన్నారు. పర్యాటకం ప్రధాన ఆదాయ వనరుగా మారుతున్న నేపథ్యంలో పర్యాటక పోలిసింగ్‌పైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రాష్ట్రాలను కోరారు.

### అవినీతిపరులను వదిలేది లేదు

**న్యూఢిల్లీ:** అవినీతికి పాల్పడితే వ్యక్తులనైనా, సంస్థలనైనా వదిలే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ హెచ్చరించారు. అక్టోబర్ 31న మొదలవుతున్న విజిలెన్స్ వారోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన జాతికి సందేశమిచ్చారు. అవినీతి సామాన్యుల హక్కులను హరించడమే గాక దేశ ప్రగతిని కూడా కుంటుబరుస్తుందన్నారు. అవినీతిపై ఉమ్మడిగా పోరాడాలంటూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ కూడా పిలుపునిచ్చారు.

### మన ఉక్కు పరిశ్రమ శక్తికి ఐఎన్‌ఎస్ విక్రాంతే తార్కాణం

**సూరత్:** భారత ఉక్కు పరిశ్రమ శక్తిసామర్థ్యాలకు, పనితనానికి తొలి దేశీయ విమాన వాహక నౌక ఐఎన్‌ఎస్ విక్రాంత్ చక్కని ఉదాహరణ అని ప్రధాని మోదీ అన్నారు. ఎనిమిదేళ్ల సమష్టి కృషి ఫలితంగా భారత ఉక్కు పరిశ్రమ ప్రపంచంలో రెండో స్థానానికి ఎగబాకిందన్నారు. గుజరాత్‌లోని సూరత్ జిల్లా హజీరాలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా విస్తరణ ప్లాంటు భూమి పూజలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు.

# ఆ హీరోయిన్లు 'ఐటమ్స్'

- డీఎంకే నేత సాదిక్ వ్యాఖ్యలపై రగడ
- ట్విట్టర్‌లో ఖుష్బూ సుందర్ ఆగ్రహం
- డీఎంకే ఎంపీ కనిమొళి క్షమాపణలు



**చెన్నై:** సినీ హీరోయిన్లు, తమిళనాడు బీజేపీ నేతలు ఖుష్బూ సుందర్, నమిత, గాయత్రి రఘురామ్, గౌతమిపై అధికార డీఎంకే నేత సైదై సాదిక్ చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర దుమారం సృష్టించాయి. వారంతా 'ఐటమ్స్' అంటూ డీఎంకే సభలో ఆయన ప్రసంగం వీడియో గురువారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తమిళనాడులో అడుగు పెట్టడానికి బీజేపీ పెద్దలు సినిమా హీరోయిన్లపై ఆధారపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. సాదిక్ వ్యాఖ్యలపై ఖుష్బూ సుందర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ''పురుషులు మహిళలను దూషించినప్పుడు.. ఆ పురుషులు ఎలా పెరిగారో, ఎలాంటి వాతావరణం నుంచి వచ్చారో అర్థమవుతుంది. ఇలాంటివాళ్లు మహిళ గర్భాన్ని కూడా అవమానిస్తారు. పైగా వారు డీఎంకే దివంగత నేత కలైంజర్ కరుణానిధి అనుచరులమని చెప్పుకుంటున్నారు. స్టాలిన్ పరిపాలనలో అమలవుతున్న ద్రావిడియన్ కొత్త మోడల్ ఇదేనా?'' అంటూ గురువారం ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌ను కరుణానిధి కుమార్తె, డీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి, తూత్తుకుడి ఎంపీ కనిమొళికి ట్యాగ్ చేశారు. కనిమొళి శుక్రవారం ట్విట్టర్‌లో ప్రతిస్పందించారు. తమ పార్టీ నాయకుడు చేసిన వ్యాఖ్యల పట్ల ఒక మహిళగా, ఒక మనిషిగా తాను బహిరంగంగా క్షమాపణ కోరుతున్నానని చెప్పారు. మహిళల పట్ల ఎవరు అసభ్యంగా మాట్లాడినా సహించవద్దని పేర్కొన్నారు. తప్పుడు వైఖరిని తమ నాయకుడు స్టాలిన్ గానీ, తమ పార్టీ డీఎంకే గానీ ఎట్టిపరిస్థితుల్లోనూ సమర్థించబోరని స్పష్టం చేశారు. తన ఆవేదన పట్ల స్పందించిన కనిమొళికి ఖుష్బూ సుందర్ కృతజ్ఞతలు తెలియజేశారు.



బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ శుక్రవారం లండన్‌లోని క్రోయ్‌డాన్ యూనివర్సిటీ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీజా గోపాలన్‌తో సెల్ఫీ దిగారు.



## అంతరిక్షంలో అసురహస్తం!

చూడటానికి అచ్చం రాకాసి హస్తంలా ఉంది కదూ! నిజానికిది ఈ విశ్వావిర్భావానికి కారణభూతంగా అంతరిక్ష శాస్త్రవేత్తలు భావించే ధూళి మేఘం. జేమ్స్ వెబ్ టెలిస్కోప్ ఎప్పట్లాగే కాలంలో వెనక్కు వెళ్లి భూమికి 7,000 కాంతి సంవత్సరాల దూరంలోని పిల్లర్స్ ఆఫ్ క్రియేషన్‌ను ఇలా క్లిక్‌మనిపించింది. దీన్ని ఇంత స్పష్టంగా మనం చూడగలగడం ఇదే తొలిసారి.

# '26/11' కుట్రదారులు ఇంకా బయటే...

- విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్
- ముంబై ఉగ్రదాడి మృతులకు నివాళులు

**ముంబై:** ముంబైలో 2008 నవంబర్ 26న జరిగిన ఉగ్రవాద దాడుల కుట్రధారులు, పాత్రధారులు ఇప్పటికీ రక్షణ పొందుతూనే ఉన్నారు. నిక్షేపంగా తిరుగుతున్నారు. వారికి ఏ శిక్షలూ పడడం లేదు'' అని విదేశాంగ మంత్రి జైశంకర్ ఆక్షేపించారు. ఉగ్రవాదం ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలకు విస్తరించిందని, దానితో నష్టాల గురించి ఇతరుల కంటే భారత్‌కే ఎక్కువగా తెలుసని అన్నారు. 'ఉగ్రవాద కార్యకలాపాలకు నూతన సాంకేతికను వాడుకోకుండా నిరోధించడం' అనే అంశంపై 26/11 దాడులకు సాక్షిగా నిలిచిన ముంబైలోని తాజ్ హోటల్‌లో జరిగిన ప్రత్యేక సదస్సులో ఆయన మాట్లాడారు. దాడుల మృతులకు గబాన్ దేశ విదేశాంగ మంత్రి, యూఎన్‌ఎస్సీ అధ్యక్షుడు మైఖేల్ మౌసా-ఆడామో తదితరులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మరో దేశం నుంచి వచ్చిన ముష్కరులు మారణహోమం సృష్టించారని పాకిస్తాన్‌పై ధ్వజమెత్తారు. కరడుగట్టిన ఉగ్రవాదుల విషయంలో రాజకీయ కారణాల వల్ల ఐరాస భద్రతా మండలి చర్యలు తీసుకోలేకపోతోందన్నారు. పాక్ ఉగ్రవాదులపై ఆంక్షలు విధించకుండా చైనా అడ్డుకుంటోందని విమర్శించారు. ఉగ్రవాదాన్ని అణచివేయాలంటే ఆ సంస్థలకు నిధులందకుండా చేయాలని సూచించారు. అలా చేస్తే వారి వెన్ను విరిచినట్లేనని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదంపై అంతర్జాతీయ సమాజం ఉమ్మడిగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు.

# మౌలిక సదుపాయాల లేమివల్లే కశ్మీర్‌లో ఉగ్రభూతం: రాజ్‌నాథ్

**న్యూఢిల్లీ:** స్వాతంత్ర్యానంతరం జమ్మూకశ్మీర్‌లో దశాబ్దాలుగా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందలేదని, అందుకే ఉగ్రవాదం విస్తరించిందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సరిహద్దులోని ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో రూ.2,180 కోట్లతో నిర్మించిన వంతెనలు, రహదారులు, హెలిప్యాడ్‌లు తదితర 75 నూతన ప్రాజెక్టులను ఆయన శుక్రవారం తూర్పు లద్దాఖ్‌లోని దార్బుక్-ష్యోక్-దౌలత్ బేగ్ ఓల్డీలో వర్చువల్‌గా ప్రారంభించారు. రాజ్‌నాథ్ ప్రారంభించిన వంతెనల్లో.. సముద్ర మట్టానికి 14,000 అడుగుల ఎత్తున డీఎస్-డీబీఓ రోడ్డుపై నిర్మించిన 120 మీటర్ల పొడవైన 'క్లాస్-70 ష్యోక్ సేతు' ఉంది. వీటిని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్మించారు. వీటిలో 45 వంతెనలు, 27 రోడ్లు, రెండు హెలిప్యాడ్‌లు, ఒక 'కార్బన్ న్యూట్రల్ హాబిటాట్' ఉన్నాయి. కశ్మీర్‌లో 20 ప్రాజెక్టులు, లద్దాఖ్‌లో 18, అరుణాచల్ ప్రదేశ్‌లో 18, ఉత్తరాఖండ్‌లో 5, సిక్కిం, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, రాజస్తాన్‌లో 14 ప్రాజెక్టులు నిర్మించారు. 'కార్బన్ న్యూట్రల్ హాబిటాట్'లో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ 57 మంది తల దాచుకోవచ్చు.

# భారత్‌తో మాకు ప్రత్యేక సంబంధాలు

## మోదీపై పుతిన్ ప్రశంసల జల్లు

**మాస్కో:** భారత్‌తో తమ దేశానికి ప్రత్యేక సంబంధాలు ఉన్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. ఇరుదేశాలు ఎల్లప్పుడూ పరస్పరం సహకరించుకుంటున్నాయని చెప్పారు. పరస్పరం మద్దతుగా నిలుస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే పరంపర చక్కగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. భారతదేశ ప్రయోజనాల కోసం 'స్వతంత్ర విదేశాంగ విధానాన్ని' అనుసరిస్తున్నందుకుగాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై పుతిన్ ప్రశంసల వర్షం కురిపించారు. గురువారం రష్యా రాజధాని మాస్కోలో 'వాల్డాయ్ ఇంటర్నేషనల్ డిస్కషన్ క్లబ్' సదస్సులో పుతిన్ మాట్లాడారు. సైనిక, సాంకేతిక అంశాల్లో భారత్, రష్యా ఇప్పటిలాగే సహకరించుకుంటాయన్నారు. దశాబ్దాలుగా రెండు దేశాల మధ్య సంబంధ బాంధవ్యాలు కొనసాగుతున్నాయని గుర్తుచేశారు. ''ప్రపంచంలో స్వతంత్ర విదేశాంగ విధానమున్న కొద్దిమంది నేతల్లో మోదీ ఒకరు. సొంత దేశ, సొంత ప్రజల ప్రయోజనాల కోసం మోదీ పాటుపడుతున్నారని చెప్పారు. బ్రిటిష్ వలస దేశంగా ఉన్న ఇండియా ఇప్పుడు ఆధునిక దేశంగా అభివృద్ధి పథంలో వేగంగా పరుగులు తీస్తోంది. భారత్ ప్రపంచంలో అందరి గౌరవాన్ని పొందుతోంది. మోదీ నాయకత్వంలో ఎంతో ప్రగతి సాధించింది. ఆయన నిజమైన దేశ భక్తుడు అని కొనియాడారు. 'మేక్ ఇన్ ఇండియా' గొప్ప ప్రయత్నం. భారత్‌కు అద్భుతమైన భవిష్యత్తుంది. ఇరు దేశాల మధ్య ఆర్థిక సహకారం నానాటికీ పెరుగుతోంది'' అన్నారు.

# బిలియన్త్ బేబీ ఏం చేస్తోంది!?

## చదువుకోవడానికి డబ్బులేక కలలు కల్లలు

- అన్నీ ఉచితమేనంటూ హామీలిచ్చి ముఖం చాటేసిన ప్రభుత్వం
- డాక్టర్ కాలేక నర్సయిన వైనం



ఆస్తా అరోరా ఎవరో మీకు గుర్తుందా ? పేరు చెబితే గుర్తు పట్టకపోవచ్చు కానీ భారత్ బిలియంత్ బేబీ అంటే టక్కున గుర్తొస్తుంది. ఆమె పుట్టినప్పుడు ప్రభుత్వ పెద్దలు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. 2000 సంవత్సరం మే 11న ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఉదయం 5 గంటల 5 నిమిషాలకు భూమ్మీదకు వచ్చిన పసికందును చూడడానికి ఆ నాటి ఎన్డీయే ప్రభుత్వంలోని మంత్రులు, అధికారులు తరలివచ్చారు. గులాబీ రంగు దుప్పట్లో ఆ పసికందుని చుట్టి ఫొటోలకు పోజులిచ్చారు. ఆ బిడ్డ పుట్టుక ప్రపంచ దేశాల పత్రికల్లో పతాక శీర్షికగా మారింది. ఆ పాప రాకతో మన దేశ జనాభా 100 కోట్లకు చేరుకుంది. భారత్ జనాభా నియంత్రణపై మరింతగా దృష్టి పెట్టాలని ఐరాస గట్టిగా హెచ్చరించింది కూడా. చైనా తర్వాత 100 కోట్ల జనాభా క్లబ్‌లో నిలిచిన రెండో దేశంగా రికార్డులకెక్కింది. నాటి కేంద్ర మహిళా శిశు మంత్రి సుమిత్రా మహాజన్ ఉచిత విద్య, వైద్యం, రైళ్లలో ఉచిత ప్రయాణం వంటివి కల్పిస్తామని ఆ కుటుంబంలో ఆశలు పెంచారు. అమ్మాయి తండ్రికి మంచి ఉద్యోగం ఇస్తామని, ఆమె పెంపకం బాధ్యత తమదేనని హామీలు గుప్పించారు. రెండు దశాబ్దాలకు పైగా గడిచిపోయాయి. ఇప్పుడు ఆస్తా ఎక్కడ ఉందో, ఏం చేస్తోందో తెలిస్తే నిర్ఘాంతపోతాం. తండ్రి ఒక షాపులో సేల్స్‌మన్‌గా ఉద్యోగం చేసేవారు. నెలకి రూ.4,000 జీతంతో ఇద్దరు పిల్లల్ని పోషించాల్సి వచ్చింది. స్కూలు ఫీజులు కట్టడానికి కూడా వారి దగ్గర డబ్బుల్లేవు. ఆస్తా స్వశక్తితో ఎదిగి 22 ఏళ్ల వయసులో నర్సు ఉద్యోగాన్ని సంపాదించుకుంది. డాక్టర్ కావాలన్న ఆమె కలలు కల్లలయ్యాయి. ''డాక్టర్ కావాలని చాలా ఉండేది. కానీ మా తల్లిదండ్రులకు శక్తి లేకపోవడంతో ప్రైవేటు స్కూలుకు పంపలేకపోయారు. దాంతో నేను రాజీపడి నర్సుగా శిక్షణ తీసుకున్నాను'' అని వివరించింది.

**యూఎన్ ఆర్థిక సాయంతో నర్సు కోర్సు**

యూఎన్ నుంచి రూ.2 లక్షల ఆర్థిక సాయం మాత్రమే ఆ కుటుంబానికి దక్కింది. దానిని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే ఆస్తాకు 18 ఏళ్లు వచ్చిననాటికి రూ.7 లక్షలొచ్చాయి. ఆ డబ్బులతోనే కాలేజీ, నర్సు కోర్సు చేసింది. ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా చేరింది. ఆస్పత్రిలో బిడ్డను కన్నప్పుడు రాజకీయ నాయకులు చెప్పిన మాటలు విని తన కూతురుకి బంగారు భవిష్యత్ ఉందని తల్లి అంజన మురిసిపోయింది. కానీ ఎంత మంది చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో ఏం చేయలేని నిస్సహాయ స్థితిలోకి వెళ్లిపోయింది. నర్సుగా తన బాధ్యతలు నిర్వహిస్తూనే అధిక జనాభా దేశానికి భారం అని ప్రజల్లో అవగాహన పెంచే బాధ్యతను కూడా ఈ బిలియన్త్ బేబి తీసుకుంది. వివిధ సంస్థలు ఏర్పాటు చేసే చర్చల్లో పాల్గొంటూ జనాభా నియంత్రణపై ప్రసంగాలిస్తోంది. త్వరలో భారత జనాభా 140 కోట్లకు చేరుకోనుంది. నిరుపేదల బతుకుల్లో మాత్రం ఇప్పటికీ మార్పు రాకపోవడం విషాదమని ఆస్తా నిట్టూరుస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

### స్కూల్లో సెలబ్రిటీయే

ఆస్తా చిన్నతనంలో సెలబ్రిటీ హోదాయే అనుభవించింది. బిలియన్త్ బేబీ ఏం చేస్తోందంటూ మీడియా ఎన్నో కథనాలు చేసింది. ఏడాది వయసులో ఐరాస పాపులేషన్ ఫండ్ (యూఎన్‌ఎఫ్‌పీఏ), కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్ ప్రారంభోత్సవానికి బుల్లి అతిథిగా హాజరైంది. చిన్నారి ఆస్తా తన అన్నయ్య పాఠ్య పుస్తకాలను చించేసి ఆడుకోవడమూ పేపర్లవారికి వార్తే అయింది. అప్పట్లో పేపర్లో వచ్చిన వార్తలన్నీ చూసుకొని మురిసిపోవడమే తప్ప ఆమె ఒరిగిందేమీ లేదు. తన పుట్టుక ప్రపంచానికే ప్రత్యేకమైనదని ఆస్తాకు స్కూలుకెళ్లే సమయంలోనే అర్థమైంది ''నాకు నాలుగైదేళ్లు ఉంటాయి. మా స్కూలుకు మీడియా కెమెరాలతో రావడంతో ఆశ్చర్యపోయా. టీవీల్లో కనిపించడం, అందరూ నా గురించి మాట్లాడుకోవడం చాలా గొప్పగా ఫీలయ్యా' అంటూ ఆ సంగతుల్ని నెమరేసుకుంది. ఆస్తా చదువులో చురుగ్గా ఉండేది. చర్చల్లో పాల్గొనేది. స్కూల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుండేది. కానీ ఇంటర్‌కు వచ్చాక ఆమె తన ఆశల్ని చంపేసుకోవాల్సి వచ్చింది. మంత్రుల చుట్టూ తిరిగినా ముఖం చాటేయడంతో ప్రభుత్వ కాలేజీలో చేరాల్సి వచ్చింది.




బ్రిటన్ రాజు చార్లెస్-3 ముఖచిత్రంతో ముద్రించిన తొలి నాణేలివి. ఇవి డిసెంబర్ 28 నుంచి చెలామణిలోకి రానున్నాయి

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం । 29 । అక్టోబర్ । 2022



## స్కిల్ హబ్‌తో ఉద్యోగాలు

అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ సెంటర్‌ని ఎమ్మెల్యే సింహాద్రి శుక్రవారం ప్రారంభించారు. -8లో▸



## నిందితులు అరెస్టు

విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో ఈ నెల 23న జరిగిన బాణసంచా పేలుడు ఘటనకు కారకులైన నలుగురిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ కె.శ్రీనివాసరావు తెలిపారు. -8లో▸

## నేడు నాగుల చవితి

మోపిదేవి: నాగుల చవితి పర్వదినానికి జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలోని నాగ పుట్టలో పాలుపోసేందుకు తరలివచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



## న్యూస్‌రీల్

### 31 వరకూ ఈ-క్రాప్ జాబితా ప్రదర్శన


గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పంటలకు ఈ-క్రాప్ నమోదు చేసుకుని బయోమెట్రిక్ ధ్రువీకరణ పూర్తి అయిన ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం అన్ని రైతు భరోసా కేంద్రాలలో ఈనెల 31 వరకు ప్రదర్శిస్తామని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి ఎం. విజయభారతి ఓ ప్రకటనలో తెలిపారు. పంట నమోదులో ఏమైనా తప్పులు ఉంటే రైతులు గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకుల దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ జాబితాలను సరిచూసుకోవాలని సూచించారు. ఈ-పంట నమోదు చేసుకొని, బయోమెట్రిక్ ధ్రువీకరణ చేసిన రైతులు మాత్రమే ప్రకృతి వైపరీత్యాలు లేదా ఇతర కారణాల వల్ల గాని పంట నష్ట పోతే ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు.

### ముస్లిం మైనార్టీలకు పెద్ద పీట



విజయవాడ రూరల్: రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని డెప్యూటీ సీఎం, మైనార్టీశాఖ మంత్రి ఎస్బీ అంజాద్‌బాషా అన్నారు. శుక్రవారం అంబాపురం గ్రామంలో ఇనామ్‌నగర్ మదర్సాకు వచ్చిన డెప్యూటీ సీఎంను ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా, కమిటీ ప్రతినిధులు కలిసి పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. వైఎస్సార్ షాదీ తోఫా పథకంలో విద్యార్హత నిబంధన సడలించాలని, విజయవాడలో హజ్‌హౌస్, ఇస్లామిక్ బ్యాంకులు ఏర్పాటు చేయాలని, పేద ముస్లింలకు వడ్డీలేని రుణా లు అందించాలని విన్నవించారు. వీటిని సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తానని మంత్రి వారికి హామీనిచ్చారు.

### ఆది దంపతులకు సహస్ర దీపాలంకరణ



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో శుక్రవారం సహస్ర దీపాలంకరణ సేవ జరిగింది. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించగా పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం పల్లకీ సేవ జరగగా, అమ్మవారితో పాటు భక్తులు, ఆలయ అధికారులు, సిబ్బంది ప్రధాన ఆలయం చుట్టూ మూడు పర్యాయాలు ప్రదక్షిణలు చేశారు. పల్లకీ సేవ అనంతరం ఆది దంపతులకు దర్బారు సేవ నిర్వహించారు. గత శనివారం నుంచి శుక్రవారం వరకు దేవస్థానానికి వివిధ సేవల ద్వారా వచ్చిన ఆదాయం, వ్యయాలతో పాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన విరాళాల వివరాలను ఆలయ అర్చకులు చదివి వినిపించారు.

### పుణ్యస్నానాలకు ఘాట్లను సిద్ధం చేయండి

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని భక్తులు కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా ఘాట్లను సిద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో పశ్చిమ శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు, మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, కనకదుర్గ దేవస్థానం, పోలీస్, తదితర శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.

- కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రెండు రోజులలో పనులు పూర్తి చేసి, కార్తికమాసం మొదటి సోమవారం నాటికి సిద్ధం చేయాలన్నారు.
- దుర్గా ఘాట్ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. నదిలో వరద నీటిని దృష్టిలో పెట్టుకుని ఏ మేరకు లోపలకు భక్తులను అనుమతించాలనే నిర్ణయం తీసుకుని ఆ ప్రాంతం వరకు ఇనుప మెష్ ఏర్పాటు చేయాలని దేవాలయ అధికారులను ఆదేశించారు.
- అదేవిధంగా భవానీ, పున్నమీ ఘాట్లలో ఏర్పాట్లను మున్సిపల్ అధికారులు చేపట్టాలన్నారు. ఘాట్ల వద్ద భక్తులు దుస్తులను మార్చుకునేందుకు వీలుగా తాత్కాలిక గదులను ఏర్పాటు చేయాలన్నారు. మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలన్నారు.

సమావేశంలో జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు.

# ఆయుధం.. అదరహో



భలే గన్..
ప్రదర్శనలోని తుపాకీలతో విద్యార్థిని, విద్యార్థులు



పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విజయవాడలోని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ గ్రౌండ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్(ఆయుధాల ప్రదర్శన) కార్యక్రమం ఆకట్టుకుంది. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేర నియంత్రణకు పోలీసులు చేసే సాధనాలు, ఉపయోగించే ఆయుధాలపై విద్యార్థులు, యువతకు అవగాహన కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న పలు కళాశాలల, పాఠశాల విద్యార్థులకు బాంబ్ నిర్వీర్యం, డాగ్ స్క్వాడ్, డ్రోన్లు, బాడీ వాన్ కెమెరాలు, ఎన్‌డీఆర్ఎఫ్, ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్, సిటీ సెక్యూరిటీ వింగ్, కమ్యూనికేషన్, సైబర్ క్రైం, క్రైం స్పాట్, ఆక్టోపస్, ట్రాఫిక్, వాటర్ కెనాన్, వజ్రఫలకాస్, పలు రకాలైన ఆయుధాల గురించి వివరించారు. డాగ్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డీసీపీలు విశాల్‌గున్నీ, కె.శ్రీనివాసరావు, ఉదయరాణి, ఏడీసీపీలు పి.వెంకటరత్నం, సర్కార్, లక్ష్మీపతి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

- విజయవాడ స్పోర్ట్స్

'హౌస్' ఫుల్.. ప్రదర్శనలోని ఆయుధ సంపత్తిని తిలకిస్తున్న విద్యార్థులు



టార్గెట్ ఫిక్స్.. ఓపెన్ హౌస్‌లో తుపాకీని గురి పెడుతున్న ఎన్టీఆర్ జిల్లా సీపీ టి.కె. రాణా

# మరింత రుచి.. శుచి

- పకడ్బందీగా విద్యార్థుల మధ్యాహ్న భోజనం
- వంట ఏజెన్సీలకు సకాలంలో బిల్లుల చెల్లింపు
- అక్టోబర్ మాసానికి కొత్త ధరలు చెల్లించాలని ఆదేశాలు
- డీఆర్‌డీఏ పరిధిలోని ఏపీఎంలకు పర్యవేక్షణ బాధ్యతలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఏజెన్సీల నిర్వాహకులు

## జగనన్న గోరుముద్దకు నిధులు పెంపు



సీతన్నపేట శ్రీనందక పరశురాములు నగరపాలకసంస్థ పాఠశాలలో భోజనం చేస్తున్న చిన్నారులు(ఫైల్)

**భోజనం పథకం ద్వారా లబ్ధిపొందుతున్న విద్యార్థులు ఇలా..**

| జిల్లా | మొత్తం విద్యార్థులు | భోజనం చేస్తున్న విద్యార్థులు | నెలకు అయ్యే వ్యయం (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| ఎన్టీఆర్ | 1,22,967 | 1,15,764 | 2.15 |
| కృష్ణా | 1,06,414 | 97,500 | 1.98 |

**ఒక్కో విద్యార్థికి నిధులు పెంపు ఇలా..**

| పాఠశాల | ఇప్పటి వరకు చెల్లిస్తున్న మొత్తం (రూ.లలో) | అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్న మొత్తం (రూ.లలో) |
|---|---|---|
| ప్రైమరీ | 4.97 | 5.45 |
| యూపీఎస్/ హైస్కూల్స్ | 7.45 | 8.17 |

మచిలీపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని మరింత రుచిగా.. శుచిగా విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ఇప్పటికే పథకం సమర్థంగా అమలయ్యేలా నిధులు కేటాయింపు చేస్తున్న ప్రభుత్వం, వంట ఏజెన్సీల కష్టానికి సైతం ప్రతిఫలం దక్కేలా నిర్వహణ నిధులు పెంచుతూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త ధరలను అక్టోబర్ ఒకటో తేదీ నుంచే చెల్లించాలని 27వ తేదీన జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ మూడున్నరేళ్ల కాలంలో నిర్వహణ నిధులు పెంచటం ఇది రెండో సారి. దీని వల్ల కృష్ణాలో 1,445, ఎన్టీఆర్ జిల్లాలో 926 పాఠశాలల్లో భోజనం పథకం నిర్వహిస్తున్న 5,671 మంది కుక్ కమ్ హెల్పర్స్‌కు ఆర్థిక ప్రయోజనం కలగనుంది. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా నిధులు పెంచటంపై వంట ఏజెన్సీలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

**పకడ్బందీగా పర్యవేక్షణ..**

విద్యార్థుల చదువులకు పెద్ద పీట వేస్తూనే, వారి ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం.. ప్రతి విద్యార్థికీ వారంలో ఐదు రోజులు కోడిగుడ్లు, రోజుకో రకమైన వంటకంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తోంది. దీనిని మరింత సమర్థంగా అమలు చేయాలని సంకల్పించి.. డీఆర్‌డీఏ పరిధిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్(ఏపీఎం)లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. దీనికి సంబంధించిన శిక్షణ కూడా వారికి అందివ్వనుంది. తద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులతో పాటు ఏపీఎంలు పథక అమలు తీరుని పర్యవేక్షించనున్నారు.

**భోజనం పథకంలో మెనూ ఇలా**

సోమవారం: అన్నం, పప్పుచారు, కోడిగుడ్డు కూర, చిక్కీ
మంగళవారం: పులిహోర, టమాట పప్పు, ఉడకబెట్టిన గుడ్డు
బుధవారం: వెజిటబుల్ రైస్, ఆలూ కూర్మా, ఉడకబెట్టిన గుడ్డు, చిక్కీ
గురువారం: కిచిడీ, టమాట చట్నీ, ఉడకబెట్టిన గుడ్డు
శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడకబెట్టిన గుడ్డు
శనివారం: అన్నం, సాంబార్, తీపి పొంగలి

**ఏజెన్సీలకు సకాలంలో చెల్లింపులు..**



భోజన పథకం నిర్వహణ వ్యయం పెంచటం శుభపరిణామం. ఏజెన్సీలకు దీని వల్ల ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. నిర్వాహకులకు బిల్లులు సైతం ఎప్పటికప్పుడు మంజూరు చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించేలా పర్యవేక్షణ చేస్తున్నాం.

- వేణుగోపాలరావు, అసిస్టెంట్ డైరెక్టర్, ఎన్టీఆర్ జిల్లా

**సెప్టెంబర్ వరకు బిల్లులు వచ్చాయి..**



బడిలో పిల్లలకు భోజనం చేస్తున్న మాకు గతంలో అయితే బిల్లులు సరిగా వచ్చేవి కావు. ఇప్పుడైతే మా టీచర్లు బిల్లు చేసి, పంపించగానే బ్యాంకు ఖాతాల్లో నిర్వహణ డబ్బులు జమ అవుతున్నాయి. నిర్వహణ వ్యయం పెంచటం సంతోషం. సెప్టెంబర్ వరకు మాకు బిల్లులు పూర్తిగా అందాయి.

- కె. జ్యోతిలక్ష్మి, వంట నిర్వాహకురాలు, మచిలీపట్నం

### రైల్వే డివిజన్‌కు రూ.4.65 కోట్ల ఆదాయం



సిబ్బందికి మెరిట్ సర్టిఫికెట్ ఇచ్చి అభినందిస్తున్న సీనియర్ డీసీఎం రాంబాబు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): సెప్టెంబర్ నెలలో విజయవాడ డివిజన్ వ్యాప్తంగా నిర్వహించిన టికెట్ చెకింగ్ ప్రత్యేక డ్రైవ్‌లో 70,866 కేసులు నమోదు చేయడం ద్వారా డివిజన్‌కు రూ.4.65 కోట్లు ఆదాయం సమకూరినట్లు సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు తెలిపారు. ఈ మేరకు విధుల్లో అత్యుత్తమ పనితీరు కనబర్చిన ఐదుగురు టికెట్ చెకింగ్ సిబ్బందికి శుక్రవారం డివిజనల్ కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా మెరిట్ సర్టిఫికెట్‌లను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీనియర్ డీసీఎం రాంబాబు మాట్లాడుతూ డివిజన్‌లోని కమర్షియల్ విభాగంలో టికెట్ చెకింగ్ సిబ్బంది గత నెలలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లు, స్క్వాడ్‌లు, సాధారణ, ఆకస్మిక తనిఖీల ద్వారా టికెట్ లేని ప్రయాణికులు, అధిక లగేజీలు తీసుకువెళ్తున్న ప్రయాణికులపై 70,866 కేసులు నమోదు చేశామన్నారు. తద్వారా రికార్డు స్థాయిలో రూ. 4.66 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఉత్తమ పనితీరు కనబర్చిన గుడివాడ స్క్వాడ్‌కు చెందిన సీటీఐ ఎంజే మాథ్యూస్, విజయవాడ స్టేషన్ సీటీఐ కె.ప్రసాదరావు, విజయవాడ కండక్టర్ సీటీఐ డి.విశ్వనాథ్‌కుమార్, విజయవాడ స్లీపర్ టీటీఐ సురేష్, గుడివాడ స్క్వాడ్ టీటీఐ నితిష్ కుమార్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# 'కారిడార్' షురూ!





రాత్రీ పగలు తేడాలేకుండా జాతీయ రహదారిపై ఫుట్‌పాత్ ఆధునికీకరణ పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

**శరవేగంగా జాతీయ రహదారిపై అభివృద్ధి పనులు**

- రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్ట్ వరకు సుందరీకరణ
- రోడ్ల అభివృద్ధి, ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి రూ.12.9కోట్లు
- గ్రీనరీకి మరో రూ.10 కోట్లు కేటాయింపు
- నవంబరు చివరి నాటికి పనులు పూర్తి చేసేందుకు సన్నాహాలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ ఎయిర్ పోర్టు కారిడార్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం ఎయిర్ పోర్ట్ వరకు జాతీయ రహదారిపై రోడ్లు, ఫుత్‌పాత్‌లు ఆధునికీకరించి, గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎయిర్‌పోర్ట్ కారిడార్ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించి, ఇటీవల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అభివృద్ధికి అడ్డుగా ఉన్న ఆటంకాలను తొలగించి, పనులు త్వరితగతిన పూర్తి చేసేలా దిశానిర్దేశం చేశారు. దీంతో పనులు ఊపందుకున్నాయి.

**వీఎంసీకి బాధ్యతలు..**

- ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి, కేసరపల్లి పంచాయతీల పరిధిలో ఉన్న జాతీయరహదారి నిర్వహణ బాధ్యతను విజయవాడ కార్పొరేషన్‌కు అప్పజెబుతూ, పంచాయతీల నుంచి తీర్మానాలు తీసుకున్నారు.
- 12.8 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేయడంతోపాటు, ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి రూ.12.9 కోట్లతో పనులకు టెండర్లు పిలిచారు. డ్రెయిన్లు బయటికి కనబడకుండా కవర్‌స్లాబ్‌లు వేసి, ఫుట్‌పాత్‌లకు గ్రానైట్ వేస్తున్నారు.
- ప్రస్తుతం సైడ్ డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేస్తున్నారు.
- రామవరప్పాడు నుంచి నిడమానూరు (ఢిల్లీ పబ్లిక్ స్కూల్) వరకు 4.1 కిలోమీటర్ల పొడవు, 1.5 మీటర్ల నుంచి 2.5 మీటర్ల వెడల్పుతో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ను గ్రానైట్ వేస్తున్నారు. ఇప్పటికే శాంపిల్‌గా రామవరప్పాడు జంక్షన్ ఎడమవైపున ఫుట్‌పాత్‌కు గ్రానైట్ వేశారు.
- నిడమానూరు, గూడవల్లిలో రెండు, కేసరపల్లిలో రెండు జంక్షన్‌లను అభివృద్ధి చేసి, ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. గోడలపై అన్ని జిల్లాల ప్రాశస్త్యం ప్రతిబింబించేలా ఆర్ట్ వేయిస్తున్నారు.

**గ్రీనరీకి పెద్దపీట..**

ఎయిర్‌పోర్ట్ కారిడార్ మధ్యలో గ్రీనరీకోసం రూ. 10 కోట్లు కేటాయించారు. ఏపీ గ్రీనింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పనులు సాగుతున్నాయి. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి పెడుతున్నారు. మొక్కలకు నీరు అందించేందుకు వీలుగా డ్రిప్ ఏర్పాటు చేస్తున్నారు.

**విజయవాడకు న్యూ లుక్..**

గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి, రామవరప్పాడు రింగ్ వరకు జాతీయ రహదారిపై సుందరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. విజయవాడకు న్యూలుక్ వచ్చే విధంగా పనులు చేస్తున్నాం. గ్రీనరీతోపాటు, ఫుట్ పాత్‌లకు గ్రానైట్ వేస్తున్నాం. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకొంటున్నాం.

- స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కమిషనర్, వీఎంసీ

### అవిరళ కృషికి అవార్డుతో సత్కారం





గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్ర శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి సంబంధించి ఎక్కువ మంది సభ్యులను చేర్చటం, ఎక్కువ మందితో రక్తదానం చేయించటం, సొసైటీ అభివృద్ధి కోసం విరాళాలు అందించేలా సహకరించినందుకు కలెక్టర్ ఎస్. ఢిల్లీరావుకు అవార్డు అందజేశారు. గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా ఆయన మెడల్ స్వీకరించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

## క్లుప్తంగా

### ఆర్టీసీ బస్సు, లారీ ఢీ పలువురికి గాయాలు



నందిగామ: తెలంగాణకు చెందిన ఆర్టీసీ బస్సు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురైన ఘటన శుక్రవారం తెల్లవారుజామున నందిగామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం నిజామాబాద్ నుంచి గుడివాడకు వస్తున్న సూపర్ లగ్జరీ బస్సు తెల్లవారుజామున మండలంలోని అంబారుపేట సమీపంలో 65 వ నంబర్ జాతీయ రహదారి పక్కనే ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ రవికి తీవ్ర గాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ప్రమాదానికి గురైన సమయంలో మొత్తం 16 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### యువకుడి ఆత్మహత్య

నందిగామ: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు బలవన్మరణం పొందిన ఘటన ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం మండలంలోని అడవిరావులపాడు గ్రామానికి చెందిన పెసరమిల్లి యుగంధర్ (25) విజయవాడలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో గురువారం విజయవాడ నుంచి నందిగామకు వచ్చిన యుగంధర్ పట్టణం సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం ఘటనా స్థలానికి వెళ్లి ఆధారాలు సేకరించడంతో పాటు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ సతీష్ తెలిపారు.

# స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ ద్వారా మంచి ఉద్యోగాలు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- అవనిగడ్డలో స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ సెంటర్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: గ్రామీణ ప్రాంత నిరుద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించి వారు మంచి ఉద్యోగాలు సాధించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ సెంటర్‌ని ఎమ్మెల్యే సింహాద్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మనటీవీ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ నిరుద్యోగులకు నైపుణ్యం పెంపొందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 175 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇప్పటికే 60 కేంద్రాలను ఏర్పాటు చేయగా కృష్ణాజిల్లాలో గుడివాడ, గన్నవరం తరువాత అవనిగడ్డలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే వివరించారు. ప్రస్తుతం డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తుండగా భవిష్యత్‌లో మరిన్ని కోర్సులను తీసుకొచ్చేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే సింహాద్రి చెప్పారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నవంబర్ 4వ తేదీన అవనిగడ్డలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్లు, అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రూపొందించిన దివిసీమ దివిటీలు పుస్తకాన్ని ఎమ్మెల్యే సింహాద్రి, అధికారులు ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వెంకటరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, శిక్షణాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో శైలజ, ఉపసర్పంచ్ గాజుల జయగోపాల్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాన్ని పాడు చేసుకోవద్దు

సీపీ టి.కె.రాణా

విజయవాడ స్పోర్ట్స్: మాదక ద్రవ్యాలకు బానిసై బంగారు జీవితాన్ని పాడు చేసుకోవద్దని విద్యార్థులు, యువతకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా సూచించారు. విజయవాడలోని లబ్బీపేటలో ఉన్న టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వద్ద ఆధునికీకరించిన అదనపు భవనంలో ఏర్పాటు చేసిన డ్రగ్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుంచి విద్యార్థులు గంజాయి, తదితర మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువత, విద్యార్థుల్లో మార్పు తీసుకొచ్చేందుకే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని వారి తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు బాధ్యతగా ఈ కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ విశాల్‌గున్ని, ఏడీసీపీలు కె.శ్రీనివాసరావు, లక్ష్మీపతి, పి.వెంకటరత్నం, వర్మ, రమణమూర్తి పాల్గొన్నారు.

# ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పాయకాపురం(విజయవాడరూరల్): అనారోగ్య సమస్యతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం కండ్రికకు చెందిన కందుకూరి చంద్రయ్య(37) ఆటోనగర్లో వైర్ సీట్లు అల్లుకుంటూ జీవిస్తుంటాడు. అతనికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. భార్య గాయత్రి కూడా ఆటోనగర్‌లో పనికి వెళుతుంది. చంద్రయ్యకు గురువారం తీవ్రంగా గ్యాస్ సమస్యతో నొప్పి, వాంతులు అయ్యాయి. ఆ సమయంలో భార్య పనికి వెళ్లింది. నొప్పి తాళలేక చంద్రయ్య ఇంట్లో ఉన్న కుమార్తెలను బయటకు పంపించి లోపల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# అవార్డు గ్రహీతలకు అత్యుత్తమంగా ఏర్పాట్లు

లైజనింగ్ అధికారులకు కలెక్టర్ ఢిల్లీరావు సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, వేదికపై జేసీ శ్రీవాస్ నుపూర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ ఎచీవ్‌మెంట్, లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతలు ఎప్పటికీ గుర్తుంచుకునేలా అత్యుత్తమంగా విధులు నిర్వర్తించాలని లైజనింగ్ అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. నవంబర్ ఒకటో తేదీన బందరు రోడ్డులోని ఏ కన్వెన్షన్ హాలులో నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి సంబంధించిన లైజనింగ్ ఆఫీసర్లతో శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందించే పద్మ అవార్డులకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డాక్టర్ వైఎస్సార్ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్, వైఎస్సార్ ఎచీవ్‌మెంట్ అవార్డులను ప్రదానం చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచే కాకుండా హైదరాబాద్ నుంచి కూడా నగరానికి చేరుకునే అవార్డు గ్రహీతలకు నగరంలోని నోవాటెల్ హోటల్‌లో బస ఏర్పాటు చేశామన్నారు. లైజనింగ్ అధికారులు అవార్డు గ్రహీతలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అవార్డు గ్రహీతల ప్రొఫైల్ ముందుగానే తెలుసుకోవాలన్నారు. అవార్డు గ్రహీతలు నగరానికి చేరుకునే సమయాలను ముందుగా తెలుసుకొని, వారిని నోవాటెల్ హోటల్‌కు తీసుకురావాలన్నారు. అవార్డుదారులతోపాటు ఇద్దరు కుటుంబ సభ్యులను అనుమతిస్తామని, వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎయిర్ పోర్ట్ నుంచి హోటల్, హోటల్ నుంచి ఏ కన్వెన్షన్ హాల్‌కు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయాలని డీటీసీని కలెక్టర్ ఆదేశించారు. అవార్డులు తీసుకునే వారిలో ప్రముఖ వ్యక్తులు నేరుగా ఏ కన్వెన్షన్ హాల్‌కు చేరుకునే అవకాశం ఉందని, అటువంటి వారి ప్రయాణ వివరాలను ముందుగానే తెలుసుకోవాలని లైజనింగ్ అధికారులను ఆదేశించారు. కొంతమంది అవార్డుదారులు ఒకరోజు ముందుగానే నగరానికి చేరుకునే అవకాశం ఉందని, వారి షెడ్యూల్‌ను ముందుగానే తెలుసుకుని సమన్వయం చేసుకోవాలన్నారు. కొందరు అమ్మవారి దర్శనం చేసుకోవాలని కోరుకుంటారని, అటువంటి వారి వివరాలను ఆలయ ఈవోకు ముందుగానే సమాచారం అందించి ప్రొటోకాల్ దర్శనం ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లైజనింగ్ అధికారులు కార్యక్రమం పూర్తయ్యేంతవరకు వారి వెన్నంటే ఉండాలని, వారు అవార్డు తీసుకుని తిరిగి వెళ్లే వరకు వారితోనే ఉండాలన్నారు. అవార్డులు తీసుకున్న అనంతరం గ్రూప్ ఫొటో ఉంటుందని, దీనికి ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. ఏ కన్వెన్షన్ హాల్లో అవార్డుదారులకు ఐదు వరుసలు ఏర్పాటు చేశామని, ఒక్కో వరుసలో ఆరుగురు చొప్పున 30 మందికి కేటాయించామన్నారు. ప్రధాన వేదికపై ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఎరేంజ్‌మెంట్స్ ఉండాలన్నారు. వేదిక దిగువన ముందు భాగాన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, శాసనసభ, శాసనమండలి స్పీకర్లు, మంత్రులు, వివిధ స్థాయి అధికారులకు ప్రొటోకాల్ అధికారులతో సమన్వయం చేసుకుని సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో కె.మోహన్ కుమార్, నందిగామ ఆర్డీఓ రవీంద్రరావు, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

### ఐపీ పెట్టిన బిల్డర్ రూ.6 కోట్లకు ఎగనామం

పెనమలూరు: పోరంకి గ్రామంలో ఓ బిల్డర్ జనాల వద్ద రూ.6 కోట్ల వరకు సొమ్ము వసూలు చేసి ఐపీ పెట్టడంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. గ్రామానికి చెందిన బిల్డర్ నాగేశ్వరరావు చాలా సంవత్సరాలుగా గ్రూప్‌హౌస్‌లు, అపార్టుమెంట్‌లు నిర్మాణాలు చేసి విక్రయిస్తున్నాడు. ఇటీవల నిడమానూరు రోడ్డులో అపార్టుమెంట్ నిర్మాణం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో 68 మంది వ్యక్తుల వద్ద రూ.6,03,11,611 అప్పు తీసుకున్నాడు. తీసుకున్న సొమ్ము సకాలంలో చెల్లించక పోవటంతో బాధితులు సొమ్ము ఇవ్వాలని ఒత్తిడి చేయసాగారు. అపార్టుమెంట్ నిర్మాణానికి సంబంధించి మెటీరియల్ సప్లయర్స్‌కు, అతని వద్ద అపార్టుమెంట్‌లు కొనుగోలు చేసిన కొందరికి పెద్ద ఎత్తున సొమ్ము బాకీ పడ్డాడు. కొద్ది రోజులుగా జనాలకు కనిపించకుండా మొఖం చాటేశాడు. ఈ నేపథ్యంలో అప్పుఇచ్చిన వారికి ఐపీ నోటీసులు పంపాడు. నోటీసులు అందుకున్న రుణదాతలు లబోదిబో మంటున్నారు. అప్పు ఇచ్చిన వారిలో పలువురు ప్రముఖులు ఉన్నారు.

# భూ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో చేపట్టిన సాధారణ భూ సర్వేతో పాటు జాతీయ రహదారి భూ సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్ అన్నారు. జాతీయ రహదారి భూ సర్వే పనుల తీరుపై శుక్రవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ సబ్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో కె.మోహన్‌కుమార్‌లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గొల్లపూడి రైల్వే లైనుకు సంబంధించి ప్లానింగ్ నోటిఫికేషన్ సకాలంలో పంపాలని సబ్ కలెక్టర్ అదితి సింగ్‌ను ఆదేశించారు. జక్కంపూడి ఫ్లైఓవర్ పనులకు రైతులకు నష్టపరిహారం వారంలోగా పంపిణీ చేయాలన్నారు. జగ్గయ్యపేట, ముక్త్యాల ఇన్లాండ్ వాటర్ వేస్ సంబంధించి వచ్చే వారం లోగా పరిహార మొత్తం నిర్ణయం చేయాలన్నారు. చంద్రాల–వెల్వడం సాధారణ భూ సర్వేకు సంబంధించి కూడా వారం లోగా పరిహార మొత్తం నిర్ణయించి నివేదిక పంపాలని సంబంధిత ఆర్డీవోను ఆదేశించారు.

**మార్కెట్ ధరల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**

జాతీయ రహదారి పనుల్లో భాగంగా గ్రీన్ ఫీల్డ్ అలైన్‌మెంట్‌కు సంబంధించి 15 గ్రామాలు ఉన్నాయని, వీటిలో 14 గ్రామాలకు మార్కెట్ ధర ప్రతిపాదనలు సిద్ధం చేసి నవంబర్ నెలాఖరుకు పరిహార నిర్ణయ ఉత్తర్వు చేయించాలన్నారు. నందిగామ బైపాస్ రోడ్డు త్రీడీ నివేదికను సమర్పించాలని నందిగామ ఆర్డీవోను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో నందిగామ ఆర్డీవో ఎ.రవీంద్రరావు, తిరువూరు ఆర్డీవో జి.లక్ష్మీ ప్రసన్న, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# బాణసంచా పేలుడు ఘటనలో నిందితులు అరెస్టు



బాణసంచా పేలుడు ప్రమాద వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌చార్జ్ డీసీపీ కొల్లి శ్రీనివాసరావు

విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో ఈ నెల 23వ తేదీన జరిగిన బాణసంచా పేలుడు ఘటనకు కారకులైన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. బీసెంట్ రోడ్డులో వస్త్రాల వ్యాపారం చేసుకునే వై.గోపాలకృష్ణమూర్తి, అతని స్నేహితుడు గోవిందరాజుతో కలిసి దీపావళి బాణసంచా విక్రయించేందుకు జింఖానా మైదానంలో 16వ నంబర్ షాపును తీసుకున్నట్లు తెలిపారు. వీరిద్దరూ కొంత లైసెన్స్‌డు టపాసులు, మరికొన్ని ఇతర దేశాలలో తయారైన నాసిరకం టపాసులను కొనుగోలు చేసి షాపులో ఉంచినట్లు చెప్పారు. నాసిరకం మందుగుండు సామగ్రిని తాడేపల్లిగూడెంకు చెందిన చిరతపూడి కిషోర్ కుమార్, రామాంజనేయులు వద్ద నుంచి వీరు కొనుగోలు చేసినట్లు చెప్పారు. 23వ తేదీ ఉదయం షాపులో పని చేసేందుకు కూలికి వచ్చిన నాంచారయ్య, రాధాకృష్ణ, సాంబయ్య, ఉమామహేశ్వరరావు, బ్రహ్మయ్య, కాశయ్య సామాన్లు సర్దుతుండగా ఉల్లిబాంబుల బస్తా కింద పడి పేలుడు సంభవించినట్లు చెప్పారు. ఈ దుర్ఘటనలో కూలీలు కాశయ్య, బ్రహ్మయ్య ప్రాణాలు కోల్పోయారని, పక్కనే ఉన్న మూడు షాపులు దగ్ధమైనట్లు తెలిపారు. నాసిరకం సరుకులు తీసుకొచ్చి ప్రమాదానికి కారణమైన నిందితులు వై.గోపాలకృష్ణమూర్తి, గోవిందరాజుతో పాటు వీరికి సామగ్రి విక్రయించిన చిరతపూడి కిషోర్‌కుమార్, రామాంజనేయులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రమణమూర్తి, సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ సీఐ బాలమురళి పాల్గొన్నారు.

### విద్యా భూషణ్, సేవాభూషణ్ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఆల్‌ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యావంతులు, ఉపాధ్యాయులు, సామాజిక సేవకుల సేవలను గుర్తించి విద్యాభూషణ్, సేవాభూషణ్ పురస్కారాలతో సత్కరించనున్నట్లు అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇఎస్ఎస్ నారాయణ మాస్టారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు వచ్చేనెల ఆరవ తేదీలోపు ప్రతిభ, సేవలను తెలియజేసే సర్టిఫికెట్లతో డోర్ నంబర్ 1-20-109, గోకుల్‌నగర్, వెంకటాపురం, పోస్టు: తిరుమలగిరి సికింద్రాబాద్ చిరునామాకు పంపించాలని కోరారు. ఎంపిక చేసిన ప్రతిభావంతులకు నవంబర్ 20వ తేదీన హైదరాబాద్‌లో ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ 2022 పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖుల చేతులమీదుగా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 96523 47207 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

### అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు సస్పెన్షన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాలికలతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)గా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పి.రామును సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఉత్తర్వులు జారీ చేశారు. రాము గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేథమేటిక్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలే సర్దుబాటుపై జగ్గయ్యపేట మండలం బలుసుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లాడు. గతంలో పనిచేసిన పాఠశాలలోనూ బాలికలతో అసభ్యంగా ప్రవర్తించడమే కాక, లైంగికంగా వేధింపులకు పాల్పడి రెండు పర్యాయాలు సస్పెండయ్యాడు. రెండు నెలల క్రితం తిరిగి విధుల్లో చేరాడు. ప్రస్తుతం బలుసుపాడు పాఠశాలలో విద్యార్థినులతో కూడా మళ్లీ అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులపై నందిగామ ఉప విద్యాశాఖాధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా స్కూల్ అసిస్టెంట్ పి.రామును సస్పెండ్ చేస్తూ ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఉత్తర్వులు జారీ చేశారు.

### స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు ఫోరం జరిమానా

చిలకలపూడి(మచిలీపట్నం): స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీకి మచిలీపట్నం వినియోగదారుల ఫోరం జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చింది. మచిలీపట్నం గొడుగుపేటకు చెందిన టి.గిరిబాబు తనతో పాటు కుటుంబ సభ్యులకు స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో పాలసీ తీసుకున్నాడు. కోవిడ్ పాజిటివ్ వచ్చి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రూ.3,60,940 ఖర్చు చేశాడు. ఇన్సూరెన్స్ కంపెనీ కేవలం రూ.1,12,100 మాత్రమే గిరిబాబుకు చెల్లించింది. దీంతో గిరిబాబు ఫోరంను ఆశ్రయించాడు. ఫోరం అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, లక్ష్మీరాయల పూర్వాపరాలు విచారించిన అనంతరం గిరిబాబుకు రావాల్సిన రూ.2,48,840 తొమ్మిది శాతం వడ్డీతో సహా 2021 డిసెంబరు 20వ తేదీ నుంచి చెల్లించాలని తీర్పు ఇచ్చారు. ఫిర్యాదు దారునికి మానసిక వేదన కలిగించినందుకు రూ.25 వేలు, వ్యాజ్యం ఖర్చుల నిమిత్తం రూ.5వేలు తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా చెల్లించాలని పేర్కొన్నారు.

### నిందితుడికి ఏడాది జైలుశిక్ష

విజయవాడ లీగల్: యువతిని మోసం చేసినట్లుగా దాఖలైన కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలుశిక్ష విధిస్తూ మహిళా సెషన్స్ జడ్జి శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాల ప్రకారం కంకిపాడు మండలం కుందేరు గ్రామంలో నివసిస్తున్న కత్తుల ఆనందబాబు అదే గ్రామానికి చెందిన మహిళను ప్రేమ పేరుతో మోసగించి, లైంగికంగా లోబరుచుకున్నాడు. బాధిత మహిళ ఫిర్యాదుమేరకు కంకిపాడు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో ఎనిమిది మంది సాక్షులను విచారించగా నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

## క్లుప్తంగా

### నెరెడ్కో ప్రాపర్టీ షో బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పటమట(విజయవాడ తూర్పు): నిర్మాణ రంగ నిపుణుల సమూహం నెరెడ్కో మరోసారి ప్రాపర్టీ షో కు సిద్ధమవ్వటం అభినందనీయమని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. మహాత్మాగాంధీరోడ్డులోని హోటల్ మినర్వా గ్రాండ్ లో ప్రాపర్టీ షో బ్రోచర్ ఆవిష్కరణ శుక్రవారం నిర్వహించారు. నెరెడ్కో వ్యవస్థాపక చైర్మన్ గద్దే రాజలింగం సంస్థ లక్ష్యాలను వివరించారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ నిర్మాణ రంగానికి చెందిన అనేక అంశాలను ఒకే చోటకు చేర్చి వినియోగదారులకు ప్రత్యక్ష అవగాహన కల్పించటం చెప్పుకోదగ్గ విషయమన్నారు. డిసెంబరు నెల 23, 24, 25 తేదీల్లో శేషసాయి కల్యాణమండపంలో నిర్వహించే ప్రాపర్టీ షోని ప్రజలందరూ తప్పనిసరిగా సందర్శించాలని కోరారు. అనంతరం బ్రోచర్ ఆవిష్కరించారు. విజయవాడ విభాగ అధ్యక్షుడు బి. అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి హరిప్రసాదరెడ్డి , రాష్ట్ర ప్రధాన కారదర్శి ఎం .సీతారామయ్య, సెంట్రల్ జోన్ అధ్యక్షుడు ముక్తేశ్వరారావు, ఉపాధ్యక్షుడు వి .సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు కూచిపూడి నృత్య రూపక ప్రదర్శన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సిద్ధార్థ ఆడిటోరియంలో శ్రీనివాస కళ్యాణం కూచిపూడి నృత్య రూపక ప్రదర్శన శనివారం నిర్వహిస్తున్నామని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మధురాపంతుల సీతాలక్ష్మీ ప్రసాద్ బృందం సభ్యులచే ఈ ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారందరూ ఉచితంగానే ఈ ప్రదర్శన తిలకించవచ్చన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎల్ఐసీ ఏజెంట్లు, పాలసీదారుల సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని నాని, రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ హామీ ఇచ్చారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు శుక్రవారం నగరంలోని ఎంపీ కేశినేని నాని, రవీంద్రకుమార్ కార్యాలయాల్లో విడివిడిగా కలిసి సమస్యలపై వినతిపత్రం అందచేశారు. ఎల్ఐసీ ఏజెంట్లు, పాలసీదారుల సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడి ఈ అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. లియాఫీ జెఏసీ సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు బి.మార్కండేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.నాగేశ్వరరావు, జేఏసీ డివిజన్ అధ్యక్షులు ఎస్.రాంబాబు, రామచౌడారెడ్డి డివిజన్ కార్యదర్శులు రవీంద్రరెడ్డి, మోహన్‌బాబు, లియాఫీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, ఎం.రామచంద్రరావు, కె.శ్రీనివాస్‌కుమార్ తదితరులున్నారు.

### సైన్స్ ఆఫీసర్లకు ముగిసిన శిక్షణ



పటమట(విజయవాడ తూర్పు):విద్యార్థుల్లో సృజనాత్మకను పెంచే విధంగా ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన అంశాలకు సంబంధించి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. యునిసెఫ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో నిర్వహించిన శిక్షణలో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 26 జిల్లాలకు చెందిన సైన్స్ ఆఫీసర్లకు శిక్షణ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. పాఠశాల స్థాయిలో చేయాల్సిన కార్యక్రమాలు, నూతన ఆవిష్కరణల వైపు విద్యార్థులను సిద్ధం చేసేందుకు శిక్షణ దోహదం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రవితేజ, వంశీ సాహిత్య, అఖిల, వెంకటరమణ, దిలీప్ ఇన్‌స్పైర్ నోడల్ ఆఫీసర్ భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు

# పేదల బతుకుల్లో వెలుగులు

**గడప గడపకు మన ప్రభుత్వంలో దేవినేని అవినాష్**


సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరిస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడ తూర్పు):ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో రాష్ట్రంలో ఆదర్శ పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 2వ డివిజన్‌లోని 27వ వార్డు సచివాలయం ప్రాంతంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారుల వివరాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదల బతుకుల్లో వెలుగులు వచ్చాయని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నేరుగా పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో పింఛన్ల కోసం అవ్వాతాతలు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పరిస్థితి ఉండేదని చెప్పారు. కానీ ఇప్పుడు నేరుగా ప్రజల వద్దకే పరిపాలనను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజలు ఎంత ఆనందంగా ఉన్నారో తెలియాలంటే ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రజల్లో తిరిగితే తెలుస్తుందన్నారు. కానీ ఎక్కడి నుంచో నాయకులని తీసుకువచ్చి మాట్లాడించి పైశాచిక ఆనందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు. స్థానిక ఎమ్మెల్యేకు నియోజకవర్గం మీద ప్రేమ ఉంటే శాసనసభ్యునిగా ఉండి నియోజకవర్గానికి ఏ అభివృద్ధి చేశారో చెప్పాలని కోరారు. రాష్ట్ర విభజన తర్వాత అప్పటి పరిస్థితులు పొత్తుల్లో భాగంగా ప్రజలు టీడీపీకి అధికారం ఇచ్చారన్నారు. దానిని అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులు ముఖ్యంగా తూర్పు నియోజకవర్గంలో కాల్‌మనీ దందాలు, కబ్జాలు అడ్డగోలుగా చేయడంతో ఎంతో మంది మహిళల ఉసురు తగిలి అధికారం కోల్పోయిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక ఏమి మాట్లాడాలో తెలియక అవివేకంతో టీడీపీ నాయకులు పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుతూ వారి ఉనికి కాపాడుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలవబోతుందని తెలిసి టీడీపీ నాయకులు పూటకో నాయకుడిని తీసుకొచ్చి జగనన్న పాలనలో చాలా సంతోషంగా ఉన్న ప్రజలను రెచ్చ గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలా కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు కోటి నాగులు, డేవిడ్ రాజ్, చందా కిరణ్, సుధాకర్, సుమన, అనిల్, రమేష్, విజయ, చార్లీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్‌ఫోరం, ఎల్‌ఆర్‌ఎస్ మేళాలో 9 దరఖాస్తులు


సర్కిల్-2 పరిధిలో జరిగిన ఓపెన్‌ఫోరంలో పాల్గొన్న అసిస్టెంట్ సిటీప్లానర్ బాలాజీ

పటమట(విజయవాడతూర్పు): నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఓపెన్‌ఫోరం, ఎల్ఎఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) మేళాలో మొత్తం 9 అర్జీలు వచ్చాయి. చిట్టినగర్‌లోని సర్కిల్-1 పరిధిలో మొత్తం ఎల్ఆర్ఎస్‌పై 5, సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో ఎల్ఆర్ఎస్‌పై నాలుగు దరఖాస్తులు వచ్చాయి. పటమటలోని సర్కిల్-3 పరిధిలో ఎటువంటి దరఖాస్తులు రాలేదు. భవన నిర్మాణ అనుమతులు, మార్టిగేజ్ విడుదల, ఆక్యుపెన్సీ తదితర అంశాలపై ప్రజలు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఎల్ఆర్ఎస్‌కు ఈ నెల 31వతేదీ వరకు మాత్రమే గడువు ఉందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డెప్యూటీ సిటీప్లానర్ జుబెన్‌రాయ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీ, డీపీబీవోలు, టీపీఎస్‌లు, టీపీవోలు పాల్గొన్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచాలి


డ్రైడే ఫ్రైడేను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): పరిసరాలను శుభ్రంగా ఉంచడం ద్వారా పలు రకాల వ్యాధులను నివారించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. డ్రైడే ఫ్రైడేను ఆమె శుక్రవారం గిరిపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెయిన్‌లలో నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇంటి అవసరాలతో పాటు, ఎక్కడా చెత్తా చెదారం, నీరు నిల్వ లేకుండా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కలిగించారు.

## ఆయుర్వేదం దివ్య ఔషధం


మాట్లాడుతున్న డాక్టర్ కూరపాటి శ్రీనివాస్

మధురానగర్(విజయవాడ సెంట్రల్):ఆయుర్వేదం దివ్య ఔషధం అని ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కూరపాటి శ్రీనివాస్ అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన ఆయుర్వేదంపై అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఆయుర్వేద వైద్యంతో అన్ని రకాల వ్యాధులు నయం చేయవచ్చని చెప్పారు. ఎటువంటి దుష్ఫలితాలు లేకుండా దీర్ఘకాలిక వ్యాధులను సైతం తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఆయుర్వేదం విశిష్టతను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆయుర్వేదంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు సదస్సు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఆయుర్వేదంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ కె. శ్రీనివాసరావును శాలువాతో సత్కరించారు.

## కోవిడ్ తర్వాత జీడీపీ తగ్గుదల


ఆకార్ పటేల్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):కోవిడ్ తర్వాత దేశంలో జీడీపీ బాగా తగ్గిందని, అందుకు గల కారణాలను ప్రభుత్వాలు ఆలోచించాలని ప్రముఖ పాత్రికేయులు, రచయిత, మానవ హక్కుల కార్యకర్త ఆకార్ పటేల్ చెప్పారు. విశాలాంధ్ర పూర్వ సంపాదకులు సి.రాఘవాచారి తృతీయ వర్ధంతి సందర్భంగా సిద్ధార్థ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం స్మారకోపన్యాసం జరిగింది. ఆకార్ పటేల్ హాజరై 2047లో భారతదేశం-అమృతకాలంలో ఏమి ఆశించాలి? అనే అంశంపై మాట్లాడారు. 2018 సంవత్సరం మార్చి నుంచి 2020 సంవత్సరం వరకు దేశంలో జీడీపీ బాగా తగ్గిందన్నారు. జీడీపీ తగ్గడానికి కారణాలు..? జీడీపీ పెంపునకు అనుసరించాల్సిన మార్గాలపై ప్రభుత్వాల్లో స్పష్టత లేదన్నారు. మన దేశంలో ఇటువంటి అంశాలపై చర్చకు అవకాశం ఉండటం లేదన్నారు. పేదరికాన్ని అధిగమించి అభివృద్ధి వైపునకు పయనించిన దేశాలను అనుకరించడానికి మనం ఏమీ చేయగలమనేది ప్రధానమైన ప్రశ్న అని చెప్పారు. 2047 సంవత్సరానికి మన దేశ డెమోగ్రాఫిక్ డివిడెంట్ పూర్తిగా ఆవిరైపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ వల్ల మన దేశంలో జీడీపీ మందగించడం మొదలైందని తెలిపారు. విశాలాంధ్ర దినపత్రిక సంపాదకులు ఆర్‌వీ.రామారావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సి.రాఘవాచారి ట్రస్ట్ సభ్యులతోపాటుగా నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

**విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం**

భవానీపురం(విజయవాడ పశ్చిమ): విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లోని బబ్బూరి గ్రౌండ్స్‌లో ఆర్యవైశ్య కార్తీక వనసమారాధన - ఆత్మీయ సమ్మేళనం పేరుతో నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, సంఘం అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ (కొండపల్లి బుజ్జి) కోరారు. శుక్రవారం బబ్బూరి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోవిడ్ కారణంగా గత రెండేళ్ల నుంచి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించలేక పోయామని తెలిపారు. అందుకే ఈ ఏడాది ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా 64 డివిజన్లలోని ఆర్యవైశ్యులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 20 వేల మంది హాజరు కానున్నారని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 2 వేల మందికి సత్యన్నారాయణ వ్రతం చేసుకునే అవకాశం కల్పించామన్నారు.

**దందాలు చేసే వాళ్లం కాదు...**

ఈ కార్యక్రమం నిమిత్తం తాము దందాలు చేస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నాయకుడు బుద్ధి లేని బుద్ధా వెంకన్న ఆరోపించటం తన ఉనికిని చాటుకునేందుకు మాత్రమేనని విద్యాధరరావు, బుజ్జి అన్నారు. తాము చందాలు ఇచ్చేవారమే తప్ప దందాలు చేసేవారం కాదనే విషయాన్ని బుద్ధా వెంకన్న గుర్తెరగాలని సూచించారు. వినాయకుడి పేరు చెప్పుకుని దందా చేసిన చరిత్ర టీడీపీదన్నారు. ఆర్యవైశ్య నాయకులు స్పీడ్ సుబ్బారావు, అన్నం రామకృష్ణ, గొంట్ల రామమోహన్‌రావు, కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, ప్రదీప్, డీ రాఘవ, పీ గంగా రమేష్, జీ కిషోర్, జూలూరి నాగభూషణం, సాదు ప్రతాప్, ఎస్.ప్రసాద్ తదితరులున్నారు.

## మహాత్మాగాంధీ జీవితం ఆదర్శనీయం


రిటైర్డ్ ఐఎఎస్ చక్రపాణిని సత్కరిస్తున్న రాంపిళ్ల జయప్రకాష్

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): మహాత్మాగాంధీ జీవితం ఆదర్శనీయమని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, గాంధేయవాది డి. చక్రపాణి అన్నారు. పాలప్రాజెక్టు సమీపంలోని సయ్యద్ అప్పలసామి కళాశాల ప్రాంగణంలోని మహాత్మాగాంధీ దేవాలయంలో గాంధీ ఆశయాల సాధనపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. తొలుత గాంధీ విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ అహింసా, సత్యాగ్రహం వంటి పద్ధతుల ద్వారా గాంధీ భారత దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చారని చెప్పారు. విద్యార్థులు మహాత్మాగాంధీ జీవిత అంశాలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా కళాశాల యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మహాత్మా గాంధీ దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు రాంపిళ్ల జయప్రకాష్ మాట్లాడుతూ మహాత్ముని జీవితం ప్రపంచానికి ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. చక్రపాణిని శాలువాతో సత్కరించి, గాంధీజీ చిత్రపటాన్ని బహూకరించారు. బ్యాంక్ అధికారి ఆర్ఏ. శర్మ, ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ డైరెక్టర్ తమ్మిన సోనియా, హనుమ తదితరులున్నారు.

## జీవశాస్త్రంలో అద్భుత అవకాశాలు



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రమేష్ రాథోడ్

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): జీవశాస్త్రం దాని అనుబంధ రంగాలకు సంబంధించి అద్భుతమైన అవకాశాలు అందుబాటులో ఉన్నాయని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వా కల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ రాథోడ్ అన్నారు. కేబీఎన్ కళాశాల జువాలజీ, బోటనీ విభాగాల ఆధ్వర్యంలో జీవశాస్త్రంలో ఇటీవల చోటు చేసుకున్న పురోగతి అంశంపై జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రమేష్ రాథోడ్ మాట్లాడుతూ సాంకేతిక విప్లవం నేపథ్యంలో అనేక మార్పులు, నూతన ఆవిష్కరణలు వెలుగు చూస్తున్నాయని చెప్పారు. ఎన్నో కొత్త విషయాలు, పలు నూతన అనుబంధ రంగాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. వాటి ద్వారా అపూర్వమైన ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. మైక్రోబయోలజీ, బయోటెక్నాలజీ, నానో టెక్నాలజీ వంటి రంగాల్లోనూ అనేక నూతన ఆవిష్కరణలు వస్తున్నాయన్నారు. వాటిపై అవగాహన పెంచుకోవటం ద్వారా మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్యులు పీవీ కృష్ణ మాట్లాడుతూ ఆక్వాకల్చర్‌లో విస్తృతమైన అవకాశాలు ఎదురు చూస్తున్నాయన్నారు. వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ జీవశాస్త్రం దాని అనుబంధ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా అనేక నూతన అంశాలు అందుబాటులోకి వస్తున్నాయని వెల్లడించారు. వాటిని సద్వినియోగం చేసుకోవటానికి ప్రయత్నించాలన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంకు చెందిన డాక్టర్ నవీన లావణ్యలత, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ జి.కృష్ణవేణి, సదస్సు కన్వీనర్ డాక్టర్ రహమతుల్లా, విభాగాధిపతులు షేక్ ఇస్మాయిల్‌అలీబాషా, జి.కృపాజయశ్రీ, అధ్యాపకులు ఎం. సాహితీ తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యత ఉంటేనే బిల్లుల చెల్లింపు


గ్రీనరీని పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడ తూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో గ్రీనరీ పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం పరిశీలించారు. ఇంజినీరింగ్, ఉద్యానవన విభాగాల అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పనుల పురోగతిని తనిఖీ చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఉంటేనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. కనకదుర్గ ఫ్లై ఓవర్, డా.కె.ఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్, భవానిపురం, స్వాతి జంక్షన్‌లో గ్రీనరీ వర్క్స్‌ను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈఈ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురికి కారుణ్య నియామకాలు


నియామక పత్రాలు అందుకున్న వారితో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగర పాలక సంస్థలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మరణించిన వారి కుటుంబ సభ్యులకు తాము బాసటగా ఉంటామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వీఎంసీలో పనిచేస్తూ మృతి చెందిన ఐదు కుటుంబాలకు చెందిన వారికి కారుణ్య నియామకపు ఉత్తర్వులను శుక్రవారం అందజేశారు. అభ్యర్థుల విద్యార్హతలను బట్టి జూనియర్ అసిస్టెంట్, మెకానిక్, వాచ్‌మెన్, పబ్లిక్ హెల్త్ వర్కర్ వంటి పోస్టులు కేటాయించామని తెలిపారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు.

## రెడ్‌క్రాస్ సొసైటీకి ఉపాధి ఉద్యోగుల జేఏసీ విరాళం


డ్వామా పీడీ సునీతకు చెక్ ఇస్తున్న జేఏసీ నేతలు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు విస్తృతం చేసేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ రూ.20 వేలు విరాళం అందించింది. గొల్లపూడిలోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) కార్యాలయంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.సునీతను శుక్రవారం కలుసుకుని ఆ మొత్తానికి చెక్‌ను అందచేశారు. జేఏసీ అధ్యక్షుడు వీరమల్లు వెంకటేశ్వరరావు నేతృత్వంలో జిల్లాలోని ఏపీఓ, ఈసీ, టీఏ, సీఏ, బీఎఫ్‌టీ నేతలు కె.రాజేష్, ఎ.భాస్కరరావు, జేవీ వెంకటేశ్వరరావు, మూర్తి, సుబ్రహ్మణ్యం, కుసుమ, శ్రీలక్ష్మి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలపై పోరాడటమే కాకుండా సామాజిక బాధ్యతగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు.

## రైల్వేస్టేషన్లలో వ్యర్థాల తొలగింపు


రైల్వే స్టేషన్ పరిసరాల్లో వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో హర్ పత్రి సాఫ్ సూత్రి పేరుతో నెల రోజుల పాటు డివిజన్‌లోని అన్ని రైల్వే స్టేషన్లలో పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రైల్వే ట్రాక్‌లు, యార్డ్‌లు, స్టేషన్ పరిసర ప్రాంతాల్లో వ్యర్థాలు, పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా సీనియర్ డీఈహెచ్ఎమ్ రామ్‌చంద్ర సాహూ మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా 155 స్టేషన్‌లలో అక్టోబర్ నెలలో హర్ పత్రి సాఫ్ సూత్రి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రధాన స్టేషన్‌లలో హైప్రెజర్ జెట్‌లు, రైడ్ ఆన్ స్క్రబ్బర్, ఆన్ స్వీపర్ వంటి ఆధునిక యంత్రాలతో పరిశుభ్రపర్చడంతో పాటుగా రైళ్లు, స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రైల్వే మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు అన్ని రైల్వే స్టేషన్లలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పరిశుభ్రతకు ముందు-తరువాత ఫొటోలతో ప్రజల్లో చైతన్యం తీసుకుకొచ్చినట్లు పేర్కొన్నారు. నెల రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి అభినందనలు తెలిపారు. సీనియర్ డీఈహెచ్ఎమ్‌తో పాటు సిబ్బందిని డీఆర్ఎం శివేంద్రమోహన్ అభినందించారు.

## వ్యక్తిగత శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

భవానీపురం(విజయవాడ పశ్చిమ):విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్య అకాడమీ హైస్కూల్లో విద్యార్థినులకు శానిటరీ నేప్కిన్స్ పంపిణీ చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో శుక్రవారం స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల బాలికలకు రీయూజబుల్ శానిటరీ నేప్‌కిన్స్ అందచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌బీఐ డెప్యూటీ జనరల్ మేనేజర్ కె.రంగరాజన్ మాట్లాడుతూ బ్యాంక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యానికి వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమని చెప్పారు. ఉన్నత చదవులు పూర్తి చేసుకుని ఒక స్థాయికి ఎదిగి సమాజాభివృద్ధికి దోహదపడాలని సూచించారు.

## ఓపెన్‌హౌస్‌కు విశేష స్పందన





విజయవాడ పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన ఓపెన్‌హౌస్‌కు విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై వివిధ రకాల ఆయుధాలు, వాటి పనితీరు గురించి తెలుసుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీమ్, ఆక్టోపస్ తదితర విభాగాల విధుల గురించి పోలీసు అధికారులు విద్యార్థులకు వివరించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

## వామికొండ, సర్వారాయ సాగర్‌లపై ప్రత్యేక దృష్టి

- రివిట్‌మెంట్ పనులు పూర్తిచేసి గరిష్ట స్థాయిలో నీటినిల్వ
- పిల్లకాలువలు తవ్వి 35 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు
- ఈ పనులకు రూ.212.89 కోట్లతో పరిపాలన అనుమతి
- త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సర్కారు సంకల్పం
- జలయజ్ఞ ఫలాలు రైతులకు అందించడమే లక్ష్యం



సాక్షి, అమరావతి: గాలేరు–నగరి సుజల స్రవంతి పథకం తొలిదశలో అంతర్భాగమైన వామికొండసాగర్, సర్వారాయసాగర్‌లలో మిగిలిన పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వైఎస్సార్ జిల్లాలోని ఈ రెండు జలాశయాల్లోను మిగిలిపోయిన రివిట్‌మెంట్ పనులు పూర్తిచేయడం ద్వారా గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేయడానికి మార్గం సుగమం చేయాలని నిర్ణయించింది. డిస్ట్రిబ్యూటరీ (పిల్ల కాలువలు)లను పూర్తిచేయడం ద్వారా 35 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించి రైతులకు జలయజ్ఞ ఫలాలు అందించేదిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ పనులు చేపట్టడానికి రూ.212.89 కోట్లతో శుక్రవారం పరిపాలన అనుమతి ఇచ్చింది. గాలేరు–నగరి తొలిదశలో రెండో ప్యాకేజీలో వామికొండసాగర్ (1.6 టీఎంసీలు), సర్వారాయసాగర్ (3.06 టీఎంసీలు)లను చేపట్టి.. వరుసగా 10 వేలు, 25 వేల ఎకరాలకు నీళ్లందించాలని నిర్ణయించారు. 2009 నాటికే సర్వారాయసాగర్, వామికొండసాగర్ దాదాపు పూర్తయ్యాయి. రివిట్‌మెంట్ పనులు మాత్రమే కొంతభాగం మిగిలి పోయాయి. దీంతో వామికొండసాగర్‌లో 0.71, సర్వారాయసాగర్‌లో ఒక టీఎంసీ నీటిని నిల్వచేస్తున్నారు. మిగతా రివిట్‌మెంట్ పనులు పూర్తిచేస్తేనే రెండు జలాశయాల్లోను గరిష్ట స్థాయిలో నీటిని నిల్వచేయవచ్చు. వామికొండ సాగర్ కింద పదివేలు, సర్వారాయసాగర్ కింద 25 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడానికి పిల్లకాలువల పనులు చేయాలి. పిల్లకాలువలు తవ్వడానికి 796.7 ఎకరాల భూమిని సేకరించాలి. ఈ భూసేకరణకే రూ.40 కోట్ల వ్యయం అవుతుంది. భూమిని సేకరించి, పిల్ల కాలువల పనులను త్వరితగతిన పూర్తిచేసి ఆయకట్టుకు నీళ్లందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ఆ యాత్ర ఉద్దేశమే వేరు

**అమరావతి రైతులు ఉద్రిక్త పరిస్థితులు సృష్టిస్తున్నారు**

- తొడలు కొడుతూ అభ్యంతరకరంగా మాట్లాడుతున్నారు
- కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారు
- అందువల్ల వారి యాత్రకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయండి
- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్

సాక్షి, అమరావతి: అమరావతి మాత్రమే రాజధానిగా ఉండాలంటూ పాదయాత్ర చేపట్టిన రైతులు.. ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడి ప్రజలను రెచ్చగొడుతూ, వారి మనోభావాలను దెబ్బ తీస్తున్నారని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ హైకోర్టుకు నివేదించారు. హైకోర్టు విధించిన షరతులను అమరావతి రైతులు ఉల్లంఘిస్తున్నందున వారి యాత్రకు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని కోరుతూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి.. యాత్రలో 600 మంది రైతులు మాత్రమే ఉండాలని, సంఘీభావం పేరుతో ఇతరులెవ్వరూ యాత్రలో పాల్గొనడానికి వీల్లేదంటూ ఇచ్చిన ఆదేశాలను సవరించాలని రైతులు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు శుక్రవారం విచారణ జరిపారు.

**అది ముమ్మాటికీ రాజకీయ యాత్రే**

పోలీసుల తరఫున ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. 'యాత్రలో పాల్గొనే 600 మంది రైతులకు పోలీసులు గుర్తింపు కార్డులు సిద్ధం చేశారు. వాటిని జారీ చేసేందుకు ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేశాం. అయితే కొద్ది మంది మాత్రమే గుర్తింపు కార్డులు తీసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు గుర్తింపు కార్డులు చూపాలని పోలీసులు అడిగితే, కోర్టు విధించిన షరతులను సడలించాలని వారు అడుగుతున్నారు. యాత్ర వెంట నాలుగు వాహనాలకు బదులుగా 200 వాహనాలు వెంట ఉన్నాయి. అసలు అమరావతి రైతులు తలపెట్టిన యాత్ర ఉద్దేశమే వేరు. ఇటీవల గుడివాడలో అక్కడి ప్రజా ప్రతినిధులను ఉద్దేశించి.. గుడివాడ వచ్చాం.. తేల్చుకుందాం రా అంటూ తొడలు కొడుతూ తీవ్రంగా రెచ్చగొట్టారు. వారికి కోర్టు ఉత్తర్వులంటే గౌరవం లేదు. దైవ దర్శనం కోసం వెళుతున్నామని చెప్పి రాజకీయ యాత్రగా మార్చేశారు. అందువల్ల అమరావతి టు అరసవల్లి పాదయాత్రకు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలి' అని ఆయన కోర్టును అభ్యర్థించారు.

**న్యాయ వ్యవస్థ ప్రతిష్టను దిగజారుస్తున్నారు..**

మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, కారుమూరి నాగేశ్వరరావు, ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ తరఫున సీనియర్ న్యాయవాదులు కేజీ కృష్ణమూర్తి, ఆర్.ఎస్.హేమేంద్రనాథ్‌రెడ్డి, చిత్తరవు రఘు, వీఆర్ఎన్ ప్రశాంత్ వాదనలు వినిపిస్తూ.. కొందరు రైతులు న్యాయ వ్యవస్థ, న్యాయమూర్తుల ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం, టీవీల్లో చర్చలు పెట్టడం చేస్తున్నారని తెలిపారు. మంత్రులపై పలు ఆరోపణలు చేసిన నేపథ్యంలో వాటికి కౌంటర్ రూపంలో సమాధానం ఇస్తామన్నారు. రైతుల తరఫు న్యాయవాదులు ఉన్నం మురళీధర రావు, పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. సంఘీభావం పేరుతో యాత్రలో ఇతరులు పాల్గొనడానికి వీల్లేదన్న ఆదేశాలు యాత్రలో పాల్గొనాలనుకుంటున్న వారి హక్కులను హరించేలా ఉన్నాయన్నారు. గుర్తింపు కార్డులు పొందిన వారే కాకుండా ఇతరులు కూడా యాత్రలో పాల్గొంటారని, రొటేషన్ పద్ధతిలో యాత్రను కొనసాగించేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

**అవేం మాటలు?**

రైతులు దాఖలు చేసిన పిటిషన్‌లో ఉపయోగించిన భాషపై న్యాయమూర్తి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పాదయాత్ర చేస్తున్నది జంతువుల్లా అలా నడుచుకుంటూ వెళ్లడానికి కాదంటూ పిటిషన్‌లో పేర్కొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టును శాసించేలా పదజాలం ఉపయోగించడంపై కూడా మండిపడ్డారు. దీంతో రైతుల తరఫు న్యాయవాది ఉన్నం మురళీధరరావు క్షమాపణలు కోరారు.

## ఈఏపీ సెట్ తుది విడత కౌన్సెలింగ్ పూర్తి

**తుది విడతలో 11,408 మందికి సీట్ల కేటాయింపు**

- ఇప్పటివరకు రెండు విడతల్లో మొత్తం 92,661 మందికి సీట్లు
- ఇంకా కన్వీనర్ కోటాలో 20 వేలకుపైగా మిగులు సీట్లు
- అత్యధికంగా ప్రైవేటు కాలేజీల్లో మిగిలిపోయిన సీట్లు
- సీట్లు పొందినవారు కాలేజీల్లో రిపోర్టు చేయడానికి గడువు ఈ నెల 31

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించిన ఏపీ ఈఏపీసెట్–2022 అడ్మిషన్ల తుది విడత కౌన్సెలింగ్ ముగిసింది. చివరి దశ కౌన్సెలింగ్‌లో పాల్గొని ఆప్షన్లు నమోదు చేసిన అభ్యర్థులకు శుక్రవారం సీట్లు కేటాయించినట్లు అడ్మిషన్ల కన్వీనర్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి తెలిపారు. ఈఏపీ సెట్ పరీక్ష రాసినవారిలో 1,73,572 మంది అర్హత సాధించారు. వీరిలో రెండో విడత కౌన్సెలింగ్‌కు 2,677 మంది నమోదు చేసుకున్నారు. వీరితోపాటు తొలి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు దక్కినా వాటిని వదులుకొని 18,959 మంది రెండో విడత కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరు మొత్తం 55,227 ఆప్షన్లు నమోదు చేశారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొన్న వారిలో 11,408 మందికి సీట్లు కేటాయించారు.

**తొలి విడతలోనే 84 శాతం పైగా సీట్ల భర్తీ**

రాష్ట్రంలోని 249 ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో మొత్తం ఉన్న సీట్లు.. 1,12,696. వీటిలో 25 యూనివర్సిటీ కాలేజీల్లో 6,590 సీట్లు, 218 ప్రైవేటు కాలేజీల్లో 1,02,259 సీట్లు, ఆరు ప్రైవేటు యూనివర్సిటీల్లో 3,847 సీట్లు ఉన్నాయి. వీటిలో తొలి విడతలోనే 91,249 సీట్లు (84 శాతం) భర్తీ అయ్యాయి. కాగా మొత్తం రెండు విడతల కౌన్సెలింగ్‌లో 92,661 మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 20,035 సీట్లు మిగిలిపోయాయి. వీటిలో యూనివర్సిటీ కాలేజీల్లో 1,233, ప్రైవేటు కాలేజీల్లో 18,593, ప్రైవేటు వర్సిటీల్లో 209 సీట్లు మిగిలి ఉన్నాయి. స్పోర్ట్స్ కేటగిరీలో 491 సీట్లకు సంబంధించి అభ్యర్థుల ఫైనల్ మెరిట్ జాబితా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) నుంచి రాకపోవడంతో పెండింగ్‌లో పెట్టారు. త్వరలో వీటిని కూడా కేటాయించనున్నారు. కాగా సీట్లు పొందిన అభ్యర్థులు జాయినింగ్ రిపోర్టును ప్రింటవుట్ తీసుకుని సీటు లభించిన కాలేజీలో అక్టోబర్ 31లోగా రిపోర్టు చేయాల్సి ఉంటుంది. కేటాయించిన సీటుకు అభ్యర్థి అడ్మిషన్ల వెబ్‌సైట్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ సిస్టమ్ ద్వారా అంగీకారం తెలపకపోయినా, కేటాయించిన కళాశాలలో నివేదించకపోయినా సీటు రద్దవుతుంది.

# మూడేళ్లలో భారీగా పెరిగిన పీజీ సీట్లు

- 2019కి ముందు వరకు 11 వైద్య కళాశాలల్లో పీజీ సీట్లు 970
- వైఎస్ జగన్ ప్రభుత్వ చర్యలతో గడిచిన మూడేళ్లలో 207 సీట్లు పెరుగుదల
- కొత్తగా 746 సీట్లు మంజూరుకు దరఖాస్తు
- ఎన్ఎంసీ తనిఖీలు పూర్తవగానే అనుమతులు
- కొత్త కళాశాలలు వస్తే అందుబాటులోకి 3 వేల పీజీ సీట్లు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వైద్య విద్యలో నూతన అధ్యాయాన్ని లిఖిస్తోంది. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఇప్పటికే 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టి, వీటిలో 5 వైద్య కళాశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తోంది. మరో వైపు పీజీ సీట్ల పెంపుపైనా ప్రత్యేక దృష్టి సారిస్తోంది. 2019కి ముందు వరకు రాష్ట్రంలో 970 పీజీ సీట్లే ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా డీఎంఈలో 106 ప్రొఫెసర్, 312 అసోసియేట్ ప్రొఫెసర్, 832 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కొత్తగా సృష్టించింది. ఖాళీగా ఉన్న పోస్టులను కలుపుకుని ఏకంగా 1,254 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ చేపట్టింది. దీని ఫలితంగా మూడేళ్లలో ఏకంగా 207 పీజీ సీట్లు అదనంగా సమకూరాయి. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలోని 11 వైద్య కళాశాలల్లో 1,177 పీజీ సీట్లు ఉన్నాయి. మరో 746 సీట్ల మంజూరుకు దరఖాస్తు చేశారు. ఈ లెక్కన 2019 వరకు మొత్తంగా రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న పీజీ సీట్లు 970 కాగా.. 2019 నుంచి మూడున్నరేళ్లలోనే మరో 953 సీట్లు పెరిగినట్టు అవుతుంది. తద్వారా పెద్ద సంఖ్యలో స్పెషాలిటీ వైద్య నిపుణులు అందుబాటులోకి వస్తారు.

**ఒక్క పోస్టు ఖాళీగా ఉండకుండా**

వైద్య శాఖలో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకుండా సీఎం వైఎస్ జగన్ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో డీఎంఈలో ఇటీవల వాక్–ఇన్‌ఇంటర్వ్యూలు నిర్వహించారు. అవసరమనుకుంటే ప్రైవేటు రంగంలో ఇచ్చే భారీ వేతనాలను ప్రభుత్వ రంగంలోనూ ఇవ్వాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

**దరఖాస్తులు ఎన్ఎంసీ పరిశీలనలో ఉన్నాయి**

746 పీజీ సీట్ల మంజూరుకు దరఖాస్తు చేశాం. ఇవి ఎన్ఎంసీ పరిశీలనలో ఉన్నాయి. ఎన్ఎంసీ తనిఖీలు పూర్తయితే వచ్చే విద్యా సంవత్సరానికి పీజీ సీట్లు కొత్తగా మంజూరవుతాయి. మరో వైపు కొత్తగా నిర్మిస్తున్న 17 కళాశాలలు నిర్ణీత సమయానికి అందుబాటులోకి వస్తే మూడు వేల పీజీ సీట్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

– ఇన్‌చార్జి డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్

## సీఎం కుటుంబం జోలికొస్తే ఖబడ్దార్

- టీడీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలి: పోతుల సునీత
- వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీలకు సామాజిక న్యాయం



సాక్షి, అమరావతి: టీడీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత హెచ్చరించారు. ముఖ్యమంత్రి జగన్, ఆయన కుటుంబ సభ్యులను దూషిస్తే మహిళలంతా కలసి అయ్యన్న పాత్రుడుకి బడిత పూజ చేయడం ఖాయమన్నారు. మరోసారి సీఎం కుటుంబం జోలికొస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. టీడీపీ నాయకురాలు అనిత సభ్యత, సంస్కారం లేకుండా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు మహిళలను అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేయకుండా దమ్ముంటే సీఎం జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోవాలని సవాల్ చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు.

**ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు**

ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిన చంద్రబాబుకు గత ఎన్నికల్లో ప్రజలు గట్టి గుణపాఠం నేర్పినా ఆయన తీరు మారలేదు. మూడున్నరేళ్లుగా సీఎం జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి. పారదర్శకంగా డీబీటీ ద్వారా రూ.2 లక్షల కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేశారు. 75 ఏళ్ల స్వతంత్ర భారత చరిత్రలో బీసీలకు ఎన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయం జరుగుతుంది. సీఎం జగన్ సామాజిక విప్లవకారుడిలా పని చేస్తున్నారు.

**చర్చించే ధైర్యం ఉందా?**


బీసీలకు సీఎం జగన్ అన్ని చోట్లా ప్రాధాన్యం ఇచ్చారు. బీసీల్లో 12 మందికి ఎమ్మెల్సీ పదవులు, నలుగురికి రాజ్యసభ పదవులు, ఆరుగురికి ఎంపీ పదవులు, 11 మందికి మంత్రి పదవులు ఇచ్చారు. 136 బీసీ కులాల కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి 674 డైరెక్టర్ పదవులు ఇచ్చారు. చంద్రబాబు, ఆ పార్టీ నాయకులకు కళ్లు కనిపించడం లేదా? బీసీలకు ఎవరేం చేశారో చర్చించే ధైర్యం ఉందా? చంద్రబాబు రెండు ఎకరాల నుంచి రూ.లక్షల కోట్లకు ఎలా ఎదిగారు? అధికారం, సీటు, సంపాదన కోసం ఎన్ని అరాచకాలు చేశారు? ఎన్ని హత్యలు చేశారు? రాష్ట్రాన్ని బలి చేశారు. ఇవన్నీ ప్రజలు గుర్తించారు కాబట్టే 2019 ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారు.

# సమయం లేదు మిత్రమా!

- ఆ నాలుగు గంటలు చాలా విలువైనవి
- లక్షణాలు గుర్తించిన వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి
- 20 నుంచి 35 ఏళ్ల వయస్సు వారికి బ్రెయిన్ స్ట్రోక్
- ఉమ్మడి కృష్ణాలో ఏటా ఆరు వేలకు పైగానే బ్రెయిన్ స్ట్రోక్ రోగులు
- నేడు వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా ప్రత్యేక కథనం



ప్రభుత్వాస్పత్రిలో స్ట్రోక్ యూనిట్



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యేవారు. ఇప్పుడు రెండు పదుల వయస్సులోనే దాని బారిన పడుతున్నట్లు వైద్యులు చెపుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ఇటీవల 20 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు వారు స్ట్రోక్‌కు గురై చికిత్సకోసం వస్తున్నారు. తొమ్మిదేళ్ల హెచ్ఐవీ బాధిత బాలుడు బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. మధ్య వయస్సు వారు పక్షవాతం బారిన పడటంతో వారి కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నం అవుతున్నాయి. అందుకే స్ట్రోక్‌కు గురైన తర్వాత ప్రతి నిమిషం విలువైనది అనే నినాదంతో ఈ ఏడాది వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా అవగాహన కలిగిస్తున్నారు.

**బ్రెయిన్ స్ట్రోక్ అంటే...**

ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా వచ్చేదే బ్రెయిన్ స్ట్రోక్. రక్త ప్రసరణలో అవరోధం కలగడం, నరాలు చిట్లడం ప్రధాన కారణాలు. మెదడుకు ఆక్సిజన్, పోషకాలను తీసుకెళ్లే రక్తనాళాలు చిట్లిపోవడం, రక్తప్రసరణకు అంతరాయం ఏర్పడటం వలన, మెదడులోని ఆ భాగం కణ మరణానికి దారి తీసి స్ట్రోక్‌కు గురవుతారు.

**పక్షవాతానికి కారణాలివే...**

- యువత ఎక్కువగా స్ట్రోక్‌కు గురవడానికి ప్రధాన కారణం స్మోకింగ్, ఆల్కహాల్‌గా వైద్యులు చెపుతున్నారు.
- జీవన విధానంలో మార్పులు, మధుమేహం, రక్తపోటు, కొలస్ట్రాల్ లెవల్స్ ఎక్కువగా ఉండటం, ఒబెసిటీ వారిలో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంటుంది.
- మహిళల్లో కంటే పురుషులకు స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువ.
- ఈస్ట్రోజెన్ కలిగి ఉన్న హార్మోన్ థెరపీలు, గర్భనిరోధక మాత్రలు వాడిన మహిళల్లో స్ట్రోక్ వచ్చే అవకాశాల ఎక్కువ.
- గుండె జబ్బులు ఉన్న వారికి బ్రెయిన్‌స్ట్రోక్ రావచ్చు.
- అన్యూరిజం వంటి శరీర నిర్మాణ లోపాల(రక్తనాళాల గోడలు బలహీనమై ఉబ్బడం) వలన స్ట్రోక్ రావచ్చు.
- రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలైన వారికి స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువ.
- పుట్టుకతోనే జన్యుపరమైన లోపాల కారణంగా రక్తం గడ్డకట్టే గుణం వున్న వారికి స్ట్రోక్ రావచ్చు.

**స్ట్రోక్ లక్షణాలు**

- మాట్లాడటం, మాట అర్థం చేసుకోవడంలో ఇబ్బంది
- ముఖం వేలాడి పోవడం
- చేతులు బలహీనత
- సమతుల్యత కోల్పోవడం
- తీవ్రమైన తలనొప్పి
- జ్ఞాపకశక్తి కోల్పోవడం
- దృష్టిలో ఇబ్బంది
- కళ్లు తిరగడం

ఈ లక్షణాలు గుర్తించిన నాలుగున్నర గంటల్లోపు ఆస్పత్రికి చేరుకోగలిగితే మంచి ఫలితం ఉంటుందని వైద్యులు చెపుతున్నారు.

**స్ట్రోక్‌లో రకాలు**

బ్రెయిన్‌స్ట్రోక్ ఇస్కిమిక్, హెమరైజ్డ్ అనే రెండు రకాలుగా వస్తుంది.

**ఇస్కీమిక్**

ధమనిలో అడ్డంకుల కారణంగా స్ట్రోక్ వస్తుంది. మెదడు రక్తనాళం సన్నబడటం, అవరోధం ఏర్పడటం వలన వస్తుంది. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే వారిలో 80 శాతం మంది ఈ రకం స్ట్రోక్‌కు గురవుతుంటారు.

- కొందరిలో తాత్కాలిక ఇస్కీమిక్ ఎటాక్ ఉంటుంది. ఐదు నిమిషాల లోపు లక్షణాలు కనిపించి ఎలాంటి నష్టాన్ని కలిగించదు.

**హెమరైజ్డ్ స్ట్రోక్**

రక్తనాళం లోపలి నుంచి లీకేజీ, ధమని చిట్లడం వలన ఈ రకం స్ట్రోక్ వస్తుంది. మెదడు రక్తస్రావం రక్తనాళాలను ప్రభావితం చేసే అనేక పరిస్థితుల ఫలితంగా వస్తుంది.

**24 గంటల తర్వాతే వస్తున్నారు**



ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారిలో స్ట్రోక్‌కు గురైన 24 గంటలు దాటి కాలు,చేయి చచ్చుపడిన తర్వాతే వస్తున్న వారు ఎక్కువగా ఉంటున్నారు. ముఖ్యంగా స్మోకింగ్, ఆల్కహాల్ కారణంగా యువత స్ట్రోక్‌కు గురవుతున్నారు. స్ట్రోక్ లక్షణాలు గుర్తించి నాలుగున్నర గంటల్లోపు ఆస్పత్రికి చేరుకోగలిగితే నష్టతీవ్రతను తగ్గించవచ్చు. ప్రభుత్వాస్పత్రిలో ఆధునిక సేవలు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ డి.వి.మాధవికుమారి, న్యూరాలజిస్టు ప్రభుత్వాస్పత్రి

**అందుబాటులో ఆధునిక చికిత్సలు**



బ్రెయిన్ స్ట్రోక్ రకాన్ని బట్టి అత్యవసర చికిత్సలు చేస్తాం. తీవ్రమైన ఇస్కీమిక్ స్ట్రోక్‌కు గురైన వారికి థ్రాంబోలైటిక్ థెరపీ చేస్తాం. మెదడుకు రక్తప్రవాహాన్ని నిరోధించే గడ్డను విచ్ఛిన్నం చేయడానికి సిర ద్వారా ఔషధాన్ని ఇస్తాం. స్ట్రోక్‌కు గురైన ఐదు గంటల్లోపు ఈ థెరపీ చేయాలి. మరో విధానం మెకానికల్ థ్రాంబెక్టమీ, స్టెంట్ రిట్రీవర్ పరికరం ద్వారా మూసుకుపోయిన రక్తనాళాల్లో నుంచి క్లాట్స్‌ను మెదడు నుంచి తొలగించడం. హెమరైజ్డ్ స్ట్రోక్‌కు గురైన వారిలో రక్తస్రావం వలన మెదడు దెబ్బతినడం తగ్గించడం, రక్తపోటు ఉంటే కంట్రోల్‌చేస్తాం.

– డాక్టర్ డి.అనిల్‌కుమార్, న్యూరాలజిస్ట్

## ప్లేస్‌మెంట్స్‌లో కేఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ

**రూ.60 లక్షల ప్యాకేజీతో ఎంపికైన విద్యార్థి**



క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వర్సిటీ వీసీ డాక్టర్ సారథివర్మ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చుతున్నారని కేఎల్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సారథివర్మ అన్నారు. ఇటీవల వరుసగా జరిగిన క్యాంపస్ నియామకాలలో తమ విద్యార్థులు ప్రతిభ కనబరచి అత్యధిక ప్యాకేజీలతో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో ప్లేస్‌మెంట్స్ సాధించారన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చదువుతున్న రావూరి పూజిత గూగుల్ కంపెనీలో రూ.60 లక్షల ప్యాకేజీతో ప్లేస్‌మెంట్ పొందినట్లు తెలిపారు. ఎన్టీఆర్‌జిల్లా విజయవాడలోని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో విద్యార్థులు సాధిస్తున్న విజయాలను వివరించారు. విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, వీటి ఫలితంగానే అద్భుతమైన ప్లేస్‌మెంట్స్ విద్యార్థులు పొందగలుగుతున్నారని స్పష్టం చేశారు. విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లకు చెందిన 30 మందికి పైగా విద్యార్థులు రూ. 45 లక్షల ప్యాకేజీ పొందారని, ఈ ఏడాది రూ.50 లక్షల ప్యాకేజీని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. అంతకు మించి తమ విద్యార్థి రూ. 60 లక్షల ప్యాకేజీని పీపీఓ ద్వారా పొందటం గర్వకారణమన్నారు. జపాన్ దేశంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా 10 మంది ఎంపికయ్యారని తమ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ప్లేస్‌మెంట్ పొందటం గొప్ప విజయమని పేర్కొన్నారు. ఈ ఏడాది 280 మందికి పైగా విద్యార్థులు రూ.10 లక్షల కన్నా ఎక్కువ ప్యాకేజీలతో ప్లేస్‌మెంట్స్ పొందారని చెప్పారు. వర్సిటీ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో తమ విద్యార్థులు అంతర్జాతీయ కంపెనీలలో సైతం ప్లేస్‌మెంట్స్ పొందుతున్నారని జర్మనీ, అమెరికా, జపాన్, కెనడా వంటి దేశాల్లో 40 మందికి పైగా ప్లేస్‌మెంట్స్ పొందారని చెప్పారు. సమావేశంలో వర్సిటీ అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్ డాక్టర్ శరవణ బాబు, అడ్మిషన్స్ డైరెక్టర్ జె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రాష్ట్రానికే మోడల్‌గా మంగళగిరి ఎకో పార్క్, ట్రెక్కింగ్ ట్రాక్

**ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మధుసూదనరెడ్డి**



అధికారులు సిబ్బందితో కలిసి టెంపుల్ హిల్ ఏకో పార్కులో వాకింగ్ చేస్తున్న మధుసూదనరెడ్డి

మంగళగిరి: రాష్ట్రానికే మోడల్‌గా మంగళగిరి టెంపుల్ హిల్ ఎకో పార్కు, ట్రెక్కింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయనున్నట్టు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) మధుసూదనరెడ్డి తెలిపారు. నగరంలోని ఎయిమ్స్ వైద్యశాల పక్కన నిర్మించిన టెంపుల్ హిల్ ఎకో పార్కుతోపాటు కొండపై కొత్తగా నిర్మించిన ట్రెక్కింగ్ ట్రాక్‌పై అటవీశాఖ రాష్ట్ర అధికారుల తోపాటు 26 జిల్లాల అధికారులతో కలిసి మధుసూదనరెడ్డి వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా మంగళగిరిలో రెండు కొండల మధ్య ఆహ్లాదకర వాతావరణం కలిగి ఉందని, కొండపై అన్ని వయస్సుల వారికి అనువుగా ట్రెక్కింగ్ ట్రాక్ నిర్మిస్తున్నామని వివరించారు. పర్యాటకంగానూ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో 32 ప్రాంతాలలో ఇలాగే ట్రెక్కింగ్ ట్రాక్ అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అన్ని జిల్లాల అధికారులతో కలిసి ఈ ప్రాంతాన్ని సందర్శించినట్టు వెల్లడించారు. కొండలపై ఔషధ మొక్కలతోపాటు జంతువుల పరిరక్షణకూ కృషి చేస్తామని వివరించారు. ఇప్పటికే కడప, కోటప్పకొండ, కొండవీడుతోపాటు మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. త్వరలోనే కర్నూలుతోపాటు మరికొన్ని ప్రాజెక్టులు చేపడతామన్నారు. కార్యక్రమంలో కన్జర్వేటర్ శ్రీనివాసరెడ్డి, గుంటూరు జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్ బాషా, రేంజ్ ఆఫీసర్ శ్రీ విద్య, డెప్యూటి రేంజ్ ఆఫీసర్ గిరిబాబు, మంగళగిరి బీట్ ఆఫీసర్ రవికుమార్, 26 జిల్లాల అటవీశాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బయట పడిన నృసింహుని పార్వేట స్థూపం



మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆర్అండ్‌బీ బంగ్లా వెనుక సీతారామ కోవెల వద్ద శుక్రవారం లక్ష్మీ నృసింహస్వామి పార్వేట స్థూపం బయట పడింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)కి స్థానికులు స్థూపం గురించి వివరించారు. వెంటనే స్థూపాన్ని నీటితో కడిగి దానిపై ఉన్న వివరాలను తెలుసుకున్నారు. స్థూపంపై హిందూ జనరల్ పబ్లిక్ రైట్ ఆఫ్ అని, కింది భాగంలో హిందూ టెంపుల్స్ అని ఆంగ్ల భాషలో, లక్ష్మీ నృసింహస్వామి, సీతారామ స్వామి పార్వేట మార్గం అని తెలుగులో చెక్కబడి ఉంది. 1890 ఆగస్టు 15న ఈ స్థూపం చెక్కినట్టు, అప్పటి ఈఎస్ డీఎఫ్ఓ జె.ఎస్.స్కాట్ స్థాపించినట్టు ఉంది.

## వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల కోసం అదనపు కోచ్‌లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): పండుగ సీజన్‌లో వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల సౌకర్యం కోసం కొన్ని రైళ్లకు అదనపు కోచ్‌లను జత చేసి నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- సికింద్రాబాద్–దర్భాంగ (17007) నవంబర్ 1 నుంచి 29 వరకు, దర్భాంగ–సికింద్రాబాద్ (17008) రైలుకు నవంబర్ 4 నుంచి డిసెంబర్ 2 వరకు అదనంగా రెండు స్లీపర్ క్లాస్ కోచ్‌లు జత చేశారు.
- సికింద్రాబాద్–హిసార్ (22737) నవంబర్ 1 నుంచి 30 వరకు, హిసార్–సికింద్రాబాద్ (22738) నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4 వరకు రెండు స్లీపర్ క్లాస్ కోచ్‌లు జత చేశారు.
- హైదరాబాద్–హడాప్సార్ (17014) నవంబర్ 3 నుంచి 28 వరకు, హడాప్సార్–హైదరాబాద్ (17013) నవంబర్ 4 నుంచి 29 వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్ జత చేశారు.
- తిరుపతి–విశాఖపట్నం (22708) నవంబర్ 2 నుంచి 30 వరకు, విశాఖపట్నం–తిరుపతి (22707) నవంబర్ 3 నుంచి డిసెంబర్ 1 వరకు ఒక ఏసీ చైర్ కార్ కోచ్ జత చేశారు.
- విజయవాడ–లింగంపల్లి (12795) ఈ నవంబర్ 1 నుంచి 30 వరకు, లింగంపల్లి–విజయవాడ (12796) నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు ఒక ఏసీ చైర్ కార్ కోచ్ జతచేశారు.
- నర్సాపూర్–ధర్మవరం (17247) నవంబర్ 1 నుంచి 30 వరకు, ధర్మవరం–నర్సాపూర్ (17248) నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్ జత చేశారు.

## అలనాటి నటి విజయలక్ష్మికి ఎన్టీఆర్ శతాబ్ది పురస్కారం

**తుర్లపాటి, ఆలపాటికి ఎన్టీఆర్ రంగస్థల పురస్కారాలు**

తెనాలి: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఒకనాటి సుప్రసిద్ధ సినీనటి ఎల్.విజయలక్ష్మికి ఈనెల 30న ఎన్టీఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. స్థానిక నాజరుపేటలోని ఎన్వీఆర్ కన్వెన్షన్ సెంటరులో ఆరోజు సాయంత్రం జరిగే సభలో ప్రముఖ సినీ దర్శకుడు వైవీఎస్ చౌదరికి ఎన్టీఆర్ శతాబ్ది అభిమాన పురస్కారం అందజేస్తారు. ఉత్సవాల కార్యనిర్వాహక కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, గోగినేని కేశవరావు శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఎన్టీఆర్‌తో పలు చిత్రాల్లో నటించిన ఎల్.విజయలక్ష్మి, వివాహం తర్వాత సినిమా రంగాన్ని వదులుకొని 50 ఏళ్ల క్రితం అమెరికాకు వెళ్లినట్టు గుర్తుచేశారు. అవార్డు ప్రదానోత్సవ సభలో ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు నందమూరి మాధవి మణిసాయికృష్ణ, ఉత్సవ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు సాయిమాధవ్ బుర్రా పాల్గొంటారు. మరుసటిరోజు ఉదయం ఎన్టీఆర్‌తో కలిసి తాను నటించిన చిత్రాన్ని ఎల్.విజయలక్ష్మి స్థానిక పెమ్మసాని థియేటరులో ప్రేక్షకులతో కలిసి తిలకిస్తారని తెలిపారు. 29వ తేదీ సాయంత్రం ప్రముఖ రంగస్థల నటులు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, రంగస్థల, సినీనటి ఆలపాటి లక్ష్మికి ఎన్టీఆర్ శతాబ్ది రంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు వివరించారు. విలేకరుల సమావేశంలో సోమవరపు నాగేశ్వరరావు, కుదరవల్లి శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, మాలకొండమరాజు, వెనిగళ్ల నారాయణ, శివప్రసాదరావు పాల్గొన్నారు.

## ఊరూరా పండుగలా..

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తోన్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రజలు ఘన స్వాగతం చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తోన్న సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే తామంతా నడుస్తామని ప్రజాప్రతినిధులతో ప్రజలు చెప్పారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను తప్పకుండా నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.


ఒంగోలు నగరం మూడో డివిజన్‌లో లబ్ధిదారులతో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి మేరుగు నాగార్జున


పశ్చిమగోదావరి జిల్లా జుత్తుగలో అవ్వకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు


నెల్లూరు జిల్లా లింగాలపాడులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


విజయనగరం జిల్లా లచ్చన్నవలసలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

## 'సీమ'కు హైకోర్టు అనవసరం

- టీడీపీ, సీపీఐ, జనసేన నేతల స్పష్టీకరణ
- చంద్రబాబు సూచన మేరకు స్టార్ హోటల్‌లో సమావేశం


సమావేశంలో టీడీపీ, జనసేన, సీపీఐ నేతలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ఒక్క అమరావతి రాజధాని ద్వారా మాత్రమే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ, సీపీఐ, జనసేన నేతలు స్పష్టం చేశారు. రాయలసీమలో హైకోర్టు పెట్టడం అనవసరం అని, దాని ద్వారా ఎలాంటి ఫలితం ఉండదని.. నాలుగు జిరాక్స్ షాపులకు మాత్రమే అవకాశం ఉంటుందని ఎద్దేవా చేశారు. వికేంద్రీకరణను కోరుతూ తిరుపతిలో శనివారం రాయలసీమ ఆత్మగౌరవ మహా ప్రదర్శనకు వైఎస్సార్‌సీపీ, మేధావులు పిలుపునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఆ మూడు పార్టీల నేతలు ఇక్కడి ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్‌లో సమావేశమయ్యారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సూచన మేరకు సాగిన ఈ సమావేశంలో ఆ మూడు పార్టీల నేతలు ప్రభుత్వాన్ని, సీఎం వైఎస్ జగన్‌ను తీవ్రంగా దూషించారు. శనివారం నిర్వహించే ప్రదర్శన విజయవంతం అయితే మూడు రాజధానులకు మరింత మద్దతు పెరుగుతుందని, అందువల్ల ఆ ప్రదర్శనకు జనం పెద్ద సంఖ్యలో వెళ్లకుండా ఎవరి స్థాయిలో వారు ప్రయత్నించాలని నిర్ణయించారు. కర్నూలులో హైకోర్టు వల్ల రాయలసీమ ప్రజలెవ్వరికీ ఎలాంటి ఉపయోగం ఉండదని, అసెంబ్లీ ఉన్న చోటే హైకోర్టు ఉంటే బావుంటుందనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించాలని కూడా నిర్ణయించారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఇతర నేతలు ఓటా విజయకుమార్, పుష్పావతి, మబ్బుదేవ నారాయణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఈ సమావేశం ఎలా సాగాలి.. ఎవరెవరు ఏం మాట్లాడాలి అనే వివరాలను చంద్రబాబు.. సుగుణమ్మకు ఉదయమే ఫోన్ ద్వారా వివరించారని, ఆ మేరకే ఈ సమావేశం జరిగిందని టీడీపీ నేత ఒకరు తెలిపారు.

## పకడ్బందీగా ధాన్యం సేకరణ

### ఈ-క్రాప్, ఈ-కేవైసీ ఆధారంగా కొనుగోళ్లు



- ఈ ఖరీఫ్‌లో 37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం
- మద్దతు ధర.. ఏ గ్రేడ్ రూ.2,060, సాధారణ రకం రూ.2,040
- తేమ 17 శాతంలోపు ఉంటేనే కొనుగోలు
- 21 రోజుల్లో రైతు ఖాతాకు సొమ్ము చెల్లింపు
- కస్టమ్ మిల్లింగ్‌పై పటిష్ట నిఘా
- ఏప్రిల్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ
- ధాన్యం సేకరణ మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఖరీఫ్ 2022–23 ధాన్యం సేకరణకు మార్గదర్శకాలు విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్‌లో 37 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పేర్కొంది. మధ్యవర్తులు, దళారుల పాత్ర లేకుండా వికేంద్రీకరణ విధానంలో ఆర్బీకేల ద్వారా కొనుగోళ్లు చేపట్టనుంది. కనీస మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ.2,060, సాధారణ రకానికి రూ.2,040గా నిర్ణయించింది. ఈ మేరకు పౌర సరఫరాలశాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ హెచ్. అరుణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. పేదలకు చౌక బియ్యంతో పాటు సంక్షేమ పథకాలకు (ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకాలకు) అవసరమైన బియ్యాన్ని ఖరీఫ్ ధాన్యం సేకరణ ద్వారా సమకూర్చేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఎఫ్‌ఏక్యూ నిబంధనల ప్రకారం తేమ 17 శాతం లోపు ఉన్న ధాన్యాన్ని మాత్రమే మద్దతు ధరకు కొనుగోలు చేయనుంది. తేమశాతం ఎక్కువగా ఉంటే స్థానిక టెక్నికల్ అసిస్టెంట్ సూచనల మేరకు రైతులు జాగ్రత్తగా ఆరబోయాలని సూచించింది. ఈ-క్రాప్, ఈ-కేవైసీ డేటా ఆధారంగా ధాన్యం కొనుగోలు చేసి, 21 రోజుల్లో రైతులకు సొమ్ము చెల్లించేలా చర్యలు చేపడుతోంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ ఉమ్మడి జిల్లాల్లో మార్క్‌ఫెడ్ కొనుగోళ్ల ప్రక్రియ చేపట్టనుండగా మిగిలిన జిల్లాల్లో పౌరసరఫరాల సంస్థ నిర్వహించనుంది. రైతులపై అదనపు భారాన్ని తగ్గిస్తూ ధాన్యం సేకరణ ఏజెన్సీలు, వలంటీర్ల సహాయంతో వ్యవసాయ క్షేత్రం నుంచి ధాన్యం కొనుగోలు చేసి మిల్లు వరకు ప్రభుత్వమే తరలించనుంది.

#### నిబంధనలు పాటించకపోతే బ్లాక్‌లిస్టు

కస్టమ్ మిల్లింగ్‌లో ప్రభుత్వ నిబంధనలు పాటించని మిల్లులను బ్లాక్‌లిస్టులో పెడతామని ప్రభుత్వం హెచ్చరించింది. మిల్లర్లు తమవద్దకు వచ్చిన ధాన్యం, మర ఆడించిన ధాన్యం, బయటకు పంపిన బియ్యం వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని నిర్దేశించింది. మిల్లుకు ధాన్యం చేరిన వారంలోగా కస్టమ్ మిల్లింగ్ పూర్తిచేసి 30 రోజుల్లో ప్రభుత్వ గోడౌన్లకు తరలించాలని స్పష్టం చేసింది. కస్టమ్ మిల్లింగ్ పేరుతో రీసైక్లింగ్ బియ్యాన్ని సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. మిల్లర్లు కచ్చితంగా బ్యాంకు గ్యారంటీలు తీసుకోవాలని ఆదేశించింది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సార్టెక్స్, బ్లండింగ్ మిషనరీ ఉన్న మిల్లులకు మాత్రమే సరఫరా చేస్తామని పేర్కొంది. కలెక్టర్లు నిరంతరం కస్టమ్ మిల్లింగ్‌ను పరిశీలిస్తారని తెలిపింది. సార్టెక్స్ మిల్లర్లకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు పేర్కొంది. వచ్చే ఏప్రిల్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది.

## విశాఖ ప్రజా రాజధాని.. రాజకీయ రాజధాని కాదు

- నినదించిన శ్రీకాకుళం జెడ్పీ సమావేశం
- విశాఖ పాలన రాజధాని ప్రజల్లోంచి పుట్టుకొచ్చిందని వెల్లడి
- రాజధాని కోసం రాజీనామాలు, ప్రాణత్యాగాలకైనా సిద్ధమని ప్రకటన
- విశాఖను పాలన రాజధాని చేయాలంటూ తీర్మానానికి ఆమోదం
- ఉత్తరాంధ్ర ప్రజల కష్టాలను చూసి జగన్ చలించిపోయారు: స్పీకర్ తమ్మినేని
- వెనుకబాటుతనాన్ని పోగొట్టేందుకే విశాఖలో పాలన రాజధాని
- దీనిపై ఆలోచించాలని న్యాయమూర్తులకు చేతులెత్తి మొక్కుతున్నా


స్పీకర్, జిల్లా పరిషత్ చైర్మన్‌కు విశాఖ రాజధాని కావాలంటూ ప్రతిపాదన పత్రాన్ని అందిస్తున్న జెడ్పీటీసీలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విశాఖ పాలన రాజధాని ఆలోచన ప్రజల్లోంచి పుట్టుకొచ్చిందని, అది రాజకీయ రాజధాని కాదని, ప్రజా రాజధాని అని శ్రీకాకుళం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు ముక్త కంఠంతో చెప్పారు. విశాఖ రాజధాని కోసం రాజీనామాలకు, ప్రాణ త్యాగాలకైనా సిద్ధమని ప్రకటించారు. విశాఖ పాలన రాజధానిగా ఉండాలని శ్రీకాకుళం రూరల్ మండల జెడ్పీటీసీ రుప్ప దివ్య చేసిన తీర్మానాన్ని సభ్యులందరూ బలపరిచారు. ఆ తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల కష్టాలను పాదయాత్రలో స్వయంగా చూసి చలించిపోయి, వెనుకబాటుతనాన్ని పారదోలేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో పాలన రాజధాని ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో న్యాయమూర్తులు సైతం ఆలోచన చేసి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలని చేతులెత్తి మొక్కుతున్నామని అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి, చంద్రబాబు సామాజికవర్గం అభివృద్ధికి, కేవలం 29 గ్రామాల్లో ధనికులైన రైతుల కోసం రాష్ట్రంలో అందరినీ బలిచేయడం సరికాదన్నారు. విశాఖను రాజధానిగా చేస్తే చంద్రబాబు, రామోజీలకు వచ్చిన బాధేమిటో చెప్పాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వార్థం ఉంటే పులివెందులలోనే రాజధానికి ప్రతిపాదించేవారని అన్నారు. విశాఖకు జల, వాయు, రోడ్డు, రైల్వే వంటి రవాణా మార్గాలు పుష్కలంగా ఉన్నాయని, ఇక్కడ రాజధాని ఉంటే ప్రపంచ దేశాల పెట్టుబడిదారులు ముందుకొస్తారని తెలిపారు. టీడీపీ నేతలు దీనిని రాజకీయం చేసి కోర్టులకెక్కి వికేంద్రీకరణను అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. విశాఖలో కాదు.. శ్రీకాకుళాన్నే రాజధానిగా చేయాలని హిరమండలం టీడీపీ జెడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు ప్రతిపాదించగా స్పీకర్ స్పందించి చంద్రబాబు అండ్ కో తీర్మానం చేసుకుని తమ దృష్టికి తీసుకురావాలని కౌంటర్ ఇచ్చారు. రాజధానికి విశాఖపట్నం అన్నింటికీ అనువైనదని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ చెప్పారు. ఇక్కడ రాజధాని ఏర్పాటు చేస్తే పారిశ్రామికాభివృద్ధి జరుగుతుందని, ఉత్తరాంధ్రలో వలసలు తగ్గి నిరుద్యోగం పోతుందని, మరిన్ని విద్యా సంస్థలు వస్తాయని వివరించారు. మూడు రాజధానులు ఏర్పాటు చేస్తే రాష్ట్రమంతా అభివృద్ధి చెందుతుందని అన్నారు. గడపగడపకూ వెళ్లి ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశంలో రాజాం, పాలకొండ, పాతపట్నం ఎమ్మెల్యేలు కంబాల జోగులు, కళావతి, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్, తూర్పు కాపు, కళింగ వైశ్య, కాళింగ కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, పేరాడ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

## వాణిజ్య కేంద్రంగా ఏపీ

**వాణిజ్య పన్నుల శాఖ పునర్వ్యవస్థీకరణతో మేలు: బుగ్గన**



దొండపర్తి (విశాఖ దక్షిణ): పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో వాణిజ్య, వ్యాపారాలకు అనువైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఎదుగుతోందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. రాష్ట్ర రెవెన్యూలో వ్యాపార వర్గాలు ముఖ్య భూమిక పోషిస్తున్నాయన్నారు. జీఎస్టీకి సంబంధించి వ్యాపారుల సందేహాలు, సలహాలు, ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కరించేందుకు శుక్రవారం విశాఖలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో నిర్వహించిన ట్రేడ్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని బుగ్గన ప్రారంభించి మాట్లాడారు.

**తనిఖీలపై ఎస్‌వోపీలు**

వాణిజ్య పన్నుల శాఖ పునర్వ్యవస్థీకరణతో వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు మేలు జరుగుతుందని బుగ్గన తెలిపారు. నిర్దిష్టమైన ఫిర్యాదులు, ఆధారాలు ఉంటే మినహా తనిఖీల పేరుతో వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. దీనికి సంబంధించి నిర్దిష్ట విధానాలు (ఎస్‌వోపీ) రూపొందించి తనిఖీలు చేపట్టిన రెండు రోజుల్లోనే నివేదిక సిద్ధం చేసి ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా జరిగేలా ఏర్పాట్లు చేశామన్నారు.

**ఎగుమతుల్లో ఎగబాకిన ఏపీ**

సంక్షేమ పథకాల ద్వారా ఒకవైపు పేదలను ఆదుకుంటూనే వాణిజ్య, వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై పచ్చ మీడియా సహకారంతో విపక్షాలు బురద చల్లుతున్నాయని బుగ్గన మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ప్రోత్సాహాలతో రాష్ట్రం వరుసగా మూడో ఏడాదీ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో (సులభతర వాణిజ్యం) ఫస్ట్ ర్యాంక్ సాధించిందని గుర్తు చేశారు. ఎగుమతుల్లో 7వ స్థానంలో ఉన్న రాష్ట్రం ఇప్పుడు మూడో స్థానానికి చేరుకుందన్నారు. వ్యాపారానికి అనుకూలమైన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వ సంస్థ నివేదికలే స్పష్టం చేస్తున్నాయన్నారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా నిపుణులైన మానవ వనరులను సమకూర్చేందుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా యువతకు శిక్షణ అందిస్తున్నామన్నారు. పన్ను చెల్లింపుదారులకు ఇబ్బందులు లేకుండా వ్యాపారానికి అనుకూల పరిస్థితులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్.రావత్ చెప్పారు. సమావేశంలో ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పి.రవీంద్రబాబు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## వికేంద్రీకరణపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

▶ మొదటి పేజీ తరువాయి

మేధావుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని పలువురు మేధావులు, పలు సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, ఇతరులు పాల్గొన్నారు. పరిపాలన వికేంద్రీకరణ జరగల్సిందేనని చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ లజపతిరాయ్ మాట్లాడుతూ.. రాజధాని, కోర్టులు ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశం భారత రాజ్యాంగంలో ఎక్కడా లేదని చెప్పారు. ప్రధాని, ముఖ్యమంత్రి పాలనకు అనుకూలమైన ప్రాంతంలో ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అమరావతి కాకుండా వేరే ప్రాంతంలో రాజధాని పెట్టడానికి రాజ్యాంగం ఒప్పుకోదంటూ కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రాజధానులు ఎన్ని పెట్టుకోవాలి, ఎక్కడ పెట్టుకోవాలి అనేది పాలకుడి నిర్ణయమేనని అన్నారు. ఒక ప్రాంతం మీద అభిమానంతో కాకుండా రాష్ట్రాభివృద్ధి, భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూడు రాజధానులు ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని తెలిపారు. ప్రాంతాలతో సంబంధం లేకుండా అందరూ స్వాగతించాల్సిన అంశమన్నారు.

**చంద్రబాబు రక్తం మరిగిన పులి**

పరిపాలన వికేంద్రీకరణ పరిరక్షణ వేదిక అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ మనిషి రక్తం రుచి మరిగిన పులి మాదిరిగానే 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు ప్రవర్తన కూడా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రతి అంశాన్నీ వ్యతిరేకించడమే బాబు ధ్యేయమని అన్నారు. ఏదో ఒక విధంగా రాష్ట్రాన్ని నాశనం చేసి లాభం పొందాలని ఆశిస్తున్నారన్నారు. అమరావతి రాజధాని కాదని, అది ఒక కమ్మ సామాజికవర్గం వ్యాపార సామ్రాజ్యమని అన్నారు. పరిపాలన వికేంద్రీకరణ ద్వారా ఇప్పటివరకు వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు సరైనవేనని, అందుకు సచివాలయ వ్యవస్థ, జిల్లాల విభజన నిదర్శనమని తెలిపారు. కరోనా సమయంలో సచివాలయ వ్యవస్థ ద్వారా వందలాది మంది ప్రాణాలను కాపాడారని అన్నారు. మారుమూల గ్రామాల ప్రజలు వారి సమస్యలు చెప్పుకొనేందుకు కలెక్టర్ కార్యాలయానికి రావాలంటే రెండు రోజులు పట్టేదని, ఇప్పుడు జిల్లాల విభజనతో వారి చెంతకే కలెక్టరేట్ వచ్చిందన్నారు.

#### అమరావతి రైతులంతా బడా బాబులే: ప్రొఫెసర్ ఎన్ఏడీ పాల్

వికేంద్రీకరణ పరిరక్షణ వేదిక గౌరవాధ్యక్షులు ప్రొఫెసర్ ఎన్ఏడీ పాల్ మాట్లాడుతూ తమిళనాడు నుంచి ఆంధ్రను విభజించినప్పుడు రాజధానికి మొదట విశాఖపట్నమే అనుకున్నా.. కొన్ని రాజకీయ పరిస్థితుల దృష్ట్యా కర్నూలుకు మార్చారన్నారు. ఆ తరువాత హైదరాబాద్‌కు మార్చి రాష్ట్ర ప్రజల సంపద అంతా అక్కడ పెట్టుబడులుగా పెట్టారన్నారు. ఇప్పుడు కూడా అదేవిధంగా చేయడం వల్ల ఒక ప్రాంతం మాత్రమే అభివృద్ధి చెందుతుందని, అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలంటే వికేంద్రీకరణ జరిగి తీరాల్సిందేనని చెప్పారు. వికేంద్రీకరణ ద్వారా అన్ని ప్రాంతాలకు విద్య, వైద్య, ఉద్యోగావకాశాలు సమానంగా అందుతాయని తెలిపారు. అమరావతి రైతులు అసలు రైతులే కాదని, అంతా బడాబాబులేనని విమర్శించారు. అసలు సిసలైన రైతులు ఉత్తరాంధ్రలో ఉన్నారన్నారు.

#### వరదలొస్తే అమరావతి కొట్టుకుపోతుంది : ప్రొఫెసర్ ముత్తయ్య

ప్రొఫెసర్ ముత్తయ్య మాట్లాడుతూ అమరావతి రాజధానిగా అస్సలు పనికి రాదన్నారు. వరదలు వస్తే అమరావతి కొట్టుకుపోయే పరిస్థితి ఉందన్నారు. లక్షల కోట్లు వృథా తప్ప మరో ప్రయోజనం ఉండదన్నారు. వాయు, జల, రోడ్డు మార్గాలు ఉన్న విశాఖ నగరాన్ని రాజధానిగా చేస్తే రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తాయని చెప్పారు. తద్వారా ఆదాయం పెరిగి సంక్షేమ పథకాలను అమలు చేయవచ్చని తెలిపారు.

#### విద్యార్థుల పోరాటాలు విజయవంతం అవుతాయి : ప్రొఫెసర్ పుల్లారావు

ప్రొఫెసర్ పుల్లారావు మాట్లాడుతూ అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసమే పరిపాలన వికేంద్రీకరణ అని, ప్రాంతీయ అభిమానంతో కాదని చెప్పారు. విద్యార్థులు చేసిన ఏ పోరాటమైనా విజయవంతం అవుతుందన్నారు. పరిపాలన వికేంద్రీకరణ పరిరక్షణ కోసం విద్యార్థులను భాగస్వామ్యం చేయటం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్లు సూర్యనారాయణ, శోభ శ్రీ , నల్ల సత్యనారాయణ, ప్రేమానందం, కృష్ణ, రాజామాణిక్యం, బార్ కౌన్సిల్ సభ్యులు అరుణ్ కుమార్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: వైద్య విశ్వ విద్యాలయం పరిధిలో పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్, పారా మెడికల్ కోర్సుల ప్రవేశాలకు తొలి దశ కౌన్సెలింగ్‌లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లను కేటాయించారు. విద్యార్థుల వెరిఫికేషన్ ఫారం, అలాట్‌మెంట్ ఆర్డర్లను https://ugpostbasic.ntruhsadmissions.com, https://ugparamedical.ntruhsadmissions.com/ugpmallotment/ వెబ్‌సైట్ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని వర్సిటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు నవంబర్ 1వ తేదీ, పారామెడికల్ కోర్సు విద్యార్థులు 4వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా వారికి కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించింది.

### ఈ-క్రాప్ జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశం

**వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్**

సాక్షి, అమరావతి: ఖరీఫ్–2022 సీజన్‌లో 1,11,43,000 ఎకరాల్లో సాగైన పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసినట్టు వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక తనిఖీల్లో భాగంగా నవంబర్ 1వ తేదీ వరకు ఈ-క్రాప్ జాబితాలు ప్రదర్శనకు ఉంచుతున్నామని, చేర్పులు, మార్పులుంటే ఆర్బీకే సిబ్బందికి సమాచారం ఇచ్చి సరిచేసుకోవాలని పేర్కొన్నారు. నవంబర్ 5వ తేదీన తుది జాబితాలు ఆర్బీకేల్లో ప్రదర్శిస్తామని, ఈ జాబితా ప్రామాణికంగానే పంట ఉత్పత్తుల కొనుగోలు, పంటల బీమా, పంట నష్ట పరిహారం వంటి రాయితీలు అందిస్తామని తెలిపారు.

● తెలంగాణ

## పది మంది చేరేలా పక్కా ప్లానింగ్!

- 'టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎర' ఆడియో టేపులు లీక్
- నందు, రామచంద్ర భారతి, సింహయాజి, రోహిత్‌రెడ్డి మధ్య సంభాషణలు

సాక్షి, హైదరాబాద్: టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎర కేసు కొత్త మలుపు తిరిగింది. ఈ ఎపిసోడ్‌కు సంబంధించి శుక్రవారం లీకైన రెండు ఆడియోలు కలకలం రేపుతున్నాయి. ఈ కేసులో నిందితులుగా పోలీసులు ఆరోపిస్తున్న నందు, రామచంద్ర భారతి, సింహయాజితో పాటు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డిల సంభాషణలతో ఈ ఆడియో టేపులు ఉన్నాయి. ఇవి ఈ నెల 26న అజీజ్‌నగర్ ఫామ్‌హౌస్‌లో జరిగిన సమావేశానికి కొన్ని రోజులు ముందు జరిగిన సంభాషణలుగా వాటిని లీక్ చేసిన టీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. పది మంది చేరేలా పక్కా ప్లానింగ్ జరిగినట్లు వారి మాటల్లో వెల్లడైందని టీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. ఆడియోల్లో ఢిల్లీకి చెందిన పెద్దలను నంబర్–1, నంబర్–2 అంటూ సంబోధించడం, అమిత్‌షాతో పాటు బీజేపీ సంస్థాగత వ్యవహారాల జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ పేరును ప్రస్తావించడం సంచలనం సృష్టిస్తోంది. మొదటి ఆడియో క్లిప్‌లో రామచంద్రభారతి, నందకుమార్, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నడుమ 7 నిమిషాలకు పైగా సంభాషణ జరగ్గా, రెండో క్లిప్ 27 నిమిషాల నిడివితో ఉంది. ఆ సంభాషణల ముఖ్యాంశాలు..

సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఎంతైనా ఇచ్చేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని, ముగ్గురు, నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే నెల రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం రద్దు చేస్తారని రామచంద్ర భారతి ఫోన్‌లో నందకుమార్, సిహయాజికి చెప్పగా.. బీజేపీలో చేరేందుకు తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి వంద రూపాయలు (సంకేత భాష.. వాస్తవంగా రూ.100 కోట్లు) అడుగుతున్నారని, తొలి విడతలో నలుగురు ఎమ్మెల్యేలతో పాటు మరో ఐదారుగురు మాజీ ఎమ్మెల్యేలు కలుపుకొని మొత్తంగా పది మంది చేరేలా ప్లాన్ చేస్తున్నామని నందకుమార్, సింహయాజి వివరించారు.

ఈ నెల 26న హైదరాబాద్ వస్తానని, రోహిత్‌రెడ్డి, మరో ముగ్గురు ఎమ్మెల్యేలతో భేటీకి ఏర్పాట్లు చేయాలని, డీల్ కుదిరితే 27న సంతోష్‌తో కలిసి ఢిల్లీకి వెళదామని రామచంద్ర సమాధానమిచ్చారు.

'రోహిత్‌రెడ్డి, మరో ముగ్గురు ఎమ్మెల్యేలు మునుగోడు ఉప ఎన్నికకు ముందే పార్టీని వీడతారని, వెంటనే మరో 15 మంది కూడా చేరతారని నందకుమార్, సింహయాజి చెప్పారు.

నలుగురు, ఐదుగురు అంటే కేంద్రం ఆసక్తి చూపదని రామచంద్ర భారతి చెప్పారు. ఢిల్లీలోనూ 43 మంది ఎమ్మెల్యేలు లైన్‌లో ఉన్నారని అన్నారు. నందకుమార్‌కు ఏదైనా పదవి ఇచ్చి రక్షణ కూడా ఇవ్వాలని సింహయాజి కోరగా, ఎంపీ రఘురామ రాజు తరహాలో వై ప్లస్ రక్షణ ఇచ్చేలా చూస్తానని రామచంద్ర భారతి హామీ ఇచ్చారు. తనతో పాటు వచ్చేందుకు మరో ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు ఒప్పుకున్నారని పైలట్ రోహిత్‌రెడ్డి చెప్పారు. మీ భద్రత, భవిష్యత్తు అంతా కేంద్రం చూసుకుంటుందని, బీఎల్ సంతోష్ చాలా కీలకమని, నంబర్–1, 2లే సంతోష్ ఇంటికి వస్తుంటారని, అది ఆర్ఎస్ఎస్ ప్రొటోకాల్ అని రామచంద్ర భారతి చెప్పారు.

### కొబ్బరి నీళ్లు తీసుకురా..!

**రోహిత్‌రెడ్డి అలా అనగానే దాడికి స్కెచ్**

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఉద్దేశంతో ఎమ్మెల్యేలకు ప్రలోభాలు చూపిన కేసు కావటంతో పక్కా సాక్ష్యాధారాలతో నిందితులను పట్టుకునేందుకు ప్రణాళిక రూపొందించాకే సైబరాబాద్ పోలీసులు రంగంలోకి దిగారు. ఢిల్లీలోని ఫరీదాబాద్‌కు చెందిన పురోహితుడు రామచంద్రభారతి అలియాస్ సతీష్ శర్మ, హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి నందకుమార్, తిరుపతికి చెందిన సింహయాజీ స్వామిలను పకడ్బందీ స్కెచ్‌తో ట్రాప్‌లో పడేశారు. ముందస్తు ప్రణాళికతో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి జేబుల్లో వాయిస్ రికార్డర్లు, హాల్లో కెమెరాలు అమర్చారు. రోహిత్‌రెడ్డి 'కొబ్బరి నీళ్లు తీసుకురా..' అంటూ సంకేతాన్ని ఇచ్చిన తర్వాత దాడి చేసేలా వ్యూహం రూపొందించి అమలు చేశారు. శుక్రవారం హైకోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు ఈ అంశాలన్నీ పొందుపరిచారు.

### నిందితులను రిమాండ్‌కు ఇవ్వండి

సాక్షి, హైదరాబాద్: నలుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు అంశంపై నమోదైన కేసులో నిందితుల రిమాండ్ కోరుతూ పోలీసులు హైకోర్టునాశ్రయించారు. నిందితుల రిమాండ్‌కు గురువారం ఏసీబీ కోర్టు నిరాకరించిన విషయం విదితమే. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ.. శుక్రవారం హైకోర్టును ఆశ్రయించారు. రిమాండ్‌కు ఇవ్వాలన్న పోలీసుల విజ్ఞప్తిని న్యాయమూర్తి తిరస్కరించారు. నిందితులకు 41 సీఆర్‌పీసీ కింద నోటీసులిచ్చాకే విచారించాలని సూచించారు.

### ఎంపీ రఘురామకు చుక్కెదురు

సీఎం వైఎస్ జగన్ బెయిల్ రద్దుకు హైకోర్టు నిరాకరించింది. బెయిల్ రద్దు చేయాలంటూ ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను గతంలో సీబీఐ ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. అయితే సీబీఐ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. రఘురామకృష్ణరాజు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ శుక్రవారం విచారణ చేపట్టారు. వైఎస్ జగన్ అధికార పదవిని దుర్వినియోగం చేస్తున్నారనడానికి ఎలాంటి సాక్ష్యాలను పిటిషనర్ చూపలేదని సీబీఐ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఆయన బెయిల్ షరతులను ఉల్లంఘించిన ఒక్క సందర్భం కూడా లేదన్నారు.

### కేసీఆర్‌కు రాజకీయ సమాధి!

**యాదాద్రి ఆలయంలో ప్రమాణం చేసిన బండి**

సాక్షి, యాదాద్రి: యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి పాదాల వద్ద తాను చేసిన ప్రమాణంతో సీఎం కేసీఆర్ రాజకీయ జీవితం సమాధి అవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ జోస్యం చెప్పారు. కేసీఆర్ తప్పుచేశారు కాబట్టే యాదాద్రికి రాలేదని, మునుగోడులో ఓడిపోతున్నామనే భయంతో ఎమ్మెల్యేల కొనుగోలు ఎపిసోడ్‌కు తెరలేపారని ధ్వజమెత్తారు. ఈ కేసులో కేసీఆర్‌తోపాటు ఎమ్మెల్యేలందరూ లై డిటెక్టర్ పరీక్షలకు సిద్ధమా అని ప్రశ్నించారు. శుక్రవారం యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ముఖమండపంలో ఉత్సవ విగ్రహాల వద్ద ఆయన ప్రమాణం చేశారు. నలుగురు ఎమ్మెల్యేల కొనుగోలు ఎపిసోడ్‌లో తనకు, బీజేపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. అనంతరం కొండ కింద స్వామివారి పాదాల వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంజయ్ మాట్లాడారు. ఆడియో టేపుల పేరుతో తాజాగా మరో కొత్త సినిమా చూపే యత్నం చేసి కేసీఆర్ విఫలమయ్యారని ధ్వజమెత్తారు.



ఈ రోజుల్లో పిల్లల పెంపకం అంటే సాధారణమైన విషయం కాదు. పిల్లలను పెంచే విషయంలో తల్లిదండ్రుల మనసులో చాలా కోరికలు ఉంటాయి. తమ పిల్లలు అన్ని విషయాల్లో ఉత్తమంగా ఉండాలి అని చాలా మంది కోరుకుంటారు. అయితే.. ఇప్పటికీ చాలా మంది ఇళ్లలో అమ్మాయిలును అయితే ఒకలా.. అబ్బాయి అయితే... మరోలా చూస్తూ ఉంటారు. ఈ వ్యత్యాసం చూపించడాన్ని చాలామంది తల్లిదండ్రులు సమర్థించుకుంటారు. అయితే అది తప్పేనని, అలా తేడా చూపించడం వల్ల భవిష్యత్తులో చాలా అనర్థాలు తప్పవని సైకాలజిస్టులు హెచ్చరిస్తున్నారు. ఎందుకో తెలుసుకుందాం...

# మీ పిల్లలకు ఇవి నేర్పిస్తున్నారా?

చాలామంది ఇళ్లలో ఆడపిల్ల విషయంలో ఎక్కువగా ఆంక్షలు, నిబంధనలు విధిస్తూ, నువ్వు ఇలా ఉండకూడదు, అలా ఉండకూడదు.. ఇది తప్పు, అది తప్పు... ఇతరుల నుంచి రక్షించుకోవాలి అలాంటి విషయాలు చెబుతూ ఉంటారు. ఇక అబ్బాయిలు ఉంటే... వంశాన్ని కాపాడాలి, తల్లిదండ్రులను పోషించాలి– లాంటి విషయాలు చెబుతూ ఉంటారు. అలా చెప్పడం తప్పని అనడం లేదు. అయితే అవే కాకుండా.. మగ పిల్లలు ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలకు కచ్చితంగా కొన్ని విషయాలు చెప్పాలి. అవేంటో ఓసారి చూద్దాం...

- చాలా మంది మగ పిల్లలు.. తాము మగవారు అయినందుకు చాలా గొప్పగా ఫీలౌతూ ఉంటారు. ఇంట్లో వారి తల్లిదండ్రుల ప్రవర్తన కూడా అందుకు కారణం కావచ్చు. కాబట్టి.. పిల్లలకు మగ పిల్లలు మాత్రమే గొప్ప అని ఎప్పుడూ చెప్పకూడదు. ఇద్దరూ సమానమే... అయితే ఆడపిల్లలతో పోల్చితే మగపిల్లలు శారీరకంగా మాత్రం కాస్తంత బలంగా ఉంటారు అనే విషయాన్ని చెప్పాలి. మీతో పాటు ఈ సమాజంలో ఆడపిల్లలు కూడా సమానమే అనే విషయాన్ని వారికి అర్థం అయేలా చెప్పాలి.

> పిల్లలకు సారీ, థ్యాంక్స్, ప్లీజ్ వంటి పదాలు ఎప్పుడు, ఎక్కడ అవసరం అయినా చెప్పడం నేర్పించండి. పిరికిగా ఉండటం మంచిది కాదు. ధైర్యంగా ఉండాలి. అందరితోనూ బాగుండాలి అనే విషయాన్ని కూడా పిల్లలకు నేర్పించాలి.

- మనం ఆపదలో ఉన్నప్పుడు ఇతరుల సహాయం ఎలా తీసుకుంటామో.. ఎదుటివారికి అవసరమైనప్పుడు మనం కూడా అదేవిధంగా సహాయం చేయాలని పిల్లలకు నేర్పించాలి. వృద్ధులు, వికలాంగులు, మీకంటే చిన్నవాళ్లు ఎవరైనా రోడ్డు దాటడానికి సహాయం చేయడం లేదా సామాజిక కార్యకలాపంలో పాల్గొనడం వంటివి జీవితంలో కొత్త విషయాలను నేర్చుకోవడంలో మీకు సహాయపడతాయి అనే విషయాన్ని నేర్పించాలి.
- చిన్నా, పెద్ద, లింగ బేధం లేకుండా ప్రతి ఒక్కరినీ గౌరవించడం నేర్పించాలి. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ గౌరవించడం నేర్పించాలి. చిన్న వయసు వారి నుంచి కూడా మనం నేర్చుకునే విషయాలు ఉంటాయి అనే విషయాన్ని మనం పిల్లలకు చెప్పాలి.
- కోపం అందరికీ వస్తుంది. అది సహజం. అయితే... ఆ కోపాన్ని అదుపు చేసుకున్నవారే గొప్పవారు అవుతారు. చూపించాల్సిన సమయంలోనే కోపం చూపించాలి. అందరిపై చూపించకూడదు. ప్రశాంతంగా ఉండటం అలవాటు చేసుకోవాలి. ఈ విషయాలని మనం పిల్లలకు తప్పకుండా నేర్పించాలి. ఎందుకంటే.. కోపం ఎక్కువగా ఉండేవారికి అందరూ దూరంగా ఉంటారు. ప్రశాంతంగా... నవ్వుతూ ఉండేవారినే అందరూ ఇష్టపడతారు.
- ఇతరులను ఎప్పుడూ తక్కువ చేయవద్దు. ఏ వ్యక్తిని కించపరిచే హక్కు మనకు లేదని, తోటి వాళ్లతో ఎప్పుడూ ప్రేమతో వ్యవహరించాలనీ చెప్పండి. అవతలి వారిలో ఏవిధమైన ప్రత్యేకత లేనప్పటికీ, మీరు వారి పట్ల గౌరవం చూపించాలి. ఎదుటివారు ఏ విషయంలోనూ మీకంటే తక్కువ అని మీరు పిల్లలకు చెప్పకూడదు.
- అదేవిధంగా మీ పిల్లలకు సారీ, థ్యాంక్స్, ప్లీజ్ వంటి పదాలు ఎప్పుడు, ఎక్కడ అవసరం అయినా చెప్పడం నేర్పించండి. పిరికిగా ఉండటం మంచిది కాదు. ధైర్యంగా ఉండాలి. అందరితోనూ స్నేహంగా ఉండాలి అనే విషయాన్ని కూడా పిల్లలకు చెప్పాలి. ఈ టిప్స్ పాటిస్తే పిల్లలు మానసికంగా ఆరోగ్యంగా పెరుగుతారు.

# పని ఒత్తిడా? ఇలా చేయండి



**ఆఫీసుల్లో పని భారం ఎక్కువైనప్పుడు ఒత్తిడికి గురవడం సహజమే. అయితే ఇది ఎన్నో సమస్యలకు దారితీస్తుంది. అందుకే దీన్ని తొందరగా తగ్గించుకోవాలి. కొన్ని సాధారణమైన చిట్కాలను పాటిస్తే ఒత్తిడి నుంచి తక్షణమే ఉపశమనం లభిస్తుంది.**

ప్రస్తుత కాలంలో చాలా మంది మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారు. ముఖ్యంగా ఆఫీస్ పనులకు వ్యక్తిగతమైన పనులు కూడా తోడు కావడంతో ఒక్కోసారి ఊపిరి సలపనంత పనులతో అవిశ్రాంతంగా పని చేయవలసి వస్తుంది. దీనివల్ల విపరీతమైన ఒత్తిడికి గురవుతుంటారు. ఇది మన శరీరంపై కూడా తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది. ఫలితంగా పనులను అస్సలు పూర్తిచేయలేము సరికదా.. ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. ఈ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేటందుకు కొన్ని సులభమైన చిట్కాలు పాటిస్తే సరి. అవేమిటో తెలుసుకుందాం.

**గ్రీన్ టీ**

ఆరోగ్యానికి మంచిది. ఇది బరువును తగ్గించడానికి, వ్యాధి నిరోధక శక్తిని పెంచడానికి, ఎన్నో రకాల అనారోగ్య సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంతో పాటుగా మానసిక ఒత్తిడిని కూడా తొలగిస్తుంది. ఆఫీసులో ఏదైనా కారణం వల్ల మీరు ఒత్తిడికి గురైనప్పుడు వెంటనే కప్పు గ్రీన్ టీని తాగితే మానసిక స్థితి మెరుగుపడి గందర గోళం తొలగిపోతుందని నిపుణులు చెబుతున్నారు.

**సంగీతంతో సాంత్వన**

సంగీతం మనస్సును ప్రశాంతంగా మారుస్తుంది. అంతేకాదు ఇది ఒత్తిడి నుంచి తక్షణమే ఉపశమనం కలిగిస్తుంది. ఒత్తిడిస్థాయిలు ఎక్కువైనాయనిపించినప్పుడు వెంటనే మనసుకు నచ్చిన పాటలను వింటే సరి... ఎందుకంటే సంగీతం కోపాన్ని కూడా అదుపు చేస్తుంది. మనసుకు హాయిని కలిగిస్తుంది. దీంతో ఎలాంటి సమస్యనైనా పరిష్కరించగలిగే శక్తి వస్తుంది.

**పజిల్ గేమ్స్**

ఆఫీసులో పని ఒత్తిడి పెరిగినప్పుడు విసుగ్గా అనిపిస్తుంది. అందులో పని పూర్తికాకపోతే చిరాకు తోపాటుగా ఒత్తిడి కూడా పెరిగిపోతుంది. ఇక కొన్ని కారణాల వల్ల పై అధికారి పదిమందిలోనూ మీపై చిరాకు పడినప్పుడు ఒకవిధమైన మానసిక అస్థిరత ఏర్పడుతుంది. ఇలాంటి క్లిష్ట సమయాల్లోనే చాలా మంది తప్పుడు నిర్ణయాలను తీసుకుంటారు. లేదా మరింత ఎక్కువ ఒత్తిడికి గురవుతారు. ఈ ఒత్తిడి లేని పోని రోగాలకు దారితీస్తుంది. ఈ సమస్య నుంచి బయటపడటానికి పజిల్ గేమ్స్ మీకు బాగా ఉపయోగపడతాయి. ఒత్తిడిగా అనిపిస్తే కాసేపు ఆటలు ఆడండి. ఒత్తిడి కొన్ని సెకన్లలో పోతుంది.

**ఇష్టమైన వారితో గడపండి**

కొందరికి సంగీతం అంటే ఆసక్తి ఉండకపోవచ్చు. పజిల్ గేమ్స్ పూర్తి చేయలేకపోవచ్చు. అయితే ఇష్టమైన వాళ్లు అందరికీ ఉంటారు. అటువంటి వాళ్లతో కొద్దిసేపు నవ్వుతూ సరదాగా గడిపితే సరి... మానసిక ఒత్తిడి మటుమాయం అవుతుంది.

చివరగా ఒక విషయం ఏమిటంటే... ఒత్తిడిగా అనిపించినప్పుడు ఆ విషయాన్ని ఎవరితో ఒకరితో పంచుకోవాలి. ఆ భారం తీర్చుకునే మార్గం ఆలోచించాలి. లేదంటే ఒత్తిడి మనల్ని ఒత్తేస్తుంది.

## హెల్త్ టిప్
### గ్రీన్ గాడెస్ స్మూతీ



సన్నగా తరిగిన అర కప్పు లేత పాలకూర ఆకులు (బేబీ స్పినాచ్), నాలుగు పైనాపిల్ ముక్కలు, పావు కప్పు ఆవకాడో, అరకప్పు నీళ్లు తీసుకుని జ్యూసర్‌లో వేసి గ్రైండ్ చేసుకోవాలి. తరువాత ఈ జ్యూస్‌ను వడగట్టకుండా డైరెక్టుగా తాగాలి. గర్భిణులకు ఈ స్మూతీ అన్ని రకాల పోషకాలను అందిస్తుంది. ఎందుకంటే, లేత పాలకూర ఆకుల్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. పైనాపిల్‌లో విటమిన్ సి, ఆవకాడోలో మంచి కొవ్వులు ఉంటాయి.

# ఆరోగ్యానికి సీతాబలం




వినాయక చవితి నుంచి సంక్రాంతి వరకు విరివిగా లభించే సీజనల్ ఫ్రూట్స్‌లో సీతాఫలం ఒకటి. ఇందులో ఎన్నో పోషక విలువలు, విటమిన్లు, ఖనిజాలు ఉండటం వల్ల దీనిని పోషకాల ఘని అంటారు. సీతాఫలాలు చాలా రుచిగా ఉంటాయి కాబట్టి వీటిని ఇష్టపడని వారు దాదాపు ఉండరు. ఇవిగాక సీతాఫలం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం...

సీతాఫలం అల్సర్లను నయం చేయడంలో, అసిడిటీని నివారించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా ఇందులో ఉండే సూక్ష్మపోషకాలు చర్మాన్ని మృదువుగా చేస్తాయి. ఇది కంటి చూపును, కురుల అందాన్ని, మెదడు పనితీరునూ మెరుగుపరుస్తుంది. సీతాఫలంలోని ఐరన్ కంటెంట్ ఐరన్ లోపాన్ని తగ్గించి, హిమోగ్లోబిన్‌ను మెరుగుపరిచి రక్తహీనతను నివారించగలదు. సీతాఫలంలోని బయోయాక్టివ్ అణువులు, యాంటీ ఒబెసియోజెనిక్, యాంటీ డయాబెటిస్, క్యాన్సర్ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. సీతాఫలం గ్లైసెమిక్ ఇండెక్స్ 54, అంటే లో-గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉంటుంది. అందువల్ల డయాబెటిస్ ఉన్న వారు కూడా సీతాఫలం తినవచ్చు. అలాగే ఇందులో ఉండే ఫైబర్ కంటెంట్ మలబద్ధకాన్ని అరికడుతుంది. ఇందులో ఉండే పొటాషియం, మెగ్నీషియం హైబీపీని తగ్గిస్తుంది. సీతాఫలంలో ఫైబర్ ఎక్కువ ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచిదే. అయితే, ఇది అధిక కేలరీలను కలిగి ఉంటుంది కనుక మోతాదుకి మించి తీసుకోకూడదు.

## సినిమా

# మెగా మాస్ సాంగ్



● రవితేజ, చిరంజీవి

వీరయ్యతో కలిసి మాస్ స్టెప్పులు వేశారు రవితేజ. చిరంజీవి టైటిల్ రోల్‌లో, రవితేజ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'వాల్తేరు వీరయ్య'. కేఎస్ రవీంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శ్రుతీహాసన్ హీరోయిన్. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో వాల్తేరు వీరయ్య పాత్రలో కనిపిస్తారు చిరంజీవి. ఇందులో చిరంజీవి తమ్ముడి పాత్రలో పోలీసాఫీసర్‌గా రవితేజ నటించారని తెలిసింది. రీసెంట్‌గా ఓ భారీ సెట్‌లో చిరంజీవి, రవితేజలపై శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించారు. ''చిరంజీవి, రవితేజ అద్భుతమైన డ్యాన్సర్లు. వీరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ మెగా మాస్ సాంగ్ ఆడియన్స్‌ను అలరిస్తుంది''అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, సహ నిర్మాతలు: జీకే మోహన్, ఎం.ప్రవీణ్, లైన్ ప్రొడ్యూసర్: కేవీవీ బాలసుబ్రహ్మణ్యం.


# వండర్ ఉమెన్!



● నిత్యామీనన్

మలయాళ హీరోయిన్లు నిత్యామీనన్, పార్వతిలు ప్రెగ్నెన్సీ కిట్ ఫొటోలను వారి సోషల్ మీడియా అకౌంట్స్‌లో షేర్ చేయడం చర్చనీయాంశమైంది. కొందరు నెటిజన్లు, మరికొందరు సినిమా తారలు సోషల్ మీడియా వేదికగా వీరిద్దరికీ శుభాకాంక్షలు కూడా తెలిపారు. అయితే వీరిద్దరూ ఆ ప్రెగ్నెన్సీ కిట్ ఫొటోలను 'వండర్ ఉమెన్' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగానే షేర్ చేశారనే టాక్ మాలీవుడ్‌లో వినిపిస్తోంది. ప్రెగ్నెన్సీ ఉమెన్స్ జీవితాల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కించారట. 'బెంగళూరు డేస్'(2014) ఫేమ్ అంజలీ మీనన్ దర్శకత్వం వహించారని టాక్. కాగా 'బెంగళూరు డేస్' చిత్రం తర్వాత నిత్యామీనన్, పార్వతి కలిసి నటిస్తున్న చిత్రం 'వండర్ ఉమెన్' కావడం విశేషం.

# జెట్ స్పీడ్



● రజనీకాంత్

ఏడు పదుల వయసులో కూడా రజనీకాంత్ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నారు. వరుస సినిమాలకు సైన్ చేస్తూ యువ హీరోలకు గట్టి పోటీ ఇస్తున్నారు. ప్రస్తుతం నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో 'జైలర్' అనే సినిమాతో బిజీగా ఉన్న రజనీకాంత్ తాజాగా మరో రెండు సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ రెండు చిత్రాలను ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ నిర్మించనుండటం విశేషం. ఈ చిత్రాలపై శుక్రవారం అధికారిక ప్రకటన వెల్లడైంది. ఈ సినిమాలకు సంబంధించిన పూజా కార్యక్రమాలు నవంబరు 5న చెన్నైలో జరగనున్నాయి. ఈ మూవీస్ తెరకెక్కించనున్న దర్శకుల జాబితాలో సిబి చక్రవర్తి, దేసింగు పెరియస్వామి పేర్లు తెరపైకి వచ్చాయి. వీరితో పాటు ప్రముఖ దర్శకుడు మణిరత్నం, 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ కూడా రజనీకి కథలు వినిపించారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. కాగా రజనీకాంత్ హీరోగా నటించిన 'రోబో 2.0', 'దర్బార్' సినిమాలను లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన సంగతి తెలిసిందే.

# చిట్టి కాదు.. వసుధ కనిపిస్తుంది

**- ఫరియా అబ్దుల్లా**



''జాతిరత్నాలు' లో నేను చేసిన చిట్టి పాత్రని అందరూ అభిమానించారు. ఈ విషయంలో ఆనందంతో పాటు బాధ్యత కూడా పెరిగింది. 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్' సినిమాలో చిట్టి కాదు.. నేను చేసిన వసుధ పాత్ర మాత్రమే కనిపిస్తుంది'' అని ఫరియా అబ్దుల్లా అన్నారు. సంతోష్ శోభన్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్'. వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ సినిమా నవంబర్ 4న విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్ర హీరోయిన్ ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ– ''నాకు ప్రయాణం అంటే చాలా ఇష్టం. ఈ చిత్ర కథ ప్రయాణం నేపథ్యంలో ఉంటుంది. నేను ట్రావెల్ వ్లాగర్‌గా కనిపిస్తాను. నా నిజ జీవితంలో మొదటి విదేశీ ప్రయాణం ఈ సినిమా వల్లే జరిగింది. థాయిలాండ్‌లో ఒక పాట షూటింగ్ చేయడం మరచిపోలేని జ్ఞాపకం. ఈ సినిమా షూటింగ్ కోసం 20రోజులు అడవిలోనే ఉన్నాం. మొబైల్ సిగ్నల్ కూడా లేదు. ఈ మూవీలో యాక్షన్, చేజింగ్ సీన్లు కూడా ఉన్నాయి. మొత్తంగా ఈ మూవీ 'ఖత్రోన్ కే ఖిలాడీ' లాంటి మంచి అనుభవం ఇచ్చింది (నవ్వుతూ). 'జాతిరత్నాలు' సినిమాలాగానే ఈ సినిమా కూడా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. నేను హీరోయిన్‌గా నటించిన 'జాతిరత్నాలు, లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్' చిత్రాల ట్రైలర్స్‌ని ప్రభాస్‌గారు విడుదల చేయడం అదృష్టంగా భావిస్తున్నా. సంతోష్ శోభన్ చాలా హార్డ్ వర్క్ చేస్తాడు. మేర్లపాక గాంధీగారితో పని చేయడం డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్. మరో ఐదేళ్లలో పాన్ వరల్డ్ స్థాయిలో నాకు గుర్తింపు రావాలని కోరుకుంటున్నాను. నాకు దర్శకత్వంపై ఆసక్తి ఉంది.. అందుకు మరో పదేళ్లు పడుతుంది. ప్రస్తుతం రవితేజగారితో 'రావణాసుర', ఓ తమిళ్ మూవీ, ఓ హిందీ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నా'' అన్నారు.

# ఊర్వశి స్పెషల్



● ఊర్వశి రౌతేలా, రామ్

బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేలా స్పెషల్ డ్యాన్స్ మూమెంట్స్‌తో అదరగొట్టారట. రామ్ హీరోగా బోయపాటి శీను దర్శకత్వంలో ఓ సినిమా రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. ఇందులో శ్రీలీల హీరోయిన్. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో ఇటీవల మొదలైంది. తాజాగా ఓ స్పెషల్ సాంగ్‌ను కంప్లీట్ చేశారు చిత్రయూనిట్. బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేలా ఈ సాంగ్‌లో రామ్‌తో కలిసి స్టెప్పులేశారు. ఈ సినిమాను వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నారు. మరోవైపు ఊర్వశీ రౌతేలా ప్రధాన పాత్రలో నటించిన 'బ్లాక్ రోజ్' చిత్రం విడుదల కావాల్సి ఉంది. దర్శకుడు సంపత్ నంది కథ అందించిన ఈ సినిమాకి మోహన్ భరద్వాజ్ దర్శకత్వం వహించారు.

# థ్రిల్లర్ నేపథ్యంలో...



● సూర్య, హెబ్బాపటేల్

హెబ్బా పటేల్ లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'బ్లాక్ అండ్ వైట్'. ఎల్ఎన్‌వీ సూర్య ప్రకాష్ దర్శకత్వం వహించారు. ఎ.మేఘనా రెడ్డి సమర్పణలో ఎస్ఆర్ ఆర్ట్స్, ఏయూ అండ్ ఐ స్టూడియోస్‌పై పద్మనాభ రెడ్డి, సందీప్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను ప్రముఖ రచయిత, రాజ్యసభ సభ్యులు వి.విజయేంద్ర ప్రసాద్ విడుదల చేసి, సినిమా హిట్ కావాలని ఆకాంక్షించారు. ''నో కమిట్‌మెంట్, నో కంట్రోల్, నో రిస్ట్రిక్షన్స్.. లెట్స్ సెలబ్రేట్ యువర్ ఫ్రీడమ్''అంటూ హెబ్బాపటేల్ చెప్పే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ''థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. యువతకు నచ్చే అంశాలు కూడా ఉన్నాయి. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్ అరసాడ, నేపథ్య సంగీతం: అషీర్ లూక్, డి.సుమన్, కెమెరా: టి. సురేంద్రా రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మనోజ్ మావిళ్ల.

# ఫైటర్ మళ్లీ వాయిదా



● హృతిక్

'వార్' (2019) సినిమా తర్వాత హీరో హృతిక్‌రోషన్, దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా సినిమా 'ఫైటర్'. దీపికా పదుకొనే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో అనిల్ కపూర్ ఓ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇందులో హృతిక్, దీపిక ఎయిర్‌ఫోర్స్ పైలెట్స్‌గా కనిపిస్తారు. అయితే ఈ సినిమా రిలీజ్ తేదీ మరోమారు మారింది. తాజాగా 'ఫైటర్' సినిమాను జనవరి 25, 2024న రిలీజ్ చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు మేకర్స్. తొలుత 'ఫైటర్' సినిమాను 2023 జనవరిలో, ఆ తర్వాత సెప్టెంబరులో రిలీజ్ చేస్తామని చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి గుర్తుండే ఉంటుంది.

# పసివాడి యానిమేషన్



● వంశీ, ఇతి

అల్లు వంశీ, ఇతి ఆచార్య జంటగా నటించిన చిత్రం 'పసివాడి ప్రాణం'. ఎన్ఎస్ మూర్తి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం నవంబరులో రిలీజ్ కానుంది. మూర్తి మాట్లాడుతూ– ''లైవ్ కమ్ యానిమేషన్ ఫిల్మ్ ఇది. యానిమేషన్ టెక్నాలజీతో రూపొందించబడిన త్రీడీ టెడ్డీ బేర్, టూడీ బేబీ క్యారెక్టర్స్ ఆకట్టుకుంటాయి. చిరంజీవిగారి 'పసివాడి ప్రాణం' సినిమాలో అప్పటి పసివాడిగా నటించిన సుజితగారు ఈ సినిమాలో తల్లి పాత్రలో నటించారు. మా సినిమా కథకు తగ్గట్టే 'పసివాడి ప్రాణం' అనే టైటిల్ ఖరారు చేశాం'' అన్నారు. ''నాకు హీరోగా అవకాశం ఇచ్చిన మూర్తిగారికి ధన్యవాదాలు. మా సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు అల్లు వంశీ. ఈ సినిమాకు సంగీతం: జీజే కార్తికేయన్.

# సస్పెన్స్ డ్రామా



● గార్గేయి

గార్గేయి యల్లాప్రగడ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'హలో మీరా'. శ్రీనివాసు కాకర్ల దర్శకత్వం వహించారు. జీవన్ కాకర్ల సమర్పణలో డా.లక్ష్మణరావు దిక్కల, వరప్రసాదరావు దుంపల, పద్మ కాకర్ల నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ని డైరెక్టర్ హరీష్ శంకర్ విడుదల చేశారు. ''తెల్లవారితే పెళ్లి పీటలు ఎక్కాల్సిన మీరా పెళ్లి వద్దనుకుని కారులో హైదరాబాద్ బయలుదేరుతుంది. ఆ తర్వాత మీరా పరిస్థితి ఏంటి? అన్నది ఆసక్తిగా ఉంటుంది. సస్పెన్స్ డ్రామా, థ్రిల్లర్‌గా ఈ సినిమా ఉంటుంది. అతి త్వరలో మూవీ రిలీజ్‌కి సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఎస్. చిన్న, కెమెరా: ప్రశాంత్ కొప్పినీడి.

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 203 | 59,960 |
| నిఫ్టీ ▲ | 50 | 17,787 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

| విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 11,062 | ▲ | 270 |
| డోజోన్స్ | 32,800 | ▲ | 767 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,048 | ▽ | 26 |
| డాక్స్ | 13,243 | ▲ | 32 |
| షాంఘై | 2,916 | ▽ | 67 |
| నికాయ్ | 27,105 | ▽ | 240 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

| బులియన్ (రూ.లలో) ముంబై | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 50,502 ▽ | 277 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 50,300 ▽ | 276 |
| వెండి (కిలో) | 57,419 ▽ | 221 |



# కథ కంచికి...
# 'పిట్ట' మస్క్ గూటికి!



- ట్విటర్ కొనుగోలు పూర్తి చేసిన ఎలాన్ మస్క్
- 'పక్షికి స్వేచ్ఛ' ఇచ్చానంటూ ట్వీట్
- సీఈవో సహా నలుగురు ఎగ్జిక్యూటివ్‌లపై వేటు
- స్టాక్ ఎక్స్ఛేంజీల్లో షేరు ట్రేడింగ్ నిలిపివేత

**న్యూయార్క్:** దాదాపు ఆరేడు నెలలకు పైగా నడుస్తున్న మస్క్–ట్విటర్ ప్రహసనానికి ఎట్టకేలకు తెరపడింది. ముందుగా ఇచ్చిన 44 బిలియన్ డాలర్ల ఆఫర్ మేరకు మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విటర్‌ను అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ కొనుగోలు చేశారు. డీల్ పూర్తయిన వెంటనే తన ప్రణాళికలను కూడా చకచకా అమలు చేయడం ప్రారంభించారు. ఈ మొత్తం వ్యవహారంలో తనను బాగా ఇబ్బంది పెట్టారని భావిస్తున్న ట్విటర్ సీఈవో పరాగ్ అగ్రవాల్, లీగల్ ఎగ్జిక్యూటివ్ విజయ గద్దెతో పాటు సీఎఫ్‌వో నెడ్ సెగాల్, జనరల్ కౌన్సిల్ షాన్ ఎడ్జెట్‌లపై తక్షణం వేటు వేశారు. వారిలో ఒకరిని అవమానకరమైన రీతిలో .. ట్విటర్ ఆఫీసు నుండి దాదాపు గెంటివేసినంత పని చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తాజా పరిణామంతో ట్విటర్ వ్యాపారం, ఉద్యోగులు, వాటాదారుల భవిష్యత్‌పై కొన్నాళ్లుగా నెలకొన్న అనిశ్చితికి తెరపడినట్లయింది. కానీ, కంపెనీని కొంటే 75 శాతం మందిని తీసేస్తానంటూ మస్క్ గతంలో చేసిన ప్రకటనతో ఉద్యోగుల్లో ఇంకా భయాందోళనలు నెలకొన్నాయి. అయితే, అలాంటిదేమీ ఉండబోదంటూ మస్క్ హామీ ఇచ్చే ప్రయత్నం చేశారు. మరోవైపు, మస్క్ చేతికి చేరిన నేపథ్యంలో శుక్రవారం నుండి ట్విటర్ షేర్లలో ట్రేడింగ్ నిల్చిపోయింది.

**ముందుకి .. వెనక్కి ..**

ఈ ఏడాది జనవరి నుంచి ట్విటర్‌లో కొద్దికొద్దిగా షేర్లు కొనుక్కుంటూ వచ్చిన మస్క్ ... ఏప్రిల్ నాటికి 3 బిలియన్ డాలర్ల విలువ చేసే 9 శాతం పైగా వాటాలు దక్కించుకున్నారు. అదే నెలలో షేరు ఒక్కింటికి 54.20 డాలర్లు ఇచ్చి 44 బిలియన్ డాలర్లకు కంపెనీని కొనేస్తానంటూ ఆఫర్ ఇచ్చారు. దీనిపై కొంత ఊగిసలాడిన ట్విటర్ ఆ తర్వాత ఆఫర్‌కు అంగీకరించింది. అయితే, ఆఫర్ ఇచ్చేసినప్పటికీ ఆ తర్వాత ఏదో రకంగా దీన్నుంచి బైటపడేందుకు మస్క్ అన్ని ప్రయత్నాలు చేశారు. నకిలీ ఖాతాల వివరాలు ఇవ్వడం లేదంటూ ఒకసారి, కంపెనీ విధానాల్లో లొసుగులపై ప్రజావేగు ఆరోపణలను అడ్డం పెట్టుకుని మరోసారి .. డీల్‌ను రద్దు చేసుకుంటానంటూ ప్రకటనలు చేశారు. దీంతో మస్క్‌ను ట్విటర్ న్యాయస్థానానికి లాగింది. 'తన వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగపడదనే ఉద్దేశంతోనే ట్విటర్, దాని షేర్‌హోల్డర్లకు ఇచ్చిన మాటను మస్క్ తప్పుతున్నారు' అని ఆరోపించింది. దీనికి మస్క్ కూడా కౌంటర్ పిటీషన్ వేశారు. ఈ వివాదం అటు తిరిగి ఇటు తిరిగి అక్టోబర్‌లో విచారణకు వచ్చింది. ఈ దశలో తనపై వేసిన దావాను వెనక్కి తీసుకుంటే అప్పట్లో చెప్పిన రేటు ప్రకారమే కొంటానంటూ ట్విటర్‌కు మస్క్ మరో ఆఫర్ ఇచ్చారు. కానీ డీల్‌ను మరింత జాప్యం చేసేందుకే ఆయన దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారంటూ ట్విటర్ లాయర్లు అభ్యంతరం చెప్పారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 28లోగా డీల్ సంగతి తేల్చాలని, లేకపోతే తదుపరి నవంబర్‌లో విచారణ ఎదుర్కొనాల్సి వస్తుందంటూ మస్క్‌కు న్యాయస్థానం స్పష్టం చేసింది.

**మంచి రోజులు..**

గురువారం పొద్దుపోయాకా టేకోవర్‌ను పూర్తి చేసిన మస్క్ .. ట్విటర్ లోగో అయిన 'పిట్ట'ను తలపించేలా 'పక్షికి స్వేచ్ఛ' ఇచ్చానంటూ ట్వీట్ చేశారు. అంతకుముందు బుధవారం రోజున చేతిలో 'వాష్ బేసిన్ సింకు' పట్టుకుని, స్వయంగా ట్విటర్ కార్యాలయానికి వెళ్లి మస్క్ .. అక్కడ హల్‌చల్ చేశారు. ఆపైన ప్రకటనకర్తలను ఉద్దేశించి కూడా ఒక సందేశం పంపారు. హింసకు తావు లేకుండా ఎలాంటి విషయంపై అయినా ఆరోగ్యకరమైన చర్చ జరిగే వేదికగా తీర్చిదిద్దేందుకే ట్విటర్‌ను తాను కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. టేకోవర్ పూర్తయ్యాక శుక్రవారం రోజున 'ఇక నుంచి అన్నీ మంచి రోజులే' అంటూ మరో ట్వీట్ చేశారు.

**నిబంధనలు పాటించాల్సిందే: భారత్**

ట్విటర్ ఎవరి చేతిలో ఉన్నా భారత్‌లో కార్యకలాపాలు సాగించాలంటే నిబంధనల ప్రకారం పని చేయాల్సిందేనని కేంద్రం స్పష్టం చేసింది. కంపెనీని మస్క్ టేకోవర్ చేసినంత మాత్రాన దేశంలో నిబంధనలు మారిపోవని ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ పేర్కొన్నారు. సోషల్ మీడియా కంపెనీలకు భారత్ భారీ మార్కెట్‌గా ఉంటోంది. అయితే, ఇటీవలి కొత్త ఐటీ నిబంధనల విషయంలో ట్విటర్‌కి, ప్రభుత్వానికి మధ్య విభేదాలు తలెత్తాయి. టెస్లా కార్ల దిగుమతి సుంకాలు, స్టార్‌లింక్ శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సర్వీసుల విషయంలో భారత ప్రభుత్వంతో మస్క్‌కు కూడా విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**మీమ్స్ వెల్లువ..**

మస్క్–ట్విటర్ డీల్‌పై సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువెత్తాయి. ట్విటర్‌ను కొనేస్తే 75 శాతం మంది ఉద్యోగులను తీసేస్తానంటూ మస్క్ చేసిన ప్రకటన వీటికి ప్రధాన థీమ్‌గా నిల్చింది. మస్క్‌ను థానోస్ (హాలీవుడ్ 'అవెంజర్స్' సినిమాలో విలన్)తో పోలుస్తూ .. ట్విటర్ ఉద్యోగులు ఒక్కొక్కరిపైనా వేటు వేస్తున్నట్లు ఒక మీమ్ వచ్చింది. అలాగే పక్షులను ఒక్కొక్కటిగా పంజరాల్లోంచి విడుదల చేస్తున్నట్లు ఒకటి రాగా .. బాలీవుడ్ నటుడు గోవిందాను అనుకరిస్తూ ఉద్యోగులందరినీ తీసేస్తున్నట్లు మరొకటి వచ్చింది. ట్విటర్‌ను విడిచిపెట్టకుండా కంపెనీ ఆఫీసు ముందే పరాగ్ అగ్రవాల్ ఒక స్వీట్ షాపు పెట్టినట్లు ఇంకొక మీమ్ దర్శనమిచ్చింది.

## పరాగ్, విజయ అంటే అందుకే అయిష్టం..



పరాగ్ నెడ్ సెగాల్ విజయ ఎడ్జెట్

మస్క్ చేతికి ట్విటర్ వచ్చిన వెంటనే ఉద్వాసనకు గురైన పరాగ్ అగ్రవాల్ .. గతేడాది నవంబర్‌లోనే సంస్థ సహ–వ్యవస్థాపకుడు జాక్ డోర్సే స్థానంలో సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. బాంబే ఐఐటీలోనూ, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలోనూ విద్యాభ్యాసం చేసిన అగ్రవాల్ .. దాదాపు దశాబ్దం క్రితం ట్విటర్‌లో చేరారు. తర్వాత సీఈవోగా ఎదిగారు. ట్విటర్ టేకోవర్ వ్యవహారంలో మస్క్‌తో బహిరంగంగాను, ప్రైవేట్‌గాను అగ్రవాల్ పోరాటం సాగించారని, అందుకే ఆయనపై మస్క్ కత్తిగట్టారని న్యూయార్క్ టైమ్స్ పోస్ట్ పేర్కొంది. అలాగే హైదరాబాదీ అయిన లీగల్ ఎగ్జిక్యూటివ్ విజయ గద్దె (48) విషయానికొస్తే .. అభ్యంతరకర ట్వీట్లు చేస్తున్నారంటూ ఏకంగా అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖాతాను రద్దు చేయడం ద్వారా ఆమె వార్తల్లోకెక్కారు. 'కంటెంట్‌ను క్రమబద్ధీకరించడంలో ట్విటర్ నిర్ణయాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నారు' అంటూ విజయపై కూడా మస్క్ విమర్శలు గుప్పించారు. కంపెనీ తన చేతికి వచ్చీ రాగానే ఆమెను తప్పించారు. అయితే, ఉద్వాసనకు గురైన టాప్ ఎగ్జిక్యూటివ్‌లకు భారీగానే పరిహారం ముట్టనుంది. వారి వాటాలను కొనుగోలు చేసేందుకు, అర్ధాంతరంగా తొలగించినందుకు గాను పరిహారం కింద ఆయా ఉద్యోగులకు మస్క్ దాదాపు 200 మిలియన్ డాలర్లు చెల్లించుకోవాల్సి రానుంది. అత్యధికంగా విజయకు 74 మిలియన్ డాలర్లు, అగ్రవాల్‌కు 65 మిలియన్ డాలర్లు, సెగాల్‌కు 66 మిలియన్ డాలర్లు లభించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

# స్వల్ప లాభాలతో సరి




సెన్సెక్స్, నిఫ్టీ 0.3 శాతం అప్

**ముంబై:** విదేశీ ఇన్వెస్టర్ల అండతో ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాలతో శుక్రవారం ముగిశాయి. విదేశీ ఇన్వెస్టర్లు వరుసగా రెండో రోజు ఈక్విటీల్లో నికరంగా కొనుగోళ్లు చేశారు. గురువారం రూ.2,818 కోట్ల మేర ఈక్విటీలను కొనుగోలు చేసిన విదేశీ ఇన్వెస్టర్లు.. రెండో రోజు రూ.1,569 కోట్లను నికరంగా ఇన్వెస్ట్ చేశారు. దీంతో ప్రధాన సూచీలు 0.30 శాతం మేర లాభపడ్డాయి. సెన్సెక్స్ 203 పాయింట్లు (0.34 శాతం) లాభపడి రూ.59,960 పాయింట్ల వద్ద క్లోజ్ అయింది. ఇంట్రాడేలో 376 పాయింట్ల వరకు లాభపడింది. నిఫ్టీ 50 పాయింట్లు పెరిగి (0.28 శాతం) 17,787 వద్ద ముగిసింది. మారుతీ సెప్టెంబర్ త్రైమాసికం ఫలితాలు అంచనాలను మించడంతో షేరు ధర 5 శాతం వరకు ర్యాలీ చేసింది. దీనికితోడు అధిక వెయిటేజీ ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ సైతం 3 శాతం లాభపడి రూ.2,526కు చేరుకోవడం లాభాలకు సాయపడింది. ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్, కోటక్ మహీంద్రా బ్యాంకు లాభాలను ఆర్జించాయి.

# డాక్టర్ రెడ్డీస్ లాభం రూ. 1,113 కోట్లు

- క్యూ2లో 12%వృద్ధి
- ఆదాయం 9% అప్; రూ. 6,306 కోట్లు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** దేశీ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 1,113 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో నమోదైన రూ. 992 కోట్లతో పోలిస్తే ఇది 12% అధికం. అటు ఆదాయం 9% పెరిగి రూ. 5,763 కోట్ల నుంచి రూ. 6,306 కోట్లకు చేరింది. శుక్రవారం ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా సీఈవో ఎరెజ్ ఇజ్రేలీ, సీఎఫ్‌వో పరాగ్ అగర్వాల్ ఈ విషయాలు తెలిపారు. అమెరికా మార్కెట్లో ఎక్స్‌క్లూజివ్ హక్కులు లభించిన జనరిక్ ఔషధం రెవ్‌లిమిడ్ సహా కొత్తగా ప్రవేశపెట్టిన ఉత్పత్తుల ఊతంతో





ఆదాయాలు, లాభాలు గణనీయంగా పెరిగాయని పరాగ్ వివరించారు. అలాగే వ్యయాలను సమర్థంగా నియంత్రించుకోవడం కూడా దోహదపడిందని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 25 పైగా కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. మరోవైపు, రెండో త్రైమాసికంలో పటిష్టమైన పనితీరు సాధించడం సంతృప్తి కలిగించిందని సంస్థ సహ–చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు. అంతర్జాతీయంగా చౌకగా మరిన్ని ఔషధాలను అందుబాటులోకి తేవడంపై మరింతగా దృష్టి పెట్టనున్నట్లు ఆయన వివరించారు. ఇందులో భాగంగా కొనసాగిస్తున్న పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై రెండో త్రైమాసికంలో కంపెనీ సుమారు రూ. 490 కోట్లు వెచ్చించింది.

**ఫలితాల్లో ఇతర విశేషాలు..**

- క్యూ2లో గ్లోబల్ జనరిక్స్ ఆదాయాలు 18 శాతం పెరిగి రూ. 5,595 కోట్లకు చేరాయి. ఉత్తర అమెరికా మార్కెట్లో అమ్మకాలు 48 శాతం వృద్ధి చెంది రూ. 2,800 కోట్లకు పెరిగాయి. కొన్ని ఔషధాల రేట్లు తగ్గినప్పటికీ .. కొత్త ఉత్పత్తులు, సానుకూల ఫారెక్స్ రేట్ల ప్రభావంతో కంపెనీ ఆ ప్రతికూలతలను అధిగమించింది.
- భారత మార్కెట్లో అమ్మకాలు స్వల్పంగా పెరిగి రూ. 1,150 కోట్లకు పరిమితమయ్యాయి.
- ఫార్మా సర్వీసెస్, యాక్టివ్ ఇంగ్రీడియంట్స్ (పీఎస్ఏఐ) విభాగం 23 శాతం క్షీణించి రూ. 643 కోట్లకు తగ్గింది.

శుక్రవారం బీఎస్‌ఈలో కంపెనీ షేరు స్వల్పంగా తగ్గి రూ. 4,461 వద్ద క్లోజయ్యింది.

---

**సాక్షి స్పోర్ట్స్**

**ముంబై చేతిలో కేరళ ఓటమి**

ఇండియన్ సూపర్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ముంబై సిటీ ఎఫ్‌సీ అజేయంగా దూసుకెళుతోంది. కేరళ బ్లాస్టర్స్‌ను వారి సొంతగడ్డపైనే ముంబై ఓడించింది. కొచ్చిలో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ముంబై సిటీ 2–0తో కేరళను కంగు తినిపించింది. ముంబై తరఫున మెహతాబ్ (22వ ని.), పెరేరా దియాజ్ (31వ ని.) చెరో గోల్ చేయడంతో ఆట అర్ధభాగంలోనే ముంబై 2–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ద్వితీయార్ధంలో ప్రత్యర్థి స్ట్రయికర్లకు చెక్ పెట్టడంతో ముంబై విజయం సాధించింది. ఈ టోర్నీలో 4 మ్యాచ్‌లాడిన ముంబై సిటీ ఎఫ్‌సీ రెండింటిలో గెలుపొందగా, మరో రెండు మ్యాచ్‌ల్ని డ్రా చేసుకుంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో గోవాతో హైదరాబాద్, ఈస్ట్ బెంగాల్‌తో ఏటీకే మోహన్ బగాన్ తలపడతాయి.



# వాన వాన... రద్దు రద్దు





- ఆసీస్‌తో ఇంగ్లండ్, అఫ్గాన్‌తో ఐర్లాండ్ మ్యాచ్‌లు వర్షార్పణం
- ప్రపంచకప్ మెరుపులకు చినుకుల దెబ్బ



ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్‌తో ఆస్ట్రేలియా కెప్టెన్ ఫించ్

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియాలో కురుస్తున్న అకాల వర్షాలు యావత్ క్రికెట్ ప్రియుల్ని నిరాశకు గురి చేస్తున్నాయి. క్రేజీ టి20 ప్రపంచకప్‌కు పదే పదే వరుణుడు అడ్డుతగలడం... అనామక మ్యాచ్‌లతో పాటు రక్తి కట్టించే మ్యాచ్‌లు కూడా రద్దవడం అభిమానులకు ఆనందం దూరం చేస్తోంది. తాజాగా సూపర్–12లోని గ్రూప్–1లో శుక్రవారం రెండు మ్యాచ్‌లు జరగాల్సివుండగా... ఆ రెండూ రద్దయ్యాయి. ఇప్పటివరకు మెగా ఈవెంట్‌లో 13 మ్యాచ్‌లు జరిగితే ఏకంగా ఐదు మ్యాచ్‌లపై వర్షం ప్రభావం చూపింది. ఇందులో 4 మ్యాచ్‌లైతే పూర్తిగా రద్దయ్యాయి. ఒక మ్యాచ్‌కు అంతరాయం ఎదురైనా 'డక్‌వర్త్ లూయిస్' ఫలితంతో బయటపడింది. టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో ఓడిన ఆతిథ్య ఆస్ట్రేలియాకు, డక్‌వర్త్‌తో క్రికెట్ కూన ఐర్లాండ్ చేతిలో ఓడిన ఇంగ్లండ్‌కు గ్రూప్–1లో శుక్రవారం కీలకమైన మ్యాచ్ జరగాల్సింది. దెబ్బతిన్న చిరకాల ప్రత్యర్థుల మధ్య ఆసక్తికర పోరు జరగడం ఖాయమని క్రికెట్ విశ్లేషకులంతా భావించారు. ఈ గ్రూప్‌ను శాసించే మ్యాచ్ అవుతుందనుకుంటే... వర్షంలో నిండా మునిగిపోయింది. ఇంగ్లండ్‌పై సంచలన విజయం సాధించిన ఐర్లాండ్‌తో అఫ్గానిస్తాన్ మ్యాచ్ కూడా రద్దవడం ఇరు జట్లను తీవ్రంగా నిరాశపరిచింది. గ్రూప్–1లో అఫ్గాన్ అంతటి బాధ ఇంకెవరికీ లేదు. జరగాల్సిన రెండు మ్యాచ్‌లు వర్షం ఖాతాలో పడిపోయాయి. ఈ గ్రూపులోని ఆరు జట్లలో ఒక్క శ్రీలంక మాత్రమే వాన బాధితుల జాబితాలో లేదు. కివీస్, ఇంగ్లండ్, ఆసీస్, ఐర్లాండ్, అఫ్గాన్‌లను వాన ఇబ్బంది పెట్టింది. పాయింట్ల పట్టికలో ఈ ఐదు జట్లు 'ఫలితం తేలని' రికార్డులో నిలిచాయి.

**ఎంసీజీలో ఆట ఎలా!**

ఆస్ట్రేలియాలోనే సుప్రసిద్ధ వేదిక మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ). కానీ ఇప్పుడిదే ఈ ప్రపంచకప్‌కు కంటగింపుగా మారింది. 90 వేల పైచిలుకు సామర్థ్యమున్న ఈ ప్రధాన స్టేడియంలో పొట్టి మెరుపులు చూద్దామని పట్టుబట్టి టిక్కెట్లు కొనుగోలు చేసిన ప్రేక్షకులకు తీరా మైదానానికి వచ్చే సరికి చినుకులు ఎదురవుతున్నాయి. క్రికెట్‌ను ఆస్వాదించాలన్న ఆశలపై వరుణుడు అదే పనిగా నీళ్లుజల్లుతున్నాడు. పూర్తిగా రద్దయిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడు ఇక్కడ జరగాల్సినవే కాగా ఒకటి హోబర్ట్‌లో రద్దయింది. భారతీయులు అత్యధికంగా ఉండే సిడ్నీని కాదని దాయాదుల సమరానికి క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఎంచుకున్న మైదానం ఎంసీజీ. అయితే మ్యాచ్‌కు ముందు వర్షభయమున్నప్పటికీ ఇండో–పాక్ సమరం జరగడం... ఫైనల్‌ను మించిన వినోదం అందించడం సీఏకు అత్యంత ఊరటనిచ్చే అంశం. అయితే ఇంగ్లండ్‌తో తమ జట్టుకు శుక్రవారం ఏర్పాటు చేసిన మ్యాచ్ కూడా వర్షం ఖాతాలో పడటమే సీఏను ఇబ్బంది పెడుతోంది. అన్నట్లు ఫైనల్‌కు కూడా ఎంసీజీనే వేదిక. రిజర్వ్ డే ఉన్నప్పటికీ సూపర్–12 దశలో వరుసగా 26, 28 తేదీల్లో జరగాల్సిన మూడు మ్యాచ్‌ల్ని తుడిచిపెట్టేయడం క్రికెట్ వర్గాల్లో 'ఫైనల్' బెంగను పెంచుతోంది. ఆసక్తికర అంశం ఏమిటంటే ఈ మూడు మ్యాచ్‌లకు ముందు ఎంసీజీలో 667 టి20 మ్యాచ్‌లు జరగ్గా... ఒకే ఒక్క మ్యాచ్, అదీ 2007లో మాత్రమే రద్దయింది.

**టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక**

| గ్రూప్–1 | | | | | | |
|---|---|---|---|---|---|---|
| జట్టు | మ్యా | గె | ఓ | ర | పా | నె.ర. |
| న్యూజిలాండ్ | 2 | 1 | 0 | 1 | 3 | 4.450 |
| ఇంగ్లండ్ | 3 | 1 | 1 | 1 | 3 | 0.231 |
| ఐర్లాండ్ | 3 | 1 | 1 | 1 | 3 | -1.169 |
| ఆస్ట్రేలియా | 3 | 1 | 1 | 1 | 3 | -1.555 |
| శ్రీలంక | 2 | 1 | 1 | 0 | 2 | 0.450 |
| అఫ్గానిస్తాన్ | 3 | 0 | 1 | 2 | 2 | -0.620 |
| **గ్రూప్–2** | | | | | | |
| జట్టు | మ్యా | గె | ఓ | ర | పా | నె.ర. |
| భారత్ | 2 | 2 | 0 | 0 | 4 | 1.425 |
| దక్షిణాఫ్రికా | 2 | 1 | 0 | 1 | 3 | 5.200 |
| జింబాబ్వే | 2 | 1 | 0 | 1 | 3 | 0.050 |
| బంగ్లాదేశ్ | 2 | 1 | 1 | 0 | 2 | -2.375 |
| పాకిస్తాన్ | 2 | 0 | 2 | 0 | 0 | -0.050 |
| నెదర్లాండ్స్ | 2 | 0 | 2 | 0 | 0 | -1.625 |

నోట్: మ్యా-మ్యాచ్‌లు, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర-నెట్ రన్‌రేట్

**టి20 ప్రపంచకప్‌లో నేడు**

న్యూజిలాండ్ X శ్రీలంక (మ.గం. 1:30 నుంచి)
వేదిక: సిడ్నీ
స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

# భారత్ శుభారంభం

ప్రొ లీగ్ హాకీ





**భువనేశ్వర్:** ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీ టోర్నీని భారత జట్టు విజయంతో మొదలు పెట్టింది. న్యూజిలాండ్‌తో శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 4–3 గోల్స్ తేడాతో విజయాన్ని అందుకుంది. ఒక దశలో 2–3తో వెనుకబడినా... కోలుకొని భారత్ చివరకు విజేతగా నిలవడం విశేషం. భారత్ తరఫున మన్‌దీప్ మోర్ (13వ నిమిషం), హర్మన్‌ప్రీత్ సింగ్ (41) రెండు గోల్స్ చేయగా... స్యామ్ లేన్ (23వ నిమిషం, 35) రెండు గోల్స్, జేక్ స్మిత్ (34) ఒక గోల్ సాధించారు. ఫలితంగా మూడో క్వార్టర్ ముగిసే సరికి కివీస్ 3–2తో ముందంలో ఉంది. అయితే నాలుగో క్వార్టర్‌లో చెలరేగిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మన్‌దీప్ సింగ్ 51వ, 56వ నిమిషాల్లో గోల్స్ సాధించి జట్టు గెలుపు బాట పట్టించాడు. ఇరు జట్లు అటాకింగ్‌కు ప్రాధాన్యత నివ్వగా, అర్ధ భాగం ముగిసే సరికి స్కోరు 1–1తో సమమైంది. మూడో క్వార్టర్ చివర్లో సుమీత్‌కు ఎల్లో కార్డు చూపించడంతో 10 నిమిషాలు అతను ఆటకు దూరం కాగా 10 మందితోనే భారత్ పోరాడింది.

**జైపూర్‌పై తలైవాస్ గెలుపు**

**పుణే:** ప్రొ కబడ్డీ లీగ్‌లో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో తలైవాస్ 38–27 స్కోరుతో జైపూర్ పింక్‌పాంథర్స్‌పై గెలుపొందింది. తమిళ్ జట్టు రెయిడర్లు నరేందర్ (13 పాయింట్లు), అజింక్యా పవార్ (6 పాయింట్లు) అదరగొట్టారు. జైపూర్ తరఫున అర్జున్ దేశ్వాల్ 9 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. హరియాణా స్టీలర్స్, పుణేరి పల్టాన్ జట్ల మధ్య జరిగిన పోరు 27–27తో టైగా ముగిసింది. హరియాణా జట్టులో మన్‌జీత్ (8), మీతు శర్మ (8) రాణించారు. పుణేరి జట్టులో మోహిత్ గోయత్ 17 సార్లు కూతకు వెళ్లి 11 పాయింట్లు సాధించాడు. మూడో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 34–29తో యూపీ యోధాస్‌ను ఓడించింది. పైరేట్స్‌లో సచిన్ (11), రోహిత్ (7) చక్కని ప్రదర్శన కనబరచగా, యోధాస్ జట్టులో స్టార్ రెయిడర్ ప్రదీప్ నర్వాల్ (12) రాణించాడు.

# సత్తా చాటిన ముత్తు

- సెమీస్ చేరి పతకం ఖాయం
- జూనియర్ ప్రపంచ బ్యాడ్మింటన్



**శాంటండెర్ (స్పెయిన్):** భారత రైజింగ్ షట్లర్ శంకర్ ముత్తుసామి జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. ఈ టోర్నీలో నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన అతను పురుషుల అండర్–19 సింగిల్స్‌లో సెమీ ఫైనల్లోకి ప్రవేశించాడు. దీంతో ఈ భారత ఆటగాడికి కనీసం కాంస్యమైనా దక్కుతుంది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ముత్తుసామి 21–18, 8–21, 21–16తో హు జె అన్ (చైనా)ను కంగుతినిపించాడు. ఒక గంటా 31 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో భారత టీనేజ్ షట్లర్‌కు చైనా ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైంది. తొలి గేమ్‌ను గెలిచేందుకు చెమటోడ్చిన శంకర్‌కు రెండో గేమ్‌లో నిరాశ తప్పలేదు. అయితే నిర్ణాయక మూడో గేమ్‌ను గెలిచి ముందంజ వేశాడు. శనివారం జరిగే సెమీఫైనల్లో భారత షట్లర్ థాయ్‌లాండ్‌కు చెందిన పనిత్చఫాన్ తీరరత్సకుల్‌తో తలపడతాడు. జూనియర్ ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పతకం దక్కించుకున్న 9వ భారత ఆటగాడు ముత్తుసామి. లక్ష్యసేన్ 2018లో చివరిసారిగా భారత్‌కు పతకం (కాంస్యం) అందించాడు.

# సెమీస్‌లో సాత్విక్–చిరాగ్ జోడి

ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్



**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ఆశల పల్లకిని మోస్తున్న ఏకైక జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ షెట్టి సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇంటా బయటా విశేషంగా రాణిస్తోన్న భారత పురుషుల డబుల్స్ జోడీ శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్, వరల్డ్ నంబర్‌వన్ టకురో హోకి–యుగో కొబయషి (జపాన్) జంటను కంగు తినిపించింది. 49 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం వరుస గేముల్లో 21–12, 21–16 టాప్‌సీడ్ జంటకు ఇంటిదారి చూపింది. హోకి–యుగోతో తలపడిన నాలుగు మ్యాచ్‌లలో వీరికి ఇది మూడో విజయం కాగా... వీరిద్దరు ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీస్ చేరడం ఇది మూడో సారి. శనివారం జరిగే సెమీఫైనల్లో భారత జోడీ కొరియాకు చెందిన చొయ్ సొల్ గ్యు–కిమ్ వోన్ హో జంటను ఎదుర్కొంటుంది.

# ఫైనల్లో భారత్

సుల్తాన్ ఆఫ్ జొహార్ కప్ హాకీ



**జొహార్ (మలేసియా):** సుల్తాన్ ఆఫ్ జొహార్ కప్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు ఫైనల్లోకి అడుగు పెట్టింది. శుక్రవారం బ్రిటన్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌ను భారత్ 5–5తో 'డ్రా'గా ముగించినా తుది పోరుకు అర్హత సాధించడంలో సఫలమైంది. భారత్ తరఫున పూవన్న (7వ నిమిషం), అమన్‌దీప్ (50), అరైజీత్ సింగ్ (53), శార్దా నంద్ (56, 58) గోల్స్ సాధించారు. బ్రిటన్ ఆటగాళ్లలో మ్యాక్స్ అండర్సన్ (1వ నిమిషం, 40వ), జామీ గోల్డెన్ (54, 56) రెండేసి గోల్స్ కొట్టగా, హారిసన్ స్టోన్ (42) మరో గోల్ నమోదు చేశాడు. ఐదు మ్యాచ్‌ల తర్వాత 7 పాయింట్లు సాధించిన భారత్ ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది. 4 మ్యాచ్‌ల ద్వారానే 10 పాయింట్లు సాధించిన ఆస్ట్రేలియా ముందే ఫైనల్‌కు అర్హత సాధించగా, ఫైనల్ స్థానం కోసం దక్షిణాఫ్రికాతో భారత్ పోటీలో నిలిచింది. అయితే తర్వాత జరిగిన చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 6–1 తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేయడంతో భారత్ ముందంజ వేసింది. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

## క్లుప్తంగా

### ఆర్టీసీకి స్కోచ్ అవార్డు

సాక్షి, అమరావతి: నగదు రహిత లావాదేవీలు, కాగిత రహిత టికెట్లు జారీ విధానానికి గాను స్కోచ్ అవార్డును రాష్ట్ర ప్రజా రవాణా విభాగం (ఆర్టీసీ) సాధించింది. వర్చువల్ విధానంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ (ఆపరేషన్స్) కేఎస్ బ్రహ్మానందరెడ్డి ఈ అవార్డును స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు పి.కృష్ణమోహన్, రవివర్మ పాల్గొన్నారు.

### బీజేపీ, జనసేనను ఎవరూ విడదీయలేరు

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి



కడప అర్బన్: రాష్ట్రంలో బీజేపీ, జనసేన పార్టీలను విడదీసే సామర్థ్యం ఎవరికీ లేదని భారతీయ జనతాపార్టీ (బీజేపీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కడప నగరంలోని ఆర్అండ్బీ అతిథిగృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, జనసేన విడిపోవాలని కొంతమంది ఏపీలో కోరుకుంటున్నారని.. అయితే అంత సామర్థ్యం ఎవరికీ లేదన్నారు. ఏపీ రాజకీయాల్లో బీజేపీ, జనసేన అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని చెప్పారు. తెలంగాణలో కేసీఆర్‌కు కోర్టులో చుక్కెదురైందని తెలిపారు.సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు.సీఎం జగన్‌తో సమావేశమైన దర్శకుడు రాంగోపాల్ వర్మ సినిమా తీస్తున్నట్లు ట్వీట్ చేశారని, ప్రస్తుతం ఆయన సినిమాలు చూసే స్థితిలో ప్రజలు లేరన్నారు. పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

### జాతీయ మీడియా అవార్డ్సకు ఎంట్రీలు ఆహ్వానం

- నవంబర్ 30లోగా ఎంట్రీలు పంపాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వెల్లడి

సాక్షి, అమరావతి: ఓటు హక్కు వినియోగంపై ఓటర్ల చైతన్యం, అవగాహన–2022 పేరిట భారత ఎన్నికల సంఘం జాతీయ మీడియా అవార్డులను ప్రదానం చేసేందుకు వివిధ మీడియా సంస్థల నుంచి ఎంట్రీలను ఆహ్వానిస్తోందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022కు సంబంధించి వచ్చే జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవం రోజున ఈ అవార్డులను ఎన్నికల సంఘం ప్రదానం చేయనుందని ఆయన పేర్కొన్నారు. అవార్డు కింద నగదు పురస్కారంతో పాటు సైటేషన్, ఫలకం ప్రదానం చేస్తారని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల ప్రక్రియలో ఓటర్లను పెద్దఎత్తున భాగస్వామ్యం చేసేందుకు ఓటు వినియోగంపై చైతన్యం కలిగించడం, ఓటరుగా నమోదు వంటి అంశాల్లో విశేష కృషి చేసిన మీడియా హౌస్‌లకు ఈ అవార్డులను ప్రదానం చేస్తారని మీనా తెలిపారు. ఎంట్రీలను నవంబర్ 30వ తేదీలోగా లవ్ కుశ్ యాదవ్, అండర్ సెక్రటరీ (కమ్యూనికేషన్) ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వాచన్ సదన్, అశోక్ రోడ్, న్యూఢిల్లీ 110001 అడ్రస్‌కు, media&division@eci.gov.in మెయిల్ ఐడీకి పంపవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 01123052033 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చని చెప్పారు.

## పులి ఎదురొచ్చినా..

# తగ్గేదే లే!

### నల్లమలలో సాహసవంతమైన వన్యప్రాణి హనీ బ్యాడ్జర్



- దేహం చిన్నదైనా తెగువ ఎక్కువ
- పెద్దపులులు, చిరుతలను సైతం ఎదిరించే ధైర్యం సొంతం.. వాసన పసిగట్టటంలో స్నిఫర్ డాగ్‌ను మించిన నేర్పరి

– పెద్దదోర్నాల

**హనీ బ్యాడ్జర్... తెలుగులో రైలు ఎలుగు.. నల్లమల అభయారణ్యంలో ఉన్న అరుదైన వన్యప్రాణుల్లో ఇది ఒకటి. ఎత్తు కేవలం 12 అంగుళాలు. దాని పంజాకు గోళ్లు మూడు అంగుళాల పొడవు ఉంటాయి. బరువు సుమారు పది కిలోలు మాత్రమే. చూసేందుకు ఎలుగుబంటికి జిరాక్స్ కాపీలా మరుగుజ్జుగా ఉంటుంది. కానీ, పౌరుషంలో దీనికి మరొక వన్యప్రాణి సాటిరాదు. పులి ఎదురొచ్చినా వెనక్కి తగ్గదు. ఇంత పౌరుషం, ధైర్యం ఉన్న ఈ వన్యప్రాణి జీవితకాలం ఏడేళ్లు మాత్రమే. ఈ జీవికి అత్యంత ఇష్టమైన ఆహారం తేనె తుట్టెల్లోని లార్వా. అందుకే దీనిని హనీ బ్యాడ్జర్ అని పిలుస్తారు.**



చిరుతతో పోరాడుతున్న హనీ బ్యాడ్జర్..

#### అతి చిన్నది... ఒళ్లంతా ముళ్లున్నది...

నల్లమల అభయారణ్యంలో సంచరించే వన్యప్రాణుల్లోకెల్లా చిన్నదిగా కనిపించే హనీబ్యాడ్జర్ అత్యంత తెగువను ప్రదర్శిస్తుంది. పది కిలోల బరువు ఉండే దీని చర్మం మందంగా, ఒదులుగా ఉంటుంది. ఒళ్లంతా ముళ్లు ఉంటాయి. అందువల్ల దీనిపై ఏ జంతువు దాడి చేసినా వాటికి పట్టు చిక్కదు. ముళ్ల పందులు దాడి చేసినా హనీ బ్యాడ్జర్లను ఏమీ చేయలేవు. పెద్ద పులులకు సైతం ఎదురు తిరిగి భీకరంగా అరుస్తూ పోట్లాటకు సిద్ధపడతాయి. ఏడాదికి ఒక సంతానానికి జన్మనిచ్చే ఈ హనీ బ్యాడ్జర్లు మాంసాహారులు. వీటి ఆహారంలో 25 శాతం పాములే ఉంటాయి. పాములు దీని కంట పడితే వేటాడి వెంటాడి చంపి తినేంత వరకు వెనక్కి వెళ్లవు. వాసన పసిగట్టటంలో స్నిఫర్ డాగ్‌ను మించిన నేర్పరితనం హనీ బ్యాడ్జర్ల సొంతం. భూమి లోపలి పొరల్లో ఏ రకమైన ఆహారం ఉందో వాసన పసిగట్టే శక్తి వీటి సొంతం. తమ పంజాకున్న పదునైన గోళ్లతో క్షణాల వ్యవధిలో గోతులు తవ్వి ఆహారాన్ని సంపాదించుకుంటాయి. కందిరీగలు, తేనెటీగలు, విషకీటకాలు కుట్టినా ఏ విధమైన అపాయం లేకుండా దీని టాక్సిన్‌లు దృఢంగా ఉంటాయి.

#### పెద్దపులిని ధైర్యంగా ఎదుర్కొంటాయి

హనీబ్యాడ్జర్లు చాలా ధైర్యం కలిగిన వన్యప్రాణులు. వాసన పసిగట్టి ఆహారాన్ని సేకరించడంలో స్నిఫర్ డాగ్‌ను మించిన నైపుణ్యాన్ని కనబరుస్తుంటాయి. అటవీ ప్రాంతంలో సంచరించే క్రమంలో పులి వచ్చినా ఎదురు తిరుగుతాయి. నల్లమలలోని అన్ని ప్రాంతాల్లో ఇవి సంచరిస్తుంటాయి. ఇవి పాములను అత్యంత ఇష్టంగా తింటాయి.


– విశ్వేశ్వరరావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి, పెద్దదోర్నాల

## సౌర గోళంపై అధ్యయనానికి

# ఆదిత్య–ఎల్1

### వచ్చే ఏడాది జనవరిలో ప్రయోగం

- పీఎస్ఎల్‌వీ సీ56 ద్వారా ప్రయోగించే అవకాశం
- సౌర గోళంలో గాలులు, జ్వాలలు, రేణువుల తీరుతెన్నులపై పరిశోధనలు.. బెంగళూరులో రూపుదిద్దుకుంటున్న ఉపగ్రహం



సూళ్లూరుపేట: సౌర గోళంలో సౌర గాలులు, జ్వాలలు, రేణువుల తీరుతెన్నులపై పరిశోధనలు చేయడానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సిద్ధమవుతోంది. ఇందుకోసం వచ్చే ఏడాది జనవరి చివరి వారంలో ఆదిత్య–ఎల్1ను ప్రయోగించనుంది. సౌర తుపాన్ల సమయంలో వెలువడే రేణువులతో భూమిపై సమాచార వ్యవస్థకు అవరోధాలు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు గతంలోనే అంచనాకు వచ్చారు. ఈ నేపథ్యంలో రేణువులతోపాటు కాంతి మండలం (ఫొటోస్ఫియర్), వర్ణ మండలం (క్రోమోస్ఫియర్)లపై అధ్యయనం చేసి సమాచారాన్ని సేకరించనున్నారు. కాగా ఆదిత్య–ఎల్1 ఉపగ్రహాన్ని బెంగళూరులోని ప్రొఫెసర్ యూఆర్ రావు స్పేస్ సెంటర్ (యూఆర్ఎస్‌సీ)లో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.శంకర సుబ్రమణియన్ ఆధ్వర్యంలో రూపొందిస్తున్నారు. గతంలో ఆయన ఆస్ట్రోశాట్, చంద్రయాన్–1, చంద్రయాన్–2 తదితర మిషన్లకు సంబంధించి అనేక హోదాల్లో పనిచేశారు.

**సూర్యుడిపై నిరంతర పరిశోధన**

1,475 కిలోల బరువు కలిగిన ఆదిత్య–ఎల్1 ఉపగ్రహాన్ని పీఎస్ఎల్‌వీ సీ56 ద్వారా ప్రయోగించనున్నారు. ఇందులో పేలోడ్స్ బరువు 244 కిలోలు మాత్రమే. మిగిలిన 1,231 కిలోలు ద్రవ ఇంధనంతో నింపి ఉంటుంది. ఉపగ్రహాన్ని సూర్యుడి వైపు తీసుకెళ్లేందుకు ద్రవ ఇంధనం అవసరం. కాగా మొదట ఉపగ్రహాన్ని జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టాక.. భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని లాగ్రేంజియన్ బిందువు–1 (ఎల్–1)లోకి పంపడానికి 177 రోజులు పడుతుంది. అక్కడి నుంచి ఉపగ్రహం ఎలాంటి అవరోధాలు లేకుండా సూర్యుడిపై జరిగే మార్పులను నిరంతరం పరిశోధించేందుకు వీలవుతుందని అంచనా వేస్తున్నారు.

#### ఆరు పేలోడ్స్ అమర్చి..

సూర్యుడిపై అధ్యయనం చేయడానికి పంపే ఉపగ్రహంలో ఆరు పేలోడ్స్.. యాస్‌పెక్స్, సూట్, వెల్సి, హెలియోస్, పాపా, సోలెక్స్ అమరుస్తున్నారు. సూర్యుడి వెలుపలి వలయాన్ని కరోనా అంటారు. సూర్యగోళానికి వేల కిలోమీటర్ల దూరం వరకు ఇది విస్తరించి ఉంటుంది. కరోనాలో ఉష్ణోగ్రత దాదాపు పది లక్షల డిగ్రీల కెల్విన్ వరకు ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలాగే సూర్యుడి అంతర్భాగ ఉష్ణోగ్రత ఆరు వేల కెల్విన్ డిగ్రీల వరకు ఉంటుందంటున్నారు. కాగా కరోనాలో వేడి విపరీతంగా పెరిగిపోతుండడానికి కారణం శాస్త్రవేత్తలకు అంతుబట్టడం లేదు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై కూడా ఆదిత్య–ఎల్1 పరిశోధనలు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటివరకు చంద్రుడు, అంగారకుడిపై చేసిన పరిశోధనలు విజయవంతం కావడంతో ఆదిత్య ద్వారా సూర్యుడి రహస్యాలు తెలుసుకోవడానికి సిద్ధమవుతున్నారు.



# పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

- నవంబర్‌లో ముంబై, ఢిల్లీల్లో మెట్ ఎక్స్‌పో, ఇండియా కెమ్ సమావేశాలు
- వీటిలో పాల్గొని రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను వివరిస్తాం
- అధికారులతో సమీక్షలో ఏపీఈడీబీ సీఈవో సృజన



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా వరుస రోడ్ షోలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) సీఈవో జి.సృజన తెలిపారు. నవంబర్ మొదటి వారంలో ముంబై, ఢిల్లీల్లో నిర్వహించనున్న మెట్ ఎక్స్‌పో, ఇండియా కెమ్–2022కు అధికారులు హాజరవుతారని వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తారన్నారు. ఈ మేరకు హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల విధుల్లో ఉన్న సృజన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ఈడీబీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏపీఈడీబీ రెండు కీలక రంగాలకు చెందిన అంతర్జాతీయ బిజినెస్ ఎక్స్‌పోల్లో భాగస్వామి అవుతుందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అపార అవకాశాలున్న ఇంజనీరింగ్–టెక్నాలజీ, కెమికల్స్–పెట్రో కెమికల్స్ రంగాలపై ముంబై, ఢిల్లీల్లో జరిగే అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొంటామని చెప్పారు. నవంబర్ 2 నుంచి 3 వరకు ఢిల్లీ ప్రగతి మైదాన్ వేదికగా ఫిక్కీ ఆధ్వర్యంలో కెమికల్స్–పెట్రోకెమికల్స్ రంగాలపై 'ఇండియా కెమ్ –2022'' పేరిట 11వ అంతర్జాతీయ సదస్సు జరుగుతుందన్నారు. ఇందులో ఏపీ భాగస్వామ్య రాష్ట్రంగా చేరడంతో ప్రత్యేక స్టాల్స్, సీఈవో రౌండ్‌టేబుల్ సమావేశాలు, సెమినార్లలో పాల్గొనే అవకాశం లభించిందని తెలిపారు. వీటిని వినియోగించుకోవడం ద్వారా విశాఖ–కాకినాడ పెట్రోలియం, కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (పీసీపీఐఆర్)తో పాటు పీఎల్ఐ స్కీమ్ కింద రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను అధికారులు వివరిస్తారన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నేతృత్వంలోని అధికారుల బృందం హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు.

#### డిసెంబర్‌లో రోడ్ షోలు

అలాగే మెటీరియల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాల్లో ఇండియాలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించే విధంగా నవంబర్ 2 నుంచి 4 వరకు ముంబైలో మెట్ ఎక్స్‌పో జరుగుతుందని సృజన వెల్లడించారు. దీనికి వివిధ రంగాలకు చెందిన 150 మందికిపైగా పారిశ్రామికవేత్తలు హాజరవుతారన్నారు. మెట్ ఎక్స్‌పోలో అల్ట్రాటెక్, రిలయన్స్, జేఎస్‌డబ్ల్యూ, అక్జో నోబెల్, మహీంద్రా, టాటా స్టీల్ వంటి కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరుపుతామని వివరించారు. డిసెంబర్‌లో తైవాన్, జపాన్, దక్షిణ కొరియా దేశాల్లో రోడ్ షోలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సృజన అధికారులను కోరారు. రాష్ట్రంలోకి అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేలా ఈ రోడ్‌షోలను నిర్వహించనున్నామని తెలిపారు.

## 1 నుంచి తిరుపతిలో సర్వ దర్శనం టోకెన్ల జారీ

### డిసెంబర్ 1 నుంచి బ్రేక్ దర్శన సమయం మార్పు



వైవీ సుబ్బారెడ్డికి విరాళాన్ని అందజేస్తున్న దాతలు

తిరుమల: టీటీడీ బోర్డు నిర్ణయం మేరకు నవంబర్ 1 నుంచి తిరుపతిలో ఉచిత సర్వ దర్శనం టైంస్లాట్ టోకెన్ల జారీని పునఃప్రారంభిస్తామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, రైల్వే స్టేషన్ వెనుక వైపు గల రెండో సత్రంలో సర్వదర్శనం టోకెన్లు జారీ చేస్తామన్నారు. శని, ఆది, సోమ, బుధవారాల్లో 20,000 నుంచి 25,000 టోకెన్లు, మంగళ, గురు, శుక్రవారాల్లో 15,000 టోకెన్లు అందుబాటులో ఉంటాయన్నారు.

**బ్రేక్ దర్శన సమయం మార్పు:** వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో రాత్రి వేచి ఉండే భక్తులకు ఉదయం త్వరితగతిన దర్శనం కల్పించేందుకు బ్రేక్ దర్శన సమయాన్ని ఉదయం 8 గంటలకు మారుస్తామని ఈవో చెప్పారు. డిసెంబర్ 1 నుంచి ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేస్తామన్నారు.

**దాతలకు మాధవంలో గదుల బుకింగ్:** శ్రీవాణి ట్రస్ట్ దాతలకు తిరుపతిలోని మాధవంలో గదులు బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని, డిసెంబర్ 1 నుంచి ఇది అమల్లోకి వస్తుందని ఈవో తెలిపారు. శ్రీవాణి ట్రస్ట్ దాతలకు ఆఫ్‌లైన్ టికెట్లు కూడా మాధవంలోనే మంజూరు చేస్తామన్నారు.

**ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.కోటి విరాళం:** ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు శుక్రవారం కోల్‌కతాకు చెందిన పారట్ హోసియార్ సంస్థ అధినేత సంజయ్ రాతి రూ.కోటి విరాళాన్ని అందించారు. విరాళం చెక్కును శ్రీవారి ఆలయం ఎదుట టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డికి అందజేశారు.

**సర్వ దర్శనానికి 15 గంటలు**

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. 31 క్యూ కంపార్ట్‌మెంట్‌లు నిండాయి. సర్వ దర్శనానికి 15 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటలు పడుతోంది.



## రాయచోటి నియోజకవర్గంలో శిల్పారామం

- 13.18 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం
- స్థానికులకు ఉపాధి లభించేలా నిర్మాణం

సాక్షి, అమరావతి/రాయచోటి: అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో శిల్పారామం ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పర్యాటక శాఖ ఆధ్వర్యాన శిల్పారామం నిర్మాణానికి రాయచోటి నియోజకవర్గం రామాపురం మండలంలోని బండపల్లి గ్రామంలో 13.18ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర శిల్పారామం సీఈవో శ్యామ్ సుందర్ రెడ్డి శుక్రవారం మాట్లాడుతూ గతంలో నగరాలకు మాత్రమే పరిమితమైన శిల్పారామాలను ఇక నుంచి స్థానిక కళలను ప్రోత్సహించే విధంగా ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలను సిద్ధం చేశామని తెలిపారు. అన్నమయ్య జిల్లా నుంచే కొత్త శిల్పారామాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. స్థానికులు వందమందికి ప్రత్యక్షంగా, 200 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. నూతన శిల్పారామంలో స్థానిక హస్తకళాకారులు ఏడాది పొడవునా తమ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల కోసం ప్రత్యేకంగా స్టాల్స్ నిర్మించి, ఉచితంగా కేటాయిస్తామని చెప్పారు. శాస్త్రీయ, జానపద, స్థానిక కళారూపాల పరిరక్షణకు పెద్దపీట వేస్తామని, ఆయా ప్రదర్శనలకు అనువుగా ఏర్పాట్లు చేస్తామని వివరించారు. ప్రజలు అందరూ కుటుంబ సమేతంగా హాయిగా గడిపేలా శిల్పారామాన్ని ఆహ్లాదకర వాతావరణంలో సుందరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. రాయచోటి నియోజకవర్గంలో శిల్పారామం ఏర్పాటుకు పర్యాటక, సాంస్కృతిక, యువజన శాఖ మంత్రి ఆర్కే రోజా, స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి విశేష కృషి చేశారని తెలిపారు. శిల్పారామం నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ చెప్పారు.

## ఏయూలో సౌండ్ ఇంజినీరింగ్ కోర్సులు

- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహణ

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ)లో అంతర్జాతీయ ప్రమాణాలతో సౌండ్ ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్, ఫిల్మ్ ఎడిటింగ్ కోర్సులను సెయింట్ లూక్స్ సంస్థతో సంయుక్తంగా ప్రారంభిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో సౌండ్ ఇంజినీర్, స్టూడియో డిజైనర్ ఆదిత్య మోదీతో కలిసి కోర్సుల వివరాలతో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ ఏయూ శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంతో పాటు, కళలకు సమాన ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెప్పారు. ఏయూ నుంచి స్టూడియో ఏర్పాటుకు అవసరమైన భవనం అందిస్తామన్నారు. దీనిలో లూక్స్ సంస్థ అధునాతన డాల్బీ అట్మాస్ స్టూడియోను నిర్మిస్తుందన్నారు. ఏయూలో చదువుతున్న విద్యార్థులతో పాటు ఎవరైనా ఈ కోర్సులను అభ్యసించే అవకాశం ఉందన్నారు. 3, 6నెలలు, ఏడాది కాల వ్యవధితో ఈ కోర్సు ఉంటుందన్నారు. ఏయూ అనుబంధ కళాశాలల విద్యార్థులు సైతం ఈ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ఆదిత్య మోదీ మాట్లాడుతూ సౌండ్ ఇంజినీరింగ్‌కు ఎంతో డిమాండ్ ఉందని, ఈ రంగానికి అవసరమైన నిపుణులను తీర్చిదిద్దే దిశగా యువతకు ఉపయుక్తంగా ఈ కోర్సు నిలుస్తుందన్నారు. సెయింట్ లూక్స్ సంస్థ వ్యవస్థాపకులు సంగీత దర్శకులు ఆశీర్వాద్ లూక్ మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా విశాఖలోని ఏయూలో డాల్బీ అట్మాస్ స్టూడియో నిర్మాణం జరుగుతోందన్నారు.

**విశాఖతో ఉపాధి అవకాశాలు: వీసీ**

పరిపాలనా రాజధానిగా విశాఖ మారితే విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలుంటాయని ఏయూ వీసీ ప్రసాద రెడ్డి అన్నారు. వర్సిటీ వ్యవస్థాపక కులపతి సీఆర్ రెడ్డి విశాఖను 'సిటీ ఆఫ్ డెస్టినీ' అని సంబోధించారని, నేడు అది నిజం అవుతోందన్నారు. విశాఖకు చిత్ర పరిశ్రమను ఆహ్వానించాలన్నారు. విశాఖలోని సముద్ర తీరం, చేరువలో ఉన్న మన్యం చిత్ర పరిశ్రమకు అనుకూలంగా నిలుస్తాయన్నారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. 